బీహార్‌లో ఎన్డీయే గెలుపు ఖాయం: ప్రధాని 5లో

వచ్చే యేడాది నుంచి ప్రభుత్వ బడుల్లో ప్రిప్రైమరీ క్లాసులు 6లో

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
8-11-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 277 పేజీలు: 8+16 వెల: 6.50

మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
45
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం



శుక్రవారం వందేమాతరంగీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక స్టాంపును విడుదల చేసిన ప్రధాని మోడీ

## భరతమాత ఆరాధన మంత్రం 'వందేమాతరం'

**150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక స్టాంపును విడుదల చేసిన ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ, నవంబరు 7:** వందేమాతరం గేయం మన చిరకాలస్వప్నం లాంటిదని, ఒక ధృఢ సంకల్పానికి బీజం వేసిందని, ఒక నిత్యపఠనమే పరమావధిగా ఉన్న మంత్రమని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. భరత మాత ఆరాధన సాధన అని అన్నారు. వందేమాతరం 150 ఏళ్ల స్మారకోత్సవాలు నిర్వహించుకుంటున్నామని ఇవి దేశప్రజలకు ఎంతో ప్రేరణనిస్తాయని మోడీ అన్నారు. వందే >>2

# వాళ్లిద్దరూ 'బ్యాడ్ బ్రదర్స్'

## కిషన్ రెడ్డి, కెటిఆర్ హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

**హైడ్రా, ఈగల్‌పై వారికంత కక్ష ఎందుకో?**

**కమాండ్ కంట్రోల్, సచివాలయం వల్ల కొత్త ఉద్యోగాలు వచ్చాయా?**

**జూబ్లీ ఓటర్లు విజ్ఞతతో ఆలోచించాలి: సిఎం రేవంత్**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 7:** కేంద్ర, రాష్ట్రంలో 2004-2014 మధ్య కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే భాగ్యనగరం ఎక్కువగా అభివృద్ధి చెందిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ఒఆర్ఆర్ (ఔటర్ రింగురోడ్డు), శంషాబాద్ ఎయిర్‌పోర్టు, మెట్రోరైలు ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకు వచ్చిందని ఆయన గుర్తుచేశారు. శుక్రవారం జూబ్లీ హిల్స్‌లోని ఎంపి క్యాంప్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. 2014 నుంచి కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బిఆర్ఎస్ రాష్ట్రానికి చేసింది శూన్యమని రేవంత్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆక్షేపించారు.

హైదరాబాద్‌కు యుపిఎ ప్రభుత్వం ఇచ్చిన ఐటిఐఆర్‌ను రద్దు చేసింది ఎవరు? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఐటిఐఆర్ కూడా మంజూరు చేసి ఉంటే తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెంది ఉండేదన్నారు. వరదలు వచ్చి హైదరాబాద్ మునిగిపోతే కేంద్రం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి వరద సాయంగా రూపాయి కూడా తేలేదని ధ్వజమెత్తారు. పదేళ్లలో మెట్రో రైలును కొత్తగా కిలోమీటరు కూడా పొడిగించలేదన్న ఆయన మంజూరైన పాత >>2

## విద్యార్థుల జీవితాలతో ఆటలా?

**బకాయిలు నేడు కాకుంటే రేపు వస్తాయి: సిఎం** 2లో

## బనకచర్లపై ఎపి వెనక్కి

**డిపిఆర్ టెండర్లు రద్దు : పోలవరం అథారిటీ సమావేశంలో వెల్లడి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 7:** బనకచర్లపై ఆంధ్రప్రదేశ్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు లింక్ ప్రాజెక్టు నిర్మాణానికి డిపిఆర్ కోసం చేపట్టిన టెండర్ల ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన పోలవరం అథారిటీసమావేశంలో ఈఅంశాన్ని వెల్లడిం >>2

## ప్రైవేటు కాలేజీల బంద్ విరమణ

**ఉప ముఖ్యమంత్రి భట్టితో చర్చలు సఫలం**

**రూ. 600 కోట్లు విడుదలకు ప్రభుత్వం అంగీకారం**

**త్వరలో మరో రూ. 300 కోట్లు చెల్లింపునకు హామీ**

**హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 7:** రాష్ట్రంలో ఐదు రోజులుగా కొనసాగిన ప్రైవేటు కాలేజీల బంద్ ముగిసింది. శుక్రవారం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య(ఫాతి) ప్రతినిధులు జరిపిన చర్చలు సఫలం కావడంతో .. కాలేజీల బంద్‌ను విరమిస్తున్నట్టు ఫాతి నేతలు ప్రకటించారు. తదుపరి నిరసన కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకున్నట్టు ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు ప్రకటించాయి. చర్చల అనంతరం ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు >>2



శక్రవారం ప్రైవేటు కాలేజీల ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న డి.సిఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

## జూబ్లీ తర్వాత కీలక మార్పులు

**ఎన్టీఆర్, పిజెఆర్ ఇప్పుడు గుర్తుకు వచ్చారా?**

**బిఆర్ఎస్ ఒత్తిడితోనే మైనారిటీలకు మంత్రి పదవి**

**మీట్ ది ప్రెస్‌లో మాజీ మంత్రి హరీష్ రావు** 2లో







శుక్రవారం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో 'వందేమాతరం' ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రధాని మోడీ

# త్వరలోనే భారత్ పర్యటనకు వస్తున్నా!

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్

**వాషింగ్టన్, నవంబరు 7:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై భారీగా సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాస్త మెత్తబడినట్లు కనిపిస్తున్నది. త్వరలోనే తాను భారత్‌కు వచ్చే అవకాశం ఉందని ప్రకటించారు. ప్రధాని మోడీపై ప్రశంసలు కురిపించారు. మోడీ తనకు గొప్ప స్నేహితుడని, భారత్-అమెరికా వాణిజ్య సంబంధాల బలోపేతమే తమ లక్ష్యమని చెప్పుకొచ్చారు. ఓవల్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోడీతో వాణిజ్య చర్చలు చాలా బాగా జరుగుతున్నాయన్నారు.

మోడీ రష్యా నుంచి చమురు కొనడం చాలావరకు మానేశారని చెప్పారు. ఆయన తనకు గొప్ప స్నేహితుడని, మా మధ్య చర్చలు జరుగుతున్నాయి. తాను భారత్ రావాలని మోడీ కోరుకుంటున్నారని వెల్లడించారు. తాము దానిని పరిశీలిస్తున్నామని చెప్పారు. తాను వెళ్తానని, ప్రధాని మోడీ గొప్ప వ్యక్తి అని చెప్పుకొచ్చారు. వచ్చే ఏడాది భారత్‌లో పర్యటించాలని మీరు ప్లాన్ చేస్తున్నారా? అని ఓ విలేకరి ప్రశ్నించగా, 'అవును. అలాగే కావొచ్చు' అని ట్రంప్ అన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.



మహిళా క్రికెటర్లు శ్రీచరణి, మిథాలీరాజ్ శుక్రవారం అమరావతిలో ఏపి సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌ను కలుసుకొన్న దృశ్యం

# వాళ్లిద్దరూ 'బ్యాడ్ బ్రదర్స్'

>> బస్తీ మెట్రోను కూడా పక్కకు పెట్టారని విమర్శించారు. 2047 నాటికి దేశానికి స్వాతంత్రం వచ్చి వందేళ్లు కావస్తోంది. భవిష్యత్ ప్రణాళికలు ఎలా ఉండాలనే దానిపై విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నాం. మెట్రో విస్తరణకు రూ.43వేల కోట్లతో ప్రణాళికలు కేంద్రానికి ఇచ్చాం. ఆనాడు హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం కొట్లాడిన శశిధర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డిని హైదరాబాద్ బ్రదర్స్ అనే వాళ్లు. నేడు హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి, కెటిఆర్‌లను బ్యాడ్ బ్రదర్స్ అంటున్నారు. వీరిద్దరూ కలిసి మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు, ఫ్యూచర్‌సిటీని అడ్డుకుంటున్నారు. గోదావరి జలాలు 20 టిఎంసిలు హైదరాబాద్‌కు తేవాలని ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారు అని రేవంత్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్ నగరంలో నిర్మించాలనుకున్న పైవంతెనలు, అండర్ పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లకు అడ్డంకులు సృష్టిస్తున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. 30 యేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కంటోన్మెంట్ నుంచి శామీర్‌పేట, మేడ్చల్‌కు ఎలివేటెడ్ కారిడార్లకు అప్రూవల్ తెచ్చి రూ.5,000 కోట్లతో పనులు ప్రారంభించామన్నారు. ఉత్తర తెలంగాణ మొత్తం ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్లపైనే ఆధారపడి ఉందని ఆయన స్పష్టం చేశారు. పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ వాటి అనుమతులకు ప్రయత్నం చేయలేదని, వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చామన్నారు. అదనంగా కొత్తగూడెం, రామగుండం విమానాశ్రయాలకు ప్రయత్నాలు చేస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. జూబ్లీహిల్స్ ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. తాము చేస్తున్న అభివృద్ధిని చూసి ఓటు వేయాలని విన్నవించారు. పదేళ్లలో జూబ్లీహిల్స్‌కు బిఆర్ఎస్, బిజెపిలు ఏం చేశాయని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ అభివృద్ధి పథంలో సాగిందని ఉద్ఘాటించారు. ఎవరి హయాంలో హైదరాబాద్ అభివృద్ధి జరిగిందో జూబ్లీహిల్స్ ఓటర్లు ఆలోచించాలని కోరారు. ఈఎన్నికలో ప్రజలు ఆలోచనతో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. తమ పాలన, బిఆర్ఎస్ పాలన చూసి బేరీజు వేసుకొని ఓటు వేయాలని విన్నవించారు. సచివాలయంలో ఉన్న గుడి, మసీదులను కూలగొడితే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వమే అనేక విద్యాసంస్థలను నెలకొల్పిందని, కాంగ్రెస్ నిర్ణయాలతోనే హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా మారిందని పేర్కొన్నారు. మిగులు బడ్జెట్‌తో మాజీ సిఎం కెసిఆర్‌కి అధికారం అప్పగిస్తే రూ. 8.11 లక్షల కోట్ల అప్పును తమకు అప్పగించారని ఫైర్ అయ్యారు. పేద ప్రజలకు ఆ సచివాలయం వల్ల ఏమైనా ఉపయోగం ఉందా? అని ప్రశ్నించారు. కొత్త ఉద్యోగాలు ఏమైనా వచ్చాయా? ప్రతిపక్షాలు, మీడియా ప్రతినిధులపై నిఘా పెట్టేందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారని ఆక్షేపించారు. ఎవరికీ అనుమతి లేని విలాసవంతమైన భవనాలు మాత్రమే నిర్మించారని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. ఈ పదేళ్లలో తెలంగాణ రాష్ట్రానికి కెసిఆర్, మోడీ, కిషన్‌రెడ్డి చేసిన ప్రణాళిక ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నది కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కెటిఆర్ అండ్ కోనేనని ఆరోపించారు. మెట్రో విస్తరణ, మూసీప్రక్షాళన, ఫ్యూచర్ సిటీలను అడ్డుకుంటుంది కేటీఆర్, కిషన్‌రెడ్డిలేనని విమర్శించారు. కెసిఆర్‌హయాంలో జిహెచ్ఎంసీపై రూ.10 వేల కోట్ల అప్పు చేశారని ఆరోపణలు చేశారు. హైదరాబాద్ దాహార్తి తీర్చేందుకు బిఆర్ఎస్ తీసుకున్న నిర్ణయం ఏమైందని ప్రశ్నించారు. ఎల్ అండ్ టీ మునగడానికి కారణం కెసిఆర్, కెటిఆర్ మాత్రమేనని ఆక్షేపించారు. ఎల్ అండ్ టీ కంపెనీని బ్లాక్ మెయిల్ చేసి కెసిఆర్, కెటిఆర్ లక్షలాది రూపాయలు కొల్లగొట్టారని ఆరోపించారు. ఫ్లై ఓవర్ విధానాన్ని తెచ్చిందే కాంగ్రెస్ పార్టీనేనని నొక్కిచెప్పారు. కెసిఆర్‌హయంలో ఒఆర్ఆర్‌ను దారుణంగా అమ్ముకున్నారని విమర్శించారు.నేడున్న జాతీయ, అంతర్జాతీయ సంస్థలన్నీ కాంగ్రెస్ హయాంలోనివేనని స్పష్టంచేశారు.గత పదేళ్లలో తెలంగాణకు కెసిఆర్, కిషన్‌రెడ్డి చేసిందేంటో చెప్పాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రాజెక్టులను ప్రధాని మోడీ రద్దు చేశారని ధ్వజమెత్తారు. కిషన్‌రెడ్డి, కెటిఆర్ తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కెటిఆర్ అండ్‌కో మెట్రో విస్తరణను అడ్డుకుంటు న్నారని ఆక్షేపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం, కూలడం మూడేళ్లలోనే జరిగిపోయాయని సెటైర్లు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి రూ.లక్ష కోట్లు గోదావరిలో పోశారని ఆవేదన వ్యక్తంచేశారు. సచివాలయం, కాళేశ్వరం, కమాండ్ కంట్రోల్ సెంటర్.. ప్రగతి భవన్ తప్పా పదేళ్లలో కెసిఆర్ ఏం నిర్మించారని ప్రశ్నలవర్షం కురిపించారు.మేము అధికారంలోకి వచ్చాకే తెలంగాణ పెట్టుబడులు వస్తున్నాయి. గత రెండేళ్లలో తెలంగాణకు రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులుతెచ్చాం. ప్రజలకు ఉపయోగంలేని ప్రాజెక్టులునిర్మించిన బిఆర్ఎస్.. ఇప్పటికీ వాటిని చూపించి ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమే. మేం వచ్చాక 70 వేల ఉద్యోగాలుకల్పించాం. తెలంగాణకు కెటిఆర్ తీసుకొచ్చింది డ్రగ్స్, గంజాయి మాత్రమే. కెటిఆర్ ఒక విషపురుగు.. విష సంస్కృతిని తీసుకొస్తున్నారు. హైదరాబాద్ అభివృద్ధి జరగాలంటే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలవాలి అని సూచించారు. గత పదేళ్లలో మీరుచేసిన అభివృద్ధి, తెచ్చిన ప్రాజెక్టులపై చర్చకు సిద్ధం. నగర అభివృద్ధికి బిఆర్ఎస్, బిజెపి ఎమ్మెల్యేలు అడ్డంకిగా మారారు. నగరాన్ని పరిరక్షించి అభివృద్ధి చేసేందుకే హైడ్రా తీసుకొచ్చాం. హైడ్రా ద్వారా ఆక్రమణల నుంచి చెరువులు, పార్కులను కాపాడుతున్నాం. ఆక్రమణలపై మాత్రమే హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. అక్కడక్కడ పేదలకు ఇబ్బంది కలిగితే న్యాయం చేస్తున్నాం. ఈగల్, హైడ్రా వ్యవస్థలపై కెటిఆర్, కిషన్‌రెడ్డి కక్షగట్టార్ను అని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌ను డ్రగ్స్‌కు అడ్డాగా కెటిఆర్ మార్చారు. ఈగల్ వ్యవస్థ తీసుకొచ్చి గంజాయి, డ్రగ్స్‌ను అరికడుతున్నాం. గంజాయి, డ్రగ్స్ రవాణాదారులను తొక్కిపట్టి నారతీస్తాం. బిఆర్ఎస్, బిజెపి నేతలు తెలంగాణకు చేసిందేమీ లేదు.. వాళ్లకు రాజకీయాలే ముఖ్యం. అభివృద్ధి చేసేంది మేమే.. అందుకే ఓట్లు అడుగుతున్నాం. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే వీళ్లకు ఎందుకు కడుపుమంట?. బిఆర్ఎస్‌లో ఒక్కొక్కరిని రాజకీయంగా ఎలిమినేట్ చేస్తూ వచ్చారు. బిఆర్ఎస్ పార్టీలోని కీలక నేతలను మాజీ మంత్రి హరీశ్‌రావు బయటకు పంపేశారు. చివరకు కుటుంబ సభ్యుల్లోనూ కొందరిని బయటకు పంపేశారు. కవితను కూడా బిఆర్ఎస్ నుంచి బయటకు పంపించేశారు. బిఆర్ఎస్‌ను కబళించేందుకు హరీశ్‌రావు కుట్ర చేస్తున్నారు అని సిఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. బండి సంజయ్‌కు సిఎం రేవంత్ కౌంటర్ ఇచ్చారు. అన్ని మతాలను మేము సమానంగా గౌరవిస్తాం. ప్రధాని మోడీ టోపీ పెట్టుకోలేదా? ముందు వారి విధానం చెప్పాలి. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బిజెపికి డిపాజిట్ కూడా రాదు. డిపాజిట్ రాకపోతే హిందువులకు బిజెపి వ్యతిరేకమని ఒప్పుకుంటారా? బిజెపి గెలవడం కిషన్‌రెడ్డికి ఇష్టం లేదు అని సిఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

# ఎపి వెనక్కి

>> చింది. అంతరాష్ట్ర నదీ జలాల ఒప్పందాలకు విరుద్ధంగా ఎపి ఈ ప్రాజెక్టును చేపడుతోందని తెలంగాణ రాష్ట్రం మొదటి నుంచి వ్యతిరేకిస్తూవచ్చింది. దీనిపై కేంద్రానికి, సిడబ్ల్యుసికి ఫిర్యాదు చేసింది. న్యాయ పోరాటానికి సిద్దమైంది. దీంతో ఎపి ఈ ప్రకటన చేసినట్లు సమాచారం. ఫలితంగా పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ఇప్పట్లో లేనట్లేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ ప్రాజెక్టుపై ఇరు రాష్ట్రాలకు ఎలాంటి వివాదం లేకుండా మరో ప్రణాళికతో కూడా ఏపీ ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు.

# ప్రజా భవన్‌లో బుల్లెట్ ప్రూఫ్ బాత్‌రూమ్‌లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు7:** ప్రజా భవన్ (ప్రగతి భవన్)పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కెసిఆర్ విలాసవంతమైన జీవితం గడిపేందుకే ప్రగతిభవన్ కట్టారని శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఆక్షేపించారు. కెసిఆర్ భయస్తుడు... సద్దాం హుస్సేన్ లాగా ప్రగతి భవన్‌లో మెయిన్ డోర్ల దగ్గర నుంచి బాత్ రూంలో కూడా బుల్లెట్ ప్రూఫ్‌లు పెట్టించుకున్నారని ఎద్దేవా చేశారు. కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడు ఢిల్లీలో ఏ భవనంలో అయితే ఉన్నాడో ఇప్పుడు నాకు కూడా అదే భవనం ఇచ్చారు. ఆ బిల్డింగ్ డోర్ల దగ్గర నుంచి బాత్‌రూమ్ వరకు అన్నీ బుల్లెట్ ప్రూఫే అని అన్నారు. ప్రజా భవన్ పరిస్థితి ఏంటని భట్టి విక్రమార్కను అడిగితే ఇక్కడ కూడా అదే పరిస్థితి ఉందని చెప్పారు. అవి తీసేయాలంటే పెద్ద ఖర్చు అని ఎద్దేవా చేశారు. కుమారుడి భవిష్యత్, వాస్తు కోసమే.. రూ.2 వేలకోట్లతో కెసిఆర్ కొత్త సచివాలయం కట్టారని ధ్వజమెత్తారు.

# ఆరాధన మంత్రం 'వందేమాతరం'

>> మాతరం స్మారక స్టాంపు, నాణెం విడుదలచేసామని, ప్రతి గీతానికి ఒక మూలభావం, సందేశం ఉంటుందని అన్నారు. మన వందేమాతరం మూలభావం భారత్, తల్లి భారతి అని అన్నారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్‌స్టేడియంలో వందేమాతరం 150వ సంస్మరణ దినోత్సవంలో పాల్గొని మాట్లాడిన మోడీ స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాదిమంది భారతీయుల్లో స్ఫూర్తినింపిందని గుర్తుచేసారు. 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఏడాది పొడవునా కార్యక్రమాలునిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. వందేమాతరం గీతం 1875 నవంబరు ఏడోతేదీ బంకింగ్ చంద్ర ఛటర్జీ రచించారు. ఈ గీతం తొలిసారిగా ఛటర్జీ రాసిన ఆనంద్‌మఠ్ నవలలో ప్రచురించారు. అప్పటినుంచి జాతీయ గీతంగా ఆలాపనలోకి వచ్చింది.

**వందేమాతరం చరణాలు తొలగించేసారు!**

వందేమాతం జాతీయ గీతానికి 150 యేళ్లు నిండాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ ఉత్సవంలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మోడీ మాట్లాడుతూ.. వందేమాతరం గీతంలోని కొన్ని ముఖ్యమైన చరణాలను 1937లో తొలగించినట్లు ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేస్తూ మోడీ ఆ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. విభజనకు చెందిన కొన్ని చరణాలను ఆ గేయం నుంచి తొలగించారని, ఇప్పటికీ లాంటి విభజన మైండ్‌సెట్ దేశానికి సవాల్‌గా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో వందేమాతరం 150 ఏళ్లకు చెందిన సంస్మరణ స్టాంపు, నాణాన్ని ప్రధాని రిలీజ్ చేశారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం ఈ దేశ స్వరంగా మారిందన్నారు. ప్రతి భారతీయుడు తమ మనోభావాలను ఆ గేయం ద్వారా వ్యక్తపరిచారన్నారు. కానీ 1937లో దురదృష్టవశాత్తు, వందేమాతరం గేయంలోని కొన్ని చరణాలను తొలగించారని, వందేమాతర గీత విభజన దేశ విభజనకు బీజం వేసిందన్నారు. జాతి నిర్మాణం కోసం రూపొందించిన ఈ మహామంత్రం పట్ల ఎందుకు అన్యాయం జరిగిందో ఈ తరం యువత తెలుసుకోవాలన్నారు. ఇలాంటి విచ్ఛిన్నకర మైండ్‌సెట్ దేశానికి ఇప్పటికీ సవాలే అన్నారు. ఉగ్రవాదం పేరుతో శత్రువులు మన భద్రత, గౌరవంపై దాడి చేస్తే, అప్పుడు భారత్ ఎలా దుర్గ అవతారాన్ని ఎత్తిందో ప్రపంచ వీక్షించినట్లు పేర్కొన్నారు. వందేమాతర గీతం కొత్త స్ఫూర్తిని ఇస్తుందని, ఈ దేశాన్ని కొత్త శక్తితో నింపుతోందన్నారు. వందేమాతరం అంటే ఓ పదం, ఓ మంత్రం, ఓ శక్తి, ఓ కళ, ఓ పట్టుదల అని ఆయన అన్నారు. భారతమాత పట్ల ఇది భక్తికి నిదర్శనమన్నారు. మన చరిత్రను చాటుతూ.. మనకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. అనుకున్నది సాధించలేనిది ఏమీ లేదని, భారతీయులు దేన్నైనా సాధించగలరని, జ్ఞానం..విజ్ఞానం.. సాంకేతిక నిండిన దేశాన్నినిర్మించాలన్నారు.

# విద్యార్థుల జీవితాలతో ఆటలా?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు7:** తామాషాలు చేస్తే...తాటా తీస్తానంటూ ఫీజు రీయింబర్సుమెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉన్నత విద్యాసంస్థలు చేపట్టిన బంద్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. అడ్డగోలుగా ఫీజులు పెంచుకుని వచ్చి రీయింబర్సుమెంట్ అడుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విడతల వారీగా బకాయిలు చెల్లిస్తామని తెలిపారు. తమ హయాంలోని బకాయిలు ముందుగా చెల్లిస్తామని, విద్యార్థుల జీవితాలతో మాత్రం ఆటలు ఆడవద్దని విజ్ఞప్తి చేశారు. బకాయిలు ఈరోజు కాకుంటే రేపు వస్తాయని, కానీ కాలేజీలు బంద్ పెడితే విద్యార్థులు కోల్పోయిన సమయం తిరిగి వస్తుందా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులకు ఇబ్బంది లేదని అన్నారు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ వెళ్లాలని అన్నారు. రాష్ట్రానికి నెలకు రూ. 18 వేల కోట్ల లేదా 18వేల 500 కోట్ల ఆదాయం వస్తోందని, వేతనాలు, వడ్డీలు, ఇతర ఖర్చులు పోను మిగిలేది రూ. 5వేల కోట్లే అన్నారు. ఈ ఆదాయంతో రాష్ట్రాన్ని ఎలా నడపాలో చెప్పండని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలేజీలను బంద్ చేయించిన వారితో చర్చించడానికి ఏముంటుందని ముఖ్యమంత్రి అన్నారు. ఏ కాలేజీ ఎంత డొనేషన్ వసూలు చేస్తుందో తనకు తెలుసని అన్నారు. కాలేజీలు నిబంధనలు పాటించాలని అన్నారు. ఇష్టానుసారం ఫీజులు పెంచుకుంటూ పోతే ఎలా అని ప్రశ్నించారు. విద్య వ్యాపారం కాదని, సేవగా భావించాలని సూచించారు. రాజకీయ నేతలు అండగా ఉన్నారని విద్యార్థులతో ఆడుకోవద్దని హెచ్చరించారు. కాలేజీలకు అనుమతుల విషయంలో ఎన్నో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. కాలేజీల యజమానులు ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తారా? అని నిలదీశారు. ఆర్. కృష్ణయ్య కూడా వారి ఉచ్చులో పడ్డారని విమర్శించారు. ఆర్.కృష్ణయ్య, మంద కృష్ణ మాదిగ ముందు కొస్తే వారి చేతికే చిట్టా ఇస్తానని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి వాళ్లే సర్దుబాటు చేయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడితే కళాశాలలైనా, రాజకీయ పార్టీలైనా ఉపేక్షించేది లేదన్నారు. విడతలవారీగా నిధులు విడుదల చేస్తాం.. దీనికి విద్యార్థులను ఇబ్బంది పెడితే సహించేది లేదన్నారు. రేవంత్ రెడ్డి వచ్చాకనే కొత్తగా సమస్యలు వచ్చినట్టు.. అంతకు ముందు ఈ సమస్య లేనట్టు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఏ రాజకీయ పార్టీలతో అంటకాగుతున్నారో తెలుసుకోలేనంత తెలివి తక్కువ వాళ్లం కాదన్నారు. అడిగినవి ఇవ్వలేదని కాలేజీలు మూసేస్తామంటే ఊరుకునేది లేదని, బ్లాక్ మెయిల్ చేస్తామంటే ప్రభుత్వం ఊరుకోదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది నుంచి డొనేషన్లు ఎలా వసూలు చేస్తారో చూస్తా, డొనేషన్లు వసూలు చేయని డిగ్రీ కాలేజీలకు బకాయిలు ముందుగా ఇస్తామన్నారు.

# ప్రైవేటు కాలేజీల బంద్ విరమణ

>> సంబంధించి కాలేజీ యాజమాన్యాలు రూ. 1,500 కోట్లు అడిగారని.. ఇప్పటికే 600 కోట్లు విడుదల చేశామని, మరో రూ. 600 కోట్లు వెంటనే విడుదల చేస్తామని చెప్పారు. ఇవి కాకుండా మరో రూ 300 కోట్లు కొద్ది రోజుల్లోనే క్లియర్ చేస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. ఫీజు రియింబర్స్‌మెంట్‌కి సంబంధించి ఒక కమిటీ వేయాలని కళాశాలల యాజమాన్యాలు కోరగా.. త్వరలోనే ఒక కమిటీ ఏర్పాటు చేసి త్వరితగతిన కమిటీ నివేదిక వచ్చేలా చేస్తామన్నారు. ఏ రకమైన సంస్కరణలు అవసరమో చర్చిస్తామని, కమిటీలో అధికారులతో పాటు యాజమాన్యాల ప్రతినిధులకు అవకాశం కల్పిస్తామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. విద్యాశాఖ కార్యదర్శి దేవసేనని కానీ సిఎం కార్యాలయం అధికారులపై, డిప్యూటీ సిఎం కార్యాలయం అధికారులపై తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, తాము మీడియా సమావేశంలో ఒకటి మాట్లాడితే కొన్ని మీడియా సంస్థలు తమ మాటలను వక్రీకరించాయని ఫాతి ఛైర్మన్ నిమ్మటూరి రమేష్ తెలిపారు. తమ మాటలను వక్రీకరిస్తూ మీడియాలో వచ్చిన ప్రకటనల పట్ల తమ సంఘం నుంచి ఒక ఖండన ప్రకటనను ఇప్పటికే ఉన్నతాధికారులకు పంపడం జరిగిందన్నారు. ఈ నెల 3నుంచి సమ్మెకు నిరవధిక బంద్‌కు వెళ్లామని.. ఫలితంగా కొన్ని పరీక్షలు నిర్వహించలేకపోయినందుకు చింతిస్తున్నామన్నారు. నిలిచిపోయిన పరీక్షలను యూనివర్సిటీ అధికారులతో మాట్లాడి త్వరితగతిన నిర్వహించే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వంతో చర్చలు సఫలం అయినందున శనివారం అధ్యాపకుల స్వాంతన సభను రద్దు చేసుకుంటున్నామని ఫాతి సెక్రటరీ జనరల్ కెఎస్ రవికుమార్ తెలిపారు. ఎన్నికల కోడ్ సమయంలో ప్రదర్శనలు తప్పని కోర్టు చెప్పిందన్నారు.

# జూబ్లీ తర్వాత కీలక మార్పులు

**హైదరాబాద్, నవంబరు 7 ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రాగానే ఎన్టీఆర్, పిజెఆర్ వంటి నేతలు రేవంత్ రెడ్డికి ఇప్పుడు గుర్తువస్తున్నారని పిజెఆర్ మీద ప్రేమఉంటే 2023 ఎన్నికల్లో పిజెఆర్ కొడు కుకు ఎందుకు సీటు ఇవ్వలేదని ఇప్పుడు జరుగుతున్న ఎన్నిక కెసిఆర్ పాలన వికాసానికి.. రేవంత్ రెడ్డి పాలన విధ్వంసానికిమధ్య జరుగుతోన్నదని అందులో ఏది కావాలో జూబ్లీహిల్స్ ప్రజలు తేల్చుకోవాలని మాజీమంత్రి హరీష్ రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీట్ ది ప్రెస్‌లో విలేకరులు అడిగే ప్రశ్నలకు మాజీ మంత్రి హరీష్ రావు సమాధానాలు ఇచ్చారు.రెండేళ్ల బ్లాక్ మెయిల్ సిఎం రేవంత్ రెడ్డి పాలనలో అరాచకం పెరిగిపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో నలుగురు బ్రదర్స్ మాత్రమే సంతోషంగా ఉన్నారని, నాలుగు కోట్లమంది ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారన్నార న్నారు. జూబ్లీ హిల్స్ ఎన్నిక, జూబ్లీ హిల్స్‌లో ఉండే 4 లక్షల ప్రజల భవిష్యత్ కాదు, నాలుగు కోట్ల ప్రజల భవిష్యత్ పై ఆధారపడి ఉంటుందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులు చోటు చేసుకోబోతున్నాయని అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఓడిపోతా మన్న భయం పట్టుకున్న సిఎం రేవంత్ రెడ్డి ఆ నియోజకవర్గం ప్రజలను కూడా బ్లాక్ మెయిల్ చేయడం దురదృష్టకమన్నారు. ఈ బ్లాక్ మెయిలర్‌కు బుద్ధి చెప్పాలని జూబ్లీహిల్స్ ప్రజలకు పిలుపునచ్చారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల సందర్భంగా ఆ నియోజకవర్గంలో ఆరు వేల ఇళ్లను నిర్మించి పేదలకు ఇస్తామని, డిఫెన్స్ ల్యాండ్స్‌ను రెగ్యులరైజేషన్ చేస్తామని వంటి హామీలను ఇచ్చిన అధికార కాంగ్రెస్ విస్మరించిందని ఇప్పుడు తాజాగా జూబ్లీహిల్స్ ప్రజలకు ఇచ్చిన హామీలనుకూడా రేవంత్ సర్కార్‌ఏమీ నెరవేర్చదని, అంతా మభ్యపెడుతున్నారని దుయ్యబట్టారు. ఈ ఉప ఎన్నికల సందర్భంగానే దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రస్తావన సిఎం రేవంత్ ఎందుకు తీశారని ఆయన ప్రశ్నించారు.

**బిఆర్ఎస్ ఒత్తిడితోనే ముస్లింలకు మంత్రి పదవి..**

రెండేళ్లలో మైనారిటీలను పట్టించుకోని కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మైనారిటీపై ఎక్కడ లేని ప్రేమ చూపిస్తుందని హరీష్ రావు విమర్శించారు. కేవలం బిఆర్ఎస్ పార్టీ ఒత్తిడి వలనే మైనారిటీ వర్గానికి చెందిన అజహారుద్దీన్‌కు మంత్రిపదవి ఇచ్చారన్నారు. మైనారిటీలను బుట్టలో వేసుకోవడం కోసం ఇప్పుడు రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ గల్లీ గల్లీ తిరుగుతున్నారని కాంగ్రెస్ ఉన్నందుకే ముస్లింలు ఉన్నారని, కాంగ్రెస్ లేకుంటే ముస్లింలకు ఇజ్జత్ ఉండదు అని రేవంత్ రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. ముస్లింలు అజాదీ కోసం యుద్ధం చేసినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎక్కడుందని ఆయన ప్రశ్నించారు. తక్షణమే రేవంత్ రెడ్డి ముస్లింలకు క్షమాపణ చెప్పాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. గతంలో సినీ హీరోలను జైలుకు పంపిన సిఎం రేవంత్ రెడ్డి.. ఇప్పుడు సినీ కార్మికులను ఒంగి ఒంగి దండాలు పెట్టడం చూస్తుంటే విడ్డూరంగా ఉందన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో గన్‌కల్చర్ పెరిగి, శాంతిభద్రతలు దిగజారిపోయాయని హరీష్ రావు విమర్శించారు. గత తొమ్మిది నెలల్లో రాష్ట్రంలో 22 శాతం క్రైమ్ రేట్ పెరిగినట్లుగా నివేదికలు చెబుతున్నాయని ఈ తొమ్మిదినెలల కాలంలో 189 హత్యలు, 1700 కిడ్నప్‌లు, 123 అత్యాచారాలు, 1051 రోబరీ, 6వేలకు పైగా వివిధ రకాల దొంగతనాలు జరిగాయన్నారు. హోంమంత్రిగా, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి విఫలమయ్యారని ఆయన దుయ్యబట్టారు. అదే కెసిఆర్ పాలనలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సుమారు 10 లక్షలకు పైగా సిసి కెమోరాలను ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. సిఎం సెక్రటేరియేట్‌కు వెళ్లకుండా కమాండ్ కంట్రోల్ రూంలో శాంతిభద్రతలపై కాకుండా కమిషన్ల మీది రివ్యూలు చేస్తున్నారని విమర్శించారు.

**దొంగ ఓట్లపై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు..**

ఓట్ల చోరీ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ, తెలంగాణలో జరుగుతోన్న ఓట్ల చోరీ గురించి ఎందుకు మాట్లాడటం లేదని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ సోదరుడు వెంకట్ యాదవ్‌కు మూడు ఓట్లు ఉన్నాయని, ఈ విషయాన్ని ఇసి దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేవని ఆయన ఆరోపించారు. అలాగే జూబ్లీహిల్స్‌లో దొంగఓట్ల గురించి కూడా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ఆయన నిలదీశారు. బిసి రిజర్వేషన్ల చట్టం అమలు చేయడం గురించి కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వంగానీ, ఇక్కడ కాంగ్రెస్ పార్టీ నోరు మెదపడం లేదని ఆయన మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు అమలు చేసేంతవరకు రేవంత్ సర్కార్ వెంటపడతామని జూబ్లీహిల్స్ నియోజవర్గంలో ఓటింగ్ శాతం పెరిగితే మాత్రం రేవంత్ ప్రభుత్వం మీద ప్రజా వ్యతిరేకత ఉన్నట్లేనని ఆయన తెలిపారు.ఉన్నవి రెండే రెండు టీంలు.. జూబ్లీహిల్స్ నియోజవర్గంలో ఉన్నవి రెండే రెండు టీంలని ఒకటి బిఆర్ఎస్ టీం కాగా, మరొకటి కాంగ్రెస్ టీం అని బిజెపి పార్టీ పోటీలో ఉన్న ఒకటే లేకపోయినా ఒకటేనని ఆయన ఎద్దేవా చేశారు. మహిళలకు ఇస్తామని రూ.2500 నగదు, విద్యార్థినులకు ఇస్తామన్న స్కూటీల పథకం ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సర్కార్ వద్ద డబ్బులు లేవన్నారని కమీషన్ల వచ్చే అభివృద్ధి ప్రాజెక్టులకు రేవంత్ వద్ద డబ్బులు ఉంటాయని ఎద్దేవా చేశారు. మూసీ ప్రాజెక్టు, ఫోర్త్ సిటీ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు ఎక్కడ నుంచి వస్తున్నాయని హరీష్ రావు నిలదీశారు.

## వారం - వర్జ్యం

08-11-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
తదియ ఉ.7.33, చవితి తె.4.26
మృగశిర రా.10.06, విశాఖ కార్తె
వర్జ్యం : తె.5.50-7.18
దు.ఉ.6.09-7.43
శుభసమయం : ఉ.10.45-11.15
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ఆప్తులనుండి ధన, వస్తు లాభాలు పొందుతారు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. ఆర్థికపరిస్థితి అనుకూలం.

**వృషభం :** కుటుంబ సమస్యలు కొంత వరకు తీరతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. ఆర్థికపరిస్థితి అనుకూలంగా వుంటుంది.

**మిథునం:** బంధువులతో వ్యక్తిగత విషయాలపై సంప్రదిస్తారు. పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**కర్కాటకం :** భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. గృహ నిర్మాణ యత్నాలు సాగిస్తారు. కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు.

**సింహం:** ఓర్పుతో నేర్పుతో ముందుకు సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో లాభాలు పొందుతారు. పెట్టుబడులకు అనుకూలం.

**కన్య :** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థికపరిస్థితి అంతంతమాత్రంగా వుంటుంది.

**తుల :** ఆస్తి విషయాలలో నూతన ఒప్పందాలు కుదుర్చుకుంటారు. వివాదాలకు దూరంగా వుండండి.ఋణబాధల నుండి విముక్తిని పొందుతారు.

**వృశ్చికం:** ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. నూతన సంస్థలనుండి ఉద్యోగావకాశాలు కలిసి వస్తాయి.

**ధనుస్సు:** సన్నిహితులకు మాట సహాయం అందిస్తారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**మకరం:** సంఘసేవా సంస్థలకు డబ్బు రూపేణా మీ వంతు సహాయాన్ని అందిస్తారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభిస్తాయి.వాహనసౌకర్యం కలదు.

**కుంభం:** భూమి, ఇళ్ల కొనుగోలు యత్నాలు సాగిస్తారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభిస్తాయి. ఆర్థిక పరమైన లావాదేవీలు అనుకూలంగా ఉంటాయి.

**మీనం :** నూతన కార్యక్రమాలను ప్రారంభించాలో నిర్ణయించుకొనడం కష్టతరమవుతుంది. వివాదాలకు దూరంగా వుండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో వీధికుక్కలను నియంత్రించండి

## సుప్రీం కోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, నవంబరు 7:** దేశవ్యాప్తంగా వీధికుక్కలు, రహదారులపై తిరిగే పశువుల నియంత్రణపై సుప్రీంకోర్టు తాజాగా కీలక ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఆసుపత్రులు వంటి ప్రజా ప్రాంగణాల్లో కుక్కకాటు ఘటనలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని పేర్కొంటూ, ఆయా ప్రాంతాలను వీధికుక్కల రహితంగా మార్చాలని అధికారులను ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టింది. సంస్థాగతప్రాంతాల్లో కుక్కకాటుకేసులు పెరిగిపోతుండటాన్ని తీవ్రంగా పరిగణించింది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, సంబంధిత అధికారులు సమన్వయంతో ఒక జాయింట్ డ్రైవ్ నిర్వహించి, ఈ ప్రాంతాల్లోని వీధికుక్కలను పట్టుకోవాలని స్పష్టం చేసింది. అదేవిధంగా, జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు ఇతర రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న పశువుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. తక్షణమే చర్యలు చేపట్టి, రోడ్లపై ఉన్న పశువులను పట్టుకుని, వాటిని షెల్టర్ హోమ్‌లకు తరలించాలని ఆదేశించింది. వాటికి అవసరమైన సంరక్షణ, వసతులు కల్పించాలని సూచించింది. ఈ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) కచ్చితంగా అమలు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# వి కావేరి ట్రావెల్స్ యజమాని అరెస్టు

## బస్సు దగ్ధం కేసులో ఎ2 ముద్దాయిగా వినోద్ కుమార్

**కర్నూలు, నవంబరు 7, ప్రభాతవార్త :** ట్రావెల్స్ బస్సు దగ్ధం కేసులో వేమూరి కావేరి ట్రావెల్స్ యజమాని వేమూరి వినోద్ కుమార్ ను శుక్రవారం కర్నూలు పోలీసులు అరెస్టు చేశారు. 2025 అక్టోబరు 24వ తేదీ తెల్లవారుజామున 3 గంటల సమయంలో కర్నూలు జిల్లా ఉలిందకొండ పిఎస్ పరిధిలోని కల్లూరు మండలం చెట్లమల్లాపురం గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకున్న వి కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో 19 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బస్సు డ్రైవర్ మరియు యజమాని మీద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, విచారణలో భాగంగా మొదటి నిందితుడు మిరియాల లక్ష్మయ్యను అక్టోబరు 28న అరెస్ట్ చేశారు. విచారణాధికారి పత్తికొండ డిఎస్పీ వెంకట రామయ్య నేతృత్వంలో దర్యాప్తు కొనసాగగా, ఈ కేసులో రెండవ ముద్దాయి అయిన వి కావేరి ట్రావెల్స్ బస్సు యజమాని వేమూరి వినోద్ కుమార్‌ను శుక్రవారం ఉదయం 7.30 గంటలకు కర్నూలు పోలీసులు అరెస్ట్ చేశారు. దర్యాప్తు కొనసాగుతున్నదని, మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# మాగంటి గోపీనాథ్ మరణం వివాదంలోకి నన్ను లాగొద్దు

## బండి సంజయ్ ఫిర్యాదు చేస్తే పోలీసులు దర్యాప్తు చేస్తారు: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 7:** మాగంటి గోపీనాథ్ మరణాన్ని తాను రాజకీయం చేయదలచుకోలేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాగంటి గోపీనాథ్ మరణం వివాదాల్లోకి తనను లాగొద్దని కోరారు. గోపీనాథ్ మరణంపై ఆయన తల్లి కొన్ని ఆరోపణలు చేశారని.. గోపీనాథ్ మరణంపై అనుమానాలు ఉంటే బండి సంజయ్ ఫిర్యాదు చేయాలని అన్నారు. బండి సంజయ్ ఫిర్యాదు చేస్తే పోలీసులు దర్యాప్తు చేస్తారని పేర్కొన్నారు. మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. ఈ ఉపఎన్నికలో గెలవాలని అన్ని ప్రధాన పార్టీలో కసరత్తు చేస్తున్నాయి. సిఎం రేవంత్ సైతం ఈ ప్రచారంలో పాల్గొన్నారు. రోడ్ షోలు, కార్నర్ మీటింగ్స్ నిర్వహించారు. తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్షాలపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పాలనలోనే హైదరాబాద్ అభివృద్ధి చెందిందని.. బిఆర్ఎస్, బిజెపి ప్రభుత్వాలు హైద రాబాద్‌కు చేసింది శూన్యమని ఆయన అన్నారు.

# భారీగా పెరిగిన విద్యుదుత్పత్తి

## 500 గిగావాట్లకు చేరిన సామర్థ్యం

## పదేళ్లలో 251 గిగావాట్ల పెరుగుదల

## దేశ ఇంధన రంగంలో కీలక పరిణామం

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త :** దేశ వ్యాప్తంగా విద్యుత్ రంగంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. విద్యుత్ రంగం రెండు చారిత్రాత్మక మైలురాళ్లను సాధించింది. ముఖ్యంగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో భారీగా పెరుగుదల రికార్డయింది. ఇవి స్వచ్ఛమైన, సురక్షితమైన, స్వావలంబన ఇంధన భవిష్యత్తు వైపు దేశం యొక్క స్థిరమైన పురోగతిని చూపుతున్నాయి. దేశంలో స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 500 గిగావాట్లకు దాటడం విశేషం. ఇదే సమయంలో పునరుత్పాదక శక్తి వాటా 50 శాతానికి పైగా ఉంది. గత నెల తొలి వారం నాటికి దేశంలోని మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యం 500 గిగావాట్లను దాటి 500.89 గిగావాట్లకు చేరుకుంది. 2014లో ఇది 249 గిగావాట్లుగా ఉంది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సీనియర్ సెక్రటరీ ఒకరు వెల్లడించిన సమాచారం ప్రకారం శిలాజేతర ఇంధన వనరుల నుండి విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి పునరుత్పాదక, జల, అణుశక్తి యూనిట్లకు సంబంధించి మొత్తం 256.09 గిగావాట్ల వద్ద ఉంది. ఇది మొత్తంలో 51 శాతానికి పైగా నమోదైంది. ఇక శిలాజేతర ఇంధన ఆధారిత వనరులు 244.80 గిగావాట్ల వద్ద ఉండగా, మొత్తం ఇది 49 శాతంగా ఉంది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి అర్థభాగంలో, దేశం 28 గిగావాట్ల శిలాజేతర సామర్థ్యానికిగాను, 5.1 గిగావాట్ల ఇంధన సామర్థ్యాన్ని జోడించింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూలై 29న విద్యుత్ ఉత్పత్తిలో అత్యధిక పునరుత్పాదక ఇంధన వాటాను చేరుకుంది. ఈ సమయానికి పునరుత్పాదక శక్తి దేశంలోని మొత్తం విద్యుత్ డిమాండ్ అయిన 203 గిగావాట్లలో 51.5 శాతం మేర ఇది తీర్చింది. ఈ పురోగతితో దేశంలో నిర్ధారించిన లక్ష్యాల్లో ఒక దశను అధిగమించినట్లయింది. 2030 నాటికి శిలాజేతర ఇంధన వనరుల నుండి 50 శాతం వ్యవస్థాపిత విద్యుత్ సామర్థ్యాన్ని కలిగి ఉండాలనే లక్ష్యాన్ని ముందుగానే అధిగమించినట్లయింది. ఈ విజయం ఇంధన రంగంలో సంవత్సరాల తరబడి బలమైన విధాన మద్దతు, పెట్టుబడులు మరియు టీమ్ కృషిని ప్రతిబింబిస్తుందని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భారతదేశ విద్యుత్ రంగం రెండు చారిత్రాత్మక మైలురాళ్లను సాధించిందని, ఇవి స్వచ్ఛమైన, సురక్షితమైన మరియు స్వావలంబన ఇంధన భవిష్యత్తు వైపు దేశం యొక్క స్థిరమైన పురోగతిని చూపుతున్నాయని పేర్కొంది.



# అభివృద్ధి కోసం కలిసి రండి

## నాబార్డుకు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి కోసం కలసి రావాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు నాబార్డుకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేయాలన్నారు. హైదరా బాద్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి కోసం ప్రభుత్వంతో భాగస్వామ్యం, మైక్రో ఇరిగేషన్ పథకం కోసం నిధుల విడుదల, బహుళోపయోగ ప్రాథమిక సహకార సంఘాల ఏర్పాటు వంటి అంశాలపై సహకరించాలన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి నాబార్డ్ కేటాయించిన రూ.300 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టుల కోసం రూ.1,811 కోట్ల డ్రాయబుల్ గ్యాప్ ఉందని దీన్ని అధిగమిస్తామన్నారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అమలు కోసం రూ.144 కోట్ల నిధులను నాబార్డు కేటాయించినట్లు చెప్పారు. అంతేకాకుండా రాష్ట్రంలో 197 బహుళార్థ సాధక సహకార సంఘాల ఏర్పాటుకు నాబార్డ్ అనుమతి ఇచ్చిందన్నారు. ప్రభుత్వం చేపట్టిన చర్యల వలన రైతుల ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయని తెలిపారు. పెరిగిన ఉత్పత్తులను అనుగుణంగా నిల్వ సామార్థ్యాలతో గోదాములు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇందుకు తక్కువ వడ్డీతో రుణాలు అందించాలని సూచించారు. ఇందులో నాబార్డు సీజిఎం ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

# అమెరికా చేతిలో 'మినిట్‌మ్యాన్-3'

## 150 సార్లు ప్రపంచాన్ని నాశనం చేయగల క్షిపణి ప్రయోగం సక్సెస్



**పెంటగాన్, నవంబరు 7:** అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ, అమెరికా తన అణు సామర్థ్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. కాలిఫోర్నియాలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి మినిట్‌మ్యాన్3 అనే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఇది కేవలం ఆయుధ వ్యవస్థల విశ్వస నీయతను అంచనా వేయడానికి చేపట్టిన రొటీన్ పరీక్ష అని అధికారులు ప్రకటించినప్పటికీ, దీని వెనుక బలమైన వ్యూహాత్మక కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. మినిట్‌మ్యాన్ సక్సెస్ అనంతరం ట్రంప్ స్పందించారు. ప్రపంచాన్ని 150 సార్లు నాశనంచేయగల అణుసత్తా అమెరికాకు ఉందంటూ ప్రపంచ దేశాలకు హెచ్చరికలు చేసారు.

యూఎస్ ఎయిర్ ఫోర్స్ గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ ఈ ప్రయోగాన్ని ధ్రువీకరించింది. ఈ క్షిపణి సుమారు 7,500 కిలోమీటర్లు ప్రయాణించి, పసిఫిక్ మహా సముద్రంలోని మార్షల్ దీవుల సమీపంలో ఉన్న రోనాల్డ్ రీగన్ బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ టెస్ట్ సైట్‌లోని లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించిందని అధికారులు తెలిపారు. ఇది కేవలం వ్యవస్థల పనితీరు, వేగం, కచ్చిత త్వాన్ని అంచనా వేయడానికి చేపట్టిన రొటీన్ పరీక్ష అని, ఇందులో ఎలాంటి అణు వార్ హెడ్‌లు ఉపయోగించలేదని పెంటగాన్ స్పష్టం చేసింది.

ట్రంప్ ఆదేశాలతోనే ఈ పరీక్ష జరిపారు. రష్యా, చైనా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలు నిర్వహిస్తు న్నాయని, ఈ పోటీలో అమెరికా వెనుకబడకూడదన్న ఉద్దేశంతో అధ్యక్షుడు ట్రంప్ ఈ పరీక్షలకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

ఎలాంటి పేలుడు పదార్థాలతో కూడిన అణు పరీక్షలు నిర్వహించబోమని అమెరికా ఇంధన శాఖ స్పష్టం చేసినప్పటికీ, ఈ ప్రయోగం ప్రచ్ఛన్నయుద్ధ కాలం నాటి అణు పోటీని గుర్తుచేస్తోందని నిపుణులు అంటున్నారు.

మినిట్‌మ్యాన్3 అమెరికా అమ్ముల పొదిలో అత్యంత పురాతనమైన, భూమి నుంచి ప్రయో గించే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి. 1970ల నుంచి ఇది సేవలో ఉంది. నిమిషం వ్యవధిలోనే ప్రయోగించ గలదు కాబట్టే దీనికి ఆ పేరు వచ్చింది. ఇది సుమారు 13వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా ఛేదించగలదు. ప్రస్తుతం అమెరికా వద్ద ఇలాంటివి 400 క్షిపణులు ఉన్నాయి. 2030 నాటికి వీటి స్థానంలో కొత్త క్షిపణులను ప్రవేశపెట్టాలని అమెరికా యోచిస్తోంది.

ఈ ప్రయోగం అణ్వాయుధాల భయానక విధ్వంసాన్ని మరోసారి గుర్తుచేస్తోంది. ప్రస్తుతం అమెరికా వద్ద ఉన్న అత్యంత శక్తిమంతమైన బి83 అణు బాంబు సామర్థ్యం 1.2 మెగాటన్నులు. అంటే హిరోషిమా బాంబు కంటే 80 రెట్లు ఎక్కువ. ఇది ఒక నగరంపై పడితే 1015 కిలోమీటర్ల పరిధిలోని ప్రతిదీ బూడిదైపోతుంది. ప్రపంచాన్ని 150 సార్లు నాశనం చేయగల అణ్వాయుధాలు తమ వద్ద ఉన్నాయని అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. నిపుణుల అంచనా ప్రకారం, నాగరికతను నాశనం చేయడానికి 1,00,400 అణు వార్‌హెడ్‌లు చాలు.

ఈ నేపథ్యంలో, మినిట్‌మ్యాన్3 వంటి పరీక్షలు ఒకవైపు అమెరికా సైనిక సన్నద్ధతను చాటుకోవడానికే కాకుండా, ప్రత్యర్థి దేశాలకు ఒక హెచ్చరికగా కూడా ఉపయోగపడ తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అమెరికాకు పోటీగా చైనా శక్తివంతమైన యుద్ధనౌక 'ఫుజియాన్'



**బీజింగ్, నవంబరు 7:** చైనా అత్యంత శక్తిమంతమైన ఫుజియాన్ (టైప్003) యుద్ధ నౌకను ప్రారంభించింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ విమాన వాహక నౌకను ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రారంభించారు. హైనాన్ ద్వీపంలోని సైనిక నౌకాశ్రయంలో దీనికి సంబంధించిన వేడుకలు జరిగినట్లు స్థానిక అధికారక మీడియా వెల్లడించింది. జిన్‌పింగ్ యుద్ధ నౌకను పరిశీలించారని పేర్కొంది. 316 మీటర్ల పొడవు, 80 వేల టన్నుల బరువు కలిగిన ఫుజియాన్ విమాన వాహక నౌక దాదాపు 50 విమానాలను మోసు కెళ్లగలదు. ఇది చైనాకు చెందిన మూడవ అత్యంత ఆధునిక యుద్ధ నౌక. విద్యుదయ స్కాంత ఆధారిత వ్యవస్థ అయిన ఈఎంఏఎల్ఎస్‌ను ఇందులో వినియోగించారు. ఈ తరహా సాంకేతికతను అమెరికాకు చెందిన గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ శ్రేణి విమాన వాహక నౌక మాత్రమే ఇప్పటివరకు వినియోగిస్తోంది. ఈ నౌక బీజింగ్‌కు వ్యూహాత్మక సాధనంగా ఉపయోగపడుతుందని, దేశ గౌరవాన్ని పెంచుతుందని చైనా ఇటీవల పేర్కొంది. ఫుజియాన్ తర్వాత టైప్004 విమాన వాహక నౌకను నిర్మించేందుకు కూడా చైనా సన్నాహాలు ప్రారంభిం చింది. దీనిని ఈఎంఏఎల్ఎస్‌తో పాటు అణు సామర్థ్యంతో నిర్మించాలని చైనా ప్రణాళికలు రచిస్తోంది. అమెరికాతో పోటీపడుతూ చైనా తన ఆయుధ సంపత్తిని విస్తరిస్తోంది.

# టిజిఎస్‌ఆర్‌టిసిలో జెఎసి ఏర్పాటు

## 11న నూతన జెఎసి ఎన్నిక..

## భవిష్యత్ కార్యాచరణ ప్రకటన

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి)లో జెఎసి ఏర్పాటుకు కార్మిక సంఘాలు శ్రీకారం చుట్టాయి. ఇందుకు సంబంధించి శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో అన్ని కార్మిక సంఘాలతో జెఎసి కోసం ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అధ్యక్షత వహించారు. సమావేశానికి ఎంప్లాయిస్ యూనియన్ తరపున చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.వెంకటిగౌడ్, వైస్ ప్రెసిడెంట్ ఎన్.బాల్ రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ జె.రాఘవులు, కోశాధికారి కె.రామిరెడ్డి, తెలంగాణ మజ్దూర్ యూనియన్ నుండి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.కమలాకర్ గౌడ్, చీఫ్ అడ్వైజర్ బి.యాదయ్య, బహుజన కార్మిక యూనియన్ నుండి ప్రధాన కార్యదర్శి కత్తుల యాదయ్య, బుద్ధ విశాల్, బి.రాములు, బి.డబ్ల్యు.యు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.వి.కె.యాదవ్, సుద్దాల సురేష్, డి. రామచంద్రం, కార్మిక పరిషత్ నుండి బి. యాదగిరి, ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన సంఘాల నాయకులు మాట్లా డుతూ.. ప్రస్తుతం ఆర్‌టిసి కార్మికులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గతంలో రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకిచ్చిన హామీలను విస్మరించిందని, రాష్ట్రవ్యాప్తంగా యూనియన్ల ప్రాతినిధ్యం లేకపోవడం వలన, వాటిపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం వలన అన్ని డిపోలలో కార్మికులపై అధిక పనిభారం మోపి నిత్యం వేధింపులకు యాజమాన్యం పాల్పడు తోందన్నారు. రాబోయే రోజులలో ఆర్‌టిసి ఉనికికి, కార్మికుల భద్రతకు ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సుల వలన పెను ప్రమాదం ముంచుకు వస్తోందని తెలియజేస్తూ, ఆర్థిక అంశాలపైన ఇతర పెండింగ్ అంశాలపైన సమావేశంలో చర్చించడం జరిగిందన్నారు. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితులలో ఉన్న కార్మికవర్గాన్ని మరో సారి పోరాటం వైపు తీసుకు రావటానికి కలిసివచ్చే సంఘాలతో జెఎసిగా ఏర్పడి సర్కారు ఇచ్చిన హామీల అమలుకై సమరం సాగించడానికి ఈ నెల 11న మరోసారి సమావేశం నిర్వహించి అందులో నూతన జెఎసిని ఎన్నుకుని. అదేరోజు ఉమ్మడి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

# హర్యానా, మధ్యప్రదేశ్, గుజరాత్‌లోనూ ఓట్ల చోరీ

## ఆధారాలతో బయటపెట్టినా ఇసి స్పందించలేదెందుకు?

## నేడు బీహార్‌లోనూ ఆ దిశగా బిజెపి పన్నాగం

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్రఆరోపణలు



**న్యూఢిల్లీ, నవంబరు 7:** ఓట్ చోరీ అంశంపై లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తన దాడిని తీవ్రతరం చేశారు. దేశంలో ఎక్కడ ఏ ఎన్నిక జరిగినా అధికార బిజెపి 'చువాన్ చోరీ' (ఎన్నికలను దొంగలించడం)లో పాల్గొంటుందని, నరేంద్రమోడీ చువాన్ చోరీ ద్వారానే ప్రధానమంత్రి అయ్యారని రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో హోల్‌సేల్‌గా ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీ మీడియాతో మాట్లాడుతూ ఓట్ల చోరీపై తన దగ్గర చాలా ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఓట్ల చోరీపై ప్రజెంటేషన్లు కొనసాగుతాయని చెప్పారు. ప్రధాని మోడీ 'చువాన్ చోరీ' ద్వారా ప్రధాని అయ్యారని తెలిపారు. బిజెపి ఓట్ల చోరీపై యువతకు స్పష్టంగా తెలియజేస్తామన్నారు. హర్యానాలో జరిగిన ఎన్నికలు... అస్సలు ఎన్నికలే కాదన్నారు. హర్యానాలో జరిగిన ఓట్ల చోరీపై అనేక ఆధారాలు చూపించామన్నారు. బిజెపి నేత కుమారుడు రెండు చోట్ల ఓటు వేశారని ఆరోపించారు. అయితే తాను చేసిన ఆరోపణలకు ఇప్పటి వరకు ఎన్నికల సంఘం స్పందించలేదని తెలిపారు. నకిలీ ఓటు, నకిలీ ఫొటోలతో బిజెపి నాయకులు ఓట్లు వేశారని, దీనిని బిజెపి కూడా సమర్థిస్తోందని విమర్శించారు. తన ప్రజెంటేషన్‌లో చూపిస్తున్న చిన్న ఉదాహరణలనే మీడియా తీసుకుంటోందని, బ్రెజిలియన్ మహిళ ఓటు వేసింది ఎవరని ప్రశ్నించారు. మోడీ, అమిత్ షా, ఇసి కలిసి రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగం ఒక మనిషి... ఒక ఓటు అని చెబుతోంది. కానీ హర్యానాలో మానరతం ఒక మనిషి... బహుళ ఓట్లు అని బిజెపి అంటోందని పేర్కొన్నారు. ఇప్పుడు బీహార్‌లో కూడా అదే ఒరవడిని బిజెపి చేయబోతున్న దన్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, గుజరాత్‌లలో జరిగింది కూడా ఇదేనన్నారు. బీహార్‌పై కూడా ఇలాంటి ప్రజెంటేషన్‌తో తిరిగి వస్తానని, అక్కడ కూడా ఓట్ చోరీ జరుగుతుందని అను మానం వ్యక్తంచేశారు.

# త్వరలో 8వ వేతన కమిషన్

## స్టేట్ బ్యాంక్ జీతాల్లో భారీ పెరుగుదల

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ, పబ్లిక్ సెక్టార్ ఉద్యో గులకు ముఖ్యమైన 8వ వేతన కమిషన్ త్వరలో రానుంది. ఈ కమిషన్ ద్వారా ఉద్యోగుల వేతనాల్లో పెరుగుదల చోటు చేసుకోనుంది. ముఖ్యంగా 8వ వేతన కమిషన్ ద్వారా స్టేట్ బ్యాంక్ ఉద్యోగుల ప్రాథమిక జీతం గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం గ్రాడ్యుయేట్ క్లర్క్ ఉద్యోగులకు ప్రారంభ బేసిక్ పే రూ.26,730గా ఉంది. కానీ ఈ కొత్త వేతన కమిషన్ అమల్లోకి వచ్చిన తర్వాత ఇది రూ.30 వేలకు పైగా ఉంటుందని అంచనా.

మధ్యస్థ స్థాయి ఉద్యోగుల విషయానికొస్తే, వారి ప్రాథమిక జీతం రూ.75 వేల వరకు పెరగనుంది. ప్రస్తుతం ఎస్‌బీఐ క్లర్క్‌ల వేతన వివరాలు చూస్తే బేసిక్ పే రూ.26,730. దీనికి వివిధ అలవెన్సులు కలిపి మొత్తం గ్రాస్ జీతం రూ.45,888 అవుతుంది. డిడక్షన్లు తీసిన తర్వాత చేతికి వచ్చే నికర జీతం సుమారు రూ.39,529గా ఉంటుంది. ఎస్‌బీఐ ఉద్యోగులకు డియర్‌నెస్ అలవెన్స్, హౌస్ రెంట్ అలవెన్స్, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, స్పెషల్ అలవెన్స్ వంటి అనేక ప్రయోజనాలు అందు తాయి. సాధారణంగా డియర్‌నెస్ అలవెన్స్ రూ.7,161, హౌస్ రెంట్ అలవెన్స్ రూ.2,862 (పోస్టింగ్ ప్రదేశాన్ని బట్టి మారుతుంది), స్పెషల్ అలవెన్స్ రూ.7,083 వరకు ఉంటుంది.

ఇవన్నీ కలిపి ఉద్యోగుల మొత్తం జీతాన్ని గణనీయంగా పెంచుతాయి. జీతం నగరాన్నిబట్టి కూడా మారు తుంది. ప్రారంభ బేసిక్ రూ.26,730 నుంచి రూ.64,480 వరకు పదోన్నతులతో పాటు వృద్ధి చెందుతుంది.



కోటి దీపోత్సవంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న కేంద్రమంత్రి షెకావత్

# కోటి దీపోత్సవాన్ని జాతీయ పండుగగా గుర్తించాలి: కేంద్రమంత్రి షెకావత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, నవంబరు 7:** భక్తి టీవీ కోటీ దీపోత్సవం అద్భుతమైన కార్యక్రమమని కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పేర్కొన్నారు. భక్తి టీవీ కోటీ దీపోత్సవాన్ని జాతీయ పండుగగా గుర్తించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ప్రతిపాదనలు రాగానే కేంద్రం అవసరమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. కోటీ దీపోత్సవం జాతీయ పండుగగానే కాకుండా అంతర్జాతీయ పండుగగా గుర్తింపు ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. భక్తి టీవీ నిర్వహిస్తున్న కోటీ దిపోత్సవానికి శుక్రవారం ఆయన ముఖ్యఅతిధిగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్

## హైదరాబాద్ వేదికగా వచ్చే నెల 19 నుండి ప్రారంభం

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త :** అంతర్జాతీయ ఫెస్టివల్‌కు హైదరాబాద్ వేదిక కాబోతోంది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీ సంస్థ ద్వారా డిసెంబర్ 19 నుంచి 21 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్తర్వులు విడుదల చేసింది. ఇందుకు ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా 30 లక్షల రూపాయల మేర నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపింది. అలాగే హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ కార్యక్రమంలో అవార్డు ఫంక్షన్ నిర్వహణ కోసం 8 మందితో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ అవార్డుల పునర్వ్యవస్థీకరణ కమిటీ చైర్మన్‌గా దర్శకుడు దశరథ్‌ను నియమించినట్లు ఉత్తర్వుల్లో వెల్లడించింది. అలాగే ఈ కమిటీలో సభ్యులుగా సినీ దర్శకుడు హరీశ్ శంకర్, కళాకారుడు బలగం వేణు, పీజీ వినోద్, రాహుల్ సిప్లిగంజ్, చరణ్ అర్జున్, లక్ష్మీ మ్మలను నియ మించారు.

# కేంద్రమంత్రి బండి సంజయ్‌పై ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు



రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న పిసిసి ఎన్నికల కమిషన్ కోఆర్డినేషన్ కమిటి చైర్మన్ రాజేష్‌కుమార్, సభ్యులు రాఘవేందర్

**హైదరాబాద్ (చార్మినార్), నవంబరు 7, ప్రభాతవార్త:** కేంద్రమంత్రి బండి సంజయ్‌పై ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. జూబ్లీ హిల్స్ ఉపఎన్నికల ప్రచారం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి కేంద్రమంత్రి బండి సంజయ్ అనుచితవ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని టిపిసిసి ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటి చైర్మన్ పులిపాటి రాజేష్‌కుమార్, సభ్యులు గోపిశెట్టి రాఘవేందర్‌లు కలిసి శుక్రవా రం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

# గాయని చిన్మయి శ్రీపాద ఫిర్యాదుపై కేసు నమోదు

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** సోషల్ మీడియాలో తనను కొందరు వేధిస్తున్న ఉదంతంపై ప్రముఖ గాయని చిన్మయిశ్రీపాద చేసిన ఫిర్యాదు మేరకు శుక్రవారం నాడు సిటీ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె భర్త రాహుల్ రవీంద్రన్ తాళి విషయంలో చేసిన వ్యాఖ్యలు. దీనిపై శ్రీపాద స్పందించిన తీరును కొందరు సోషల్ మీడియా ద్వారా ఎగతాళి చేయడం తెలిసిందే. ఇదే విషయమై శ్రీపాద సిటీ కొత్వాల్ సజ్జనార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన సైబర్ క్రైం పోలీసులు ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వీరిని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు.

# 22, 23 తేదీల్లో హైదరాబాద్‌లో కామన్వెల్త్ ఎఐ గ్లోబల్ సమ్మిట్

## 'ప్రోత్సహించడం-విద్యను అందించడం-సాధికారత కల్పించడం' థీమ్‌తో నిర్వహణ

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరో గ్లోబల్ సమ్మిట్ జరగనుంది. ఈ నెల 22, 23 తేదీల్లో కామన్వెల్త్ ఏఐ గ్లోబల్ సమ్మిట్- 2025ను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గ్లోబల్ సమ్మిట్-2025 ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ప్రభు కుమార్ చల్లగలితో కలిసి ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి శుక్రవారం మీడియాతకు తెలి పారు. భారతదేశంలో తొలిసారిగా నిర్వహించ బడుతున్న కామన్వెల్త్ ఏఐ గ్లోబల్ సమ్మిట్-2025 గురించి అవగాహన కల్పించడానికి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 'ప్రోత్సహించండి-విద్యను అందిం చండి - సాధికారత కల్పించండి' అనే థీమ్‌తో కామన్వెల్త్ ఏఐ గ్లోబల్ సమ్మిట్-2025ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమ్మిట్‌కి ప్రపంచ వ్యాప్తంగా 2,500 మంది ప్రతినిధులు, నిపుణులు హాజరుకానున్నారని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్‌కు కామన్వెల్త్ దేశాలు, ఇతర ప్రపంచ భాగస్వాములకు ప్రాతినిధ్యం వహిస్తున్న 50 కంటే ఎక్కువ దేశాల నుండి ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ కార్యక్రమంలో పాల్గొనడానికి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కామన్వెల్త్ మెడికల్ అసోసియేషన్ (సిఎంఏ), రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజిషియన్స్ అండ్ సర్జన్స్ ఆఫ్ గ్లాస్గో, యుకె.. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సహకారంతో ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్గనైజింగ్ చైర్మన్, కన్వీనర్ డాక్టర్ ప్రభు కుమార్ చల్లగలి మాట్లాడుతూ.. తెలంగాణలో గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. భారత చరిత్రలో తొలిసారిగా, రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజిషియన్స్ అండ్ సర్జన్స్ ఆఫ్ గ్లాస్గో ద్వారా కామన్వెల్త్ ఏఐ, డిజిటల్ హెల్త్ కార్డ్ (ఎఫ్‌సిఏడి)లో ఫెలోషిప్ సర్టిఫికేట్ కోర్సును ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఇది తెలం గాణతోపాటు భారతదేశానికి చాలా గర్వకారణమన్నారు. ఏఐ దేశ భవిష్యత్తును రూపొందిస్తున్నందున, ప్రాథమిక ఎంబిబిఎస్ విద్యార్థుల నుండి అత్యున్నత స్థానాల్లో ఉన్నవారి వరకు ప్రతి వైద్య నిపుణుడు ఈ సమావేశంలో నమోదు చేసుకుని హాజరు కావడం మంచిదని, తద్వారా వారు జ్ఞానాన్ని పొందగలరని చెప్పారు. కాళోజీ నారాయణరావు యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (కెఎన్ఆర్‌యు హెచ్‌ఎస్) వైస్‌ఛాన్సలర్ డాక్టర్ పి.వి. నంద కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం సమ్మిట్‌లో చురుకుగా పాల్గొంటోందని, తెలంగాణ అంతటా ఆరోగ్య కేంద్రాలకు ఏఐ సాధనాలు, సాంకేతికతలలో శిక్షణ అందించడానికి గ్రామాలను కూడా దత్తత తీసుకుం టోందని పేర్కొన్నారు. ఈ నెల 22, 23 తేదీలలో హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ సమ్మిట్ జరుగుతుందని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జె. గోపాల కృష్ణ ప్రకటించారు. వైద్య విద్యార్థులు, నిపుణులు, వైద్యులు, శాస్త్రవేత్తలు మరియు ప్రాక్టీషనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని మెడిసిన్, హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, డిజిటల్ హెల్త్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో ఏఐపై జరిగే సెషన్‌ల ద్వారా ప్రయోజనం పొందాలని సూచించారు. సమ్మిట్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సి. దామోదర్ రాజనర సింహ, ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9989220003, 9849137420 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వార్త

ధైర్యం అన్నదే అసలయిన సంపద. ధైర్యం కోల్పోయినట్లయితే అన్నీ కోల్పోతాం.

-జేమ్స్ చెర్రీ

# కల్తీకి కాపలాదారులా?


మానవుడికే కాదు పశుపక్ష్యాదుల ఆరోగ్యానికి సంకటంగా మారుతున్న కల్తీని నిరోధించేందుకు పాలకపెద్దలు చేస్తున్న ప్రయత్నాలుఏమాత్రం ఫలించడం లేదు. దేశంలో రానురాను కల్తీ పెరిగి పోతున్నది. తాగేనీటిలో కల్తీ, పప్పులో కల్తీ, ప్రాణాపాయం నుండి కాపాడే మందుల్లో కల్తీ చివరకు పౌష్టికాహారంగా వయసుతో ప్రమేయం లేకుండా పసిపిల్లల నుండి వృద్ధులవరకు సేవించే పాలల్లో కల్తీ, అదీ ఇది అని తేడా లేకుండా అంతా కల్తీమయంగా మారిపోతున్నది. మనిషి మనుగడనే ప్రశ్నార్థకం చేసే సూచనలు కన్పిస్తున్నాయి. ఈ కల్తీ ప్రభావం సామాన్య జనంతోపాటు ముఖ్యంగా ప్రభుత్వ వసతి గృహాలపై తీవ్రంగా చూపుతున్నది. ఇటీవల కలుషిత ఆహారం తినిప్రభుత్వ వసతి గృహాల్లోఉన్న ఎంతో మంది విద్యార్థినీవిద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. ఇంత ప్రమాదకరంగా మారుతున్నా, పొగమంచులా అంతటా విస్తరించినా అడిగేవారు, అడ్డగించే వారు కరవైపోతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే అవినీతికి, కల్తీకి అవినాభావ సంబంధం ఉంది. పెరుగుతున్న అవినీతికి రెట్టింపు స్థాయిలో కల్తీ విస్తరిస్తున్నది. దీనిని అరికట్టేందుకు ఎన్నో చట్టాలున్నాయి. ఆ చట్టాలు అమలు చేసి కల్తీ జరగకుండా నిరోధించేందుకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది అధికారులు ఉన్నారు. కోట్లాది రూపాయల జీతభత్యాల రూపేణా తీసుకుంటున్నారు. కానీ కల్తీని ఏ మాత్రం నియంత్రించలేకపోతున్నారు. ఈ కల్తీ భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా మానవజీవనానికి సవాలుగా మారుతున్నా మనదేశంలో అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తున్నదనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇది మూడోకంటికి తెలియకుండా జరగడం లేదు. బహిరంగ రహస్యమే. అన్నింటికంటే ముఖ్యంగా ఆహార కల్తీ పెరిగి పోతున్నది. కొందరు దళారులు, వ్యాపారులు లాభాల కోసం పప్పుదినుసుల్లో, మసాలాలు వంటి నిత్యావసర సరుకుల్లో కల్తీ చేస్తున్నారు. అనేక హోటళ్లలో కల్తీ ఇష్టారాజ్యాంగా సాగిపోతున్నది. కల్తీ అడ్డుకట్ట ప్రమాణాల చట్టం 2006లో తీసుకువచ్చినా పట్టించుకునేవారే లేరు. ఇది ఎన్నో ప్రమాదాలను హెచ్చరిస్తున్నది. ఇక భారత ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ ఎఫ్ఎస్ఎస్ఐ అమలు గూర్చి దాదాపు మరిచిపోయారనే చెప్పొచ్చు. మార్కెట్లో విక్రయించే ఆహార పదార్థాల తయారీకి ఎఫ్ఎస్ఎస్ఐ అనుమతి తప్పనిసరి. కానీ వ్యాపార సంస్థలేవీ అనుమతులు తీసుకోవడం లేదు. ఈ చట్టాన్నే కాదు కల్తీని నిరోధించేందుకు ఉద్దేశించిన అనేక చట్టాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. 1947 నాటి వంటనూనెల నియంత్రణ చట్టం, 1955 నిత్యావసర సరుకుల్లో కల్తీ నియంత్రణ చట్టం, 1992 పాల ఉత్పత్తుల్లో కల్తీ నియంత్రణ చట్టం, అన్నిటికంటే ముఖ్యంగా 1954 నాటి ఆహార కల్తీ నిరోధక చట్టాన్ని పూర్తిగా మరిచిపోయారని చెప్పొచ్చు. ఇక్కడా, అక్కడా అనికాదు. దేశవ్యాప్తంగా కల్తీ విజృంభించిపోతున్నది. కోట్లాది మంది ఈ కల్తీ కారణంగానే రకరకాల రుగ్మతులకు గురవుతున్నారు. కల్తీకాటుకు యేటా ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది రకరకాలవ్యాధుల బారిన పడుతుంటే లక్షల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. అన్నిటికంటే బాధాకరంగా మరణిస్తున్న వారిలో ముప్పైశాతానికి మించి ఐదేళ్లలోపు వయసున్న బాలబాలికలే. ఇక పాలల్లో కల్తీ అదుపు తప్పిపోతున్నది. డిమాండ్‌కు తగినట్లు ఉత్పత్తి లేకపోవడంతో ఆ వ్యత్యాసాన్ని పూడ్చేందుకు రకరకాల మార్గాల్లో కృత్రిమ పాలను తయారు చేస్తున్నారు. చక్కెర, ఉప్పు, గంజిపొడి, బియ్యంపిండి, యూరియా, గ్లూకోస్, హైడ్రోజన్ పెరాక్సైడ్, కాస్టిక్ సోడా, వంట సోడా, డిటర్జెంట్, మైలమాన్‌పొడి, నూనె, తదితర పదార్థాలతో కల్తీపాలను తయారు చేస్తున్నారు. ఈ కల్తీపాలను తాగితే అజీర్తి సమస్యలతో ప్రారంభమై కడుపు నొప్పితోపాటు మూత్రపిండాలు, కాలేయం, నాడీ వ్యవస్థపై ప్రభావం పడుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రసాయనికాలతో కూడిన పాలను తీసుకుంటే క్యాన్సర్ లాంటి వ్యాధులు సోకే ప్రమాదంఉందని కూడా వైద్యులు చెబుతున్నారు. ఇక పాలల్లో చిక్కదనం కోసం మైలమన్ రసాయనిక పొడిని కలుపుతున్నారు. ఇక క్రిమిసంహారక మందులను పిచికారి చేసిన మేతను పశువులకు వేయడంతో దుష్ప్రభావాలకు కారణాలవుతున్నాయి. మరికొన్ని సందర్భాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి సోకినప్పుడు పాలు పితకకూడదు. కానీ అవేమీ పాటించడం లేదు. ఇలాంటి ఎన్నో కారణాలతో పాలు కల్తీ అయిపోతున్నాయి. ఈ పాలద్వారా తయారు చేసే రకరకాల తీపి పదార్థాలు కూడా కలుషితమైపోతున్నాయి. భారతదేశానికి సంబంధించి ఎన్నో సందర్భాల్లో దేశసర్వోన్నత న్యాయస్థానం కల్పించుకున్న పరిస్థితులు కూడా ఏర్పడ్డాయి. దేశప్రజలకు విక్రయించే పాలల్లో అరవైశాతంపైగా కల్తీయేనన్న వాస్తవాన్ని సాక్షాత్తు జాతీయ ఆహార భద్రత ప్రమాణాల మండలి ఏనాడోవెల్లడించింది. అప్పట్లో దేశంలో వివిధ ప్రాంతాల్లో తనిఖీ నిర్వహిస్తే అధిక శాతం కల్తీ బయటపడింది. ఇలాంటి సందర్భాల్లో సర్వోన్నత న్యాయస్థానం కల్పించుకొని ఇంతపెద్ద సమస్యపైపాలకులు ఏం చేస్తున్నారో చెప్పండంటూ నిలదీసి అడిగింది. ఈ దురాగాతాలను నివారించడంలో విఫలమవుతున్న అధికార గణంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ప్రశ్నించిన సందర్భాలున్నాయి. ఇప్పటికైనా పాలకులు కల్తీ విషయంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొత్త చట్టాల సంగతి దేవుడెరుగు. ఉన్నచట్టాలను త్రికరణ శుద్ధిగా అమలు చేసేందుకు ప్రయత్నంచేయాలి. ముఖ్యంగా కల్తీని నిరోధించేందుకు కృషిచేయాల్సిన కొందరు అధికారులు కాపలాదారులుగా వ్యవహరించడం దురదృష్టకరం.

చాలా మంది లోభులవడం వల్ల ఎందరో ఆకలితో అలమటిస్తున్నారు. ఇతరులతో పంచుకోవడం ఎలాగో తెలుసుకుంటే సమస్య ఉండదు.



ఐ.జాన్సన్

ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక, దాన్ని మార్చాలనే ఆకాంక్ష మానవ ప్రగతికి ప్రధాన ప్రేరకాలు.



బెర్ట్రండ్ రస్సెల్

## ప్రజావాక్కు



### భయపెడుతున్న రోడ్డు ప్రమాదాలు!

రాష్ట్రంలోరోడ్డు ప్రమాదాలసంఖ్యభయంగొలిపే స్థాయిలో పెరిగిపోతోంది. ఏవార్తాపత్రికలను తిరగేసినా భయంకరమైన రోడ్డుప్రమాదాల్లో పదుల సంఖ్యలో మృత్యువాతకు గురైనఅభాగ్యుల ఫోటోలు ప్రతిరోజూ పత్రికలలో దర్శనమిస్తాయి. వాహనాలసంఖ్య విపరీతంగా పెరిగిపోయాయి. రోడ్లపరిస్థితి అధ్వానంగా తయారుకావడం, ట్రాఫిక్ నిబంధనలను కనీసంగాకూడా పాటించకపోవడం, మితిమీరిన వేగం, కాలంచెల్లిన వాహనాలు, పరిమితికి మించిన లోడ్ పరుగులు తీసే లారీలు, ట్యాంకర్లు రోడ్డు ప్రమాణాలకు నేపథ్యంగా నిలుస్తున్నాయన్నదివాస్తవం. దీనికితోడు ఇటీవల కాలంలో 'సెల్ రైడింగ్'విపరీతంగా పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. జనంతో కిక్కిరిసిన నగర రోడ్లు, వాహనాలు దార్లు తీరిన హైవేలలో అష్టకష్టాలు పడుతూ సెల్‌ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్‌చేయడం మంచిదికాదు.

- సింగు లక్ష్మీనారాయణ, చింతకుంట, కరీంనగర్ జిల్లా

### ట్రంప్‌కు బెదరని ఓటర్లు

అమెరికన్ ప్రజల మనోభీష్టం అధ్యక్షుడైన డోనాల్డ్ ట్రంప్ మీదఉన్న అయిష్టం ఏదో విధంగా వ్యక్తపరచడమే. అందుకే వచ్చిన అవకాశాన్ని చక్కగా వినియోగించుకున్నారు. న్యూయార్క్ సిటిమేయర్ ఎన్నికల్లో డెమొక్రాటిక్ అభ్యర్థి భారత్ మూలాలు కలిగిన 34 ఏళ్ల మజ్దాని కన్సర్వేటివ్ అభ్యర్థిని చిత్తుగా ఓడించడం, అలాగే 61 సంవత్సరాల డెమొక్రాటిక్ పార్టీకి చెందిన భారత సంతతి మహిళ గజాలా ఫిర్దౌస్ హాష్మీ వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నరుగా, మరో భారతీయ అమెరికన్ అఫ్తాబ్ కర్మసింగ్ పురేవల్ సిన్సినాటి పట్టణ మేయర్‌గా ఎన్నికల దుంధుభి మోగించారు. ఈ విజయాలు ట్రంప్ పరిపాలన మీద రిఫరెండమ్‌గా భావించవచ్చు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### బకాయి నిధులను విడుదల చేయాలి

రాష్ట్రప్రభుత్వంసకాలంలో ఫీజురియంబర్స్మెంటు, ఉపకారవేతన నిధులను విడుదల చేయకపోవడం వల్ల ప్రైవేట్ కళాశాలలయాజమాన్యం ఆర్థికఇబ్బందులతో కళాశాలలను సక్రమంగా నిర్వహించకపోవడం వల్లవిద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్య అందడం లేదు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం కాలేజీలను బంద్‌చేయడంతో విద్యార్థులు తమ భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారు.

- బూర్గుపల్లి కృష్ణ యాదవ్, విద్యానగర్, హైదరాబాద్

### స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించాలి

తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో పెట్టుబడుల ఆకర్షణకు మరింత సమగ్ర ప్రయత్నం అవసరం. పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత తయారీకేంద్రాలు, ఔషధ ఉత్పత్తి, సమాచార సేవలు, పర్యాటకం వంటి అనేక రంగాలలో అపారమైన అవకాశాలు ఉన్నప్పటికీ, ఇవి పూర్తిస్థాయిలో విని యోగం కావడంలేదు. ఇతరరాష్ట్రాల్లో గుజరాత్ చేపట్టిన వైభవ గుజరాత్", మధ్యప్రదేశ్ నిర్వహిస్తున్న 'పెట్టుబడిదారుల మహాసభ' వంటి కార్యక్రమాలు రాష్ట్ర బ్రాండ్ ప్రతిష్టను పెంచి, దేశ విదేశీ పెట్టుబడులనుఆకర్షించాయి. ఇదేనమూనాలో తెలుగురాష్ట్రాలు కూడా విశాలస్థాయిపెట్టుబడిసభలను ప్రతీసంవత్సరం నిర్వహించాలి. ఇలాంటి సభలు కేవలం అధికారుల ప్రసంగాలు, ప్రదర్శనలు మాత్రమే కావు. పెట్టుబడి ఒప్పందాల్లో కేవలం పరిశ్రమ స్థాపనకే ప్రాధాన్యం ఇవ్వకుండా, స్థానిక ప్రజల సామర్థ్యాన్ని పెంచే విధంగా నిబంధనలు చేర్చాలి.

-డా॥ సి.హెచ్.ప్రతాఫ్, శ్రీకాకుళం

### పునర్జీవం పొందుతున్న ప్రజాకళ

ఆదిలాబాద్ జిల్లాలో ప్రజా కళారూపమైన జడ్కొప్పులాట మళ్లీ ప్రాణం పోసుకుంటుండడం సంతోషకరమైన పరిణామం. ఈ కళ కేవలం వినోదం మాత్రమేకాదు, గ్రామీణ జీవన విధానానికి అద్దం పట్టే ఒక విలువైన సాంస్కృతిక సంపద. పాత కాలంలో ఈ కళారూపం ద్వారా ప్రజలకు విద్య, సామాజిక సందేశాలు, నైతిక బోధనలు అందించేవారు. కానీ నేటి ఆధునిక కాలంలో యువతలో మొబైల్ ఫోన్లు, సినిమాలు, సోషల్ మీడియా వంటి ఆధునిక వినోదాల ప్రభావం పెరిగింది. దీని ఫలితంగా జడ్కొప్పులాటలాంటి సాంప్రదాయ కళలు క్రమంగా మరుగున పడుతున్నాయి. పాతకళాకారులు చెబుతున్నట్టుగా, కొత్త తరం ఈ కళల పట్ల ఆసక్తిచూపకపోవడం ఆందోళన కలిగించే విషయం.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### లెంకలగడ్డ లో ప్రకృతి విలయ తాండవం

ప్రకృతి బీభత్సానికి జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ఉమ్మడి మండలంలోని లెంకలగడ్డ గోదావరి అటవీ ప్రాంతంలో చెట్లు, మిర్చి, పత్తిపంటలకు భారీనష్టం వాటిల్లింది. మంగళవారం సాయంత్రం లంకలగడ్డ సమీపంలోని గోదావరి వద్ద ఒక్కసారిగా సుడిగాలి బీభత్సం సృష్టించింది. సుమారు 4గంటలపాటు గాలి రావడంతో అటవీ ప్రాంతంలో చెట్లు నేల కొరిగాయి. వందలఎకరాల్లోపత్తి, మిర్చిపంటలకునష్టంవాటిల్లింది.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆధ్యాత్మిక ముసుగులో నకి'లీలలు'

**పెద్దపెద్ద అధికారులు, రాజకీయనేతలె కాళ్లమీద పడి మొక్కుతుంటే మనమెంత అని సామాన్యులు కూడా క్యూలు కడుతున్నారు. వారికెక్కడలేని ప్రాధాన్యత సంతరించుకుంటున్నది. సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఏదిఏమైనా కుల, మత, వర్గ, వైషమ్యాలతో విచ్ఛిన్నకర విపరీత ఆలోచనా విధానాలు, కక్షలు, కార్పణ్యాలు, స్వార్థంతో అతలాకుతలమై అట్టుడికిపోతున్న మానవ హృదయ కుహారాల నుండి తమస్సును తరిమికొట్టి మనస్సును నింపి మనిషి మనిషిగా మనగలగడానికి మార్గోపదేశం చేసే అత్యంత పవిత్రమైన గౌరవప్రదమైన స్వామిజీల వ్యవస్థలోకి ఇలాంటి చీడపురుగులు ప్రవేశించడం అత్యంత విచారకరం, బాధాకరం. ఈ విషయంలో పాలకులు మనస్సు పెట్టాలి. మోసపోయిన బాధితులు ఫిర్యాదు చేసిన తర్వాత పోలీసులు రంగప్రవేశం చేసే కంటే ముందుగానే నిఘా ఏర్పాటు చేసి పటిష్టమైన చర్యలు చేపట్టాలి. ఇలాగే కొనసాగితే మొత్తం ఈ వ్యవస్థ మీదనే నమ్మకాలు సన్నగిల్లుతాయి.**

దామెర్ల సాయిబాబ

సర్వమానవులు నిత్యం జీవన పోరాటంలో ఏదో విధమైన మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటుంటారు. ఎండకు ఎండని, వానకు తడవని మానవుడు ఎలా ఉండడో కోరిక లేని మనిషి లేడనే చెప్పొచ్చు. కోరికలు పెరిగే కొద్దీ మనశ్శాంతి కరవుకాక తప్పదు. వారివారి స్థాయిని బట్టి, అవసరాలను బట్టి, ఈ కోరికలు పెరుగుతుంటాయి. అందుకే అంటారు 'ధనము కలిగిన వానికి ధనము దాచుట రంధి (వ్యధ)ధనము లేకున్ననూ పొట్టరంధి, సంతుకలిగిన వానికి సాదలేకనూ రంధి, సంతులేకున్న చాలా రంధి... అలా రకరకాల సమస్యలతో కోరికలతో మనశ్శాంతి కరవైన పరిస్థితుల్లో ఆధ్యాత్మికం, భక్తి, ముఖ్యంగా స్వామిజీ ఉపన్యాసాలు, ప్రవచనాలతో తమ తమ సమస్యలకు పరిష్కారం దొరికి కొంతైనా ప్రశాంతత లభిస్తుందనే ఆశతో స్వామిజీలను, బాబాలను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ సంస్కృతి రానురాను పెరిగిపోతున్నది. అయితే భారతీయ ఆధ్యాత్మిక వాహినిలో స్వామిజీలు, గురువుల పాత్ర మహోన్నతమైనది. 'నిధి చాలా సుఖమా! రాముని సన్నిధి చాలా సుఖమా అంటూ ప్రశ్నించి రాముడి పదసన్నిధి వైభవాన్ని కీర్తనలుగా పాడి తాను తరించి కోట్లాది ఆధ్యాత్మిక హృదయాల్లో త్యాగయ్య చిరంజీవిగా నిలిచారు. అలాగే వేలాది కీర్తనలతో తిరుమలేశుని సేవలో అన్నమయ్య తరించారు. ఏ భక్తుడి చరిత్రచూసినా మనలను తరింప చేసేందుకు జన్మించిన మానవ మూర్తులుగా వారు సాక్షాత్కరిస్తారు. ఇలాంటి తులసీవనంలో గంజాయి మొక్కలు కూడా మొలకెత్తడం మన గ్రహచారం, దురదృష్టకరం. స్వామిజీల ను ఆశ్రయించి తమ సమస్యల పరిష్కారం కొరకు అన్వేషించే అమాయకులను లక్ష్యంగా చేసుకొని కొందరు స్వార్థపరులు స్వామిజీల అవతారం ఎత్తి ప్రజలను మోసం చేయడమేకాక చేయరాని, చేయకూడని పనులు చేస్తున్నారు. అందరు స్వామిజీలు, బాబాలు అలా చేస్తున్నారని చెప్పడం లేదు. త్రికరణశుద్ధిగా దైవాన్ని నమ్ముతూ, ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసే స్వామిజీ లు ఎందరో ఉన్నారు. కానీ ఈ నకిలీ ఆధ్యాత్మిక గురువుల సంఖ్య రానురాను పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే విషయం. ఇది కూడా ఒక వ్యాపారంగా మారిపోయింది. పెద్దగా పెట్టు బడి లేకుండా కుబేరులుగా మారడానికి ఇవి దగ్గర దారిగా ఎంచుకుంటున్నారు. దీనికి కావల్సిందల్లా ప్రజానమ్మకం, విశ్వాసం, బలహీనతలే. అవే పెట్టుబడులు. ప్రజల బలహీ నతలను, నాడిని పట్టుకొని విశ్వాసం కలిగిం చగలిగితే కనక వర్షం కురిసినట్లే. దీనికి కనీస అర్హతలంటూ ఏమీలేవు. వయసుతో నిమిత్తం లేదు. రాత్రికి రాత్రేకాషాయ వస్త్రాలు ధరించి, తెల్లవారే సరికి స్వామిజీలుగా, బాబాలు గా అవతారం ఎత్తవచ్చు. చిన్న పరిశ్రమ పెట్టాలన్నా, మరే చిన్నదుకాణం ఏర్పాటు చేసుకోవాలనుకున్నా ఎన్నో లైసె న్సులు, అనుమతులు, మరెందరో అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుంది. దీనికి అలాంటి ఇబ్బందులు లేవు. అనుమతులు కానీ, లైసెన్సులు కానీ అవసరంలేదు. నాయకులనో, అధికారులనో తమ దారికి మళ్లించుకోగలిగితే ప్రభుత్వపరంగా రాయితీలపై భూములు పొందవచ్చు. అందుకే దేశవ్యాప్తంగాఎక్కడపడితే అక్కడ బాబాలు, స్వామి జీలు వెలుస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే కనీసం తమ పేరును కూడా రాసుకోలేనివారు కాషాయ వేషధారణతో ఏవోచెప్పి ప్రజలను నమ్మిస్తున్నారు. దక్షిణతాంబూలాలతో పాటు పాదపూజలు చేయించుకుంటున్నారు. అలాంటి వారు కొందరు చేసే వికృతచేష్టలు అమాయక గ్రామీణుల ప్రాణాల మీదకు తెస్తున్నాయి. తమ మంత్రాలతో రోగాలను నయం చేస్తామంటూ కిందపడేసి తొక్కడం, వాతలు పెట్టడం, ఇష్టాను సారంగా కొట్టడం, ఒక్కటేమి

## ఒక్క మాట

టి వారికి తోచిన ఆటవిక చర్యలన్నీ చేస్తున్నారు. ఇదంతా చిన్న, ఛోటా స్వాముల లీలలు. ఏదైనా సంఘటన జరిగి ఫిర్యాదు అందితే పోలీసులు రంగప్రవేశం చేసి కేసులు పెట్టి అరెస్టు చేయడం, ఆ తర్వాత మరిచిపోవడం సాధారణమైపోయింది. కొందరు స్వామిజీలు ఆ ప్రాంతాన్ని వదిలి మరో ప్రాంతానికి వెళ్లి కొత్త పేరుతో నూతన అవతారం ఎత్తి వ్యాపారాన్ని సాగించుకుంటున్నారు. ఇక బడాస్వాముల సంగతే వేరు. వారి కార్యకలాపాలు, సంపాదన, కూడబెట్టిన కోట్ల రూపాయల ఆస్తులు చూస్తుంటే ఆశ్చర్యం కలగక తప్పదు. వారు సల్పుతున్న రాసలీలు, అమ్మాయిల ఎగుమతులు, గంజాయి, కొకైన్ వంటి మాదక ద్రవ్యాల వ్యాపారంతదితరాలు బయటపడుతుంటే 'ఛీ'వీరా మనస్వాములు? వీరికా ఇంతకాలం మనం పూజలు చేసిం ది అంటూ వారి భక్తులే చీదరించుకుంటున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఎందరో స్వామిజీలు కేసులను ఎదుర్కొంటున్నారు. మరికొందరు జైళ్లల్లో కాలం గడుపుతున్నారు. మొన్న సెప్టెంబరులో పేరుమోసి తనకు తానుగా దైవస్వరూపంగా ప్రకటించుకుంటున్న స్వామిజీని ఆగ్రాలో పోలీసులు అరెస్టు చేశారు. తన ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాసంస్థలో ఉన్న మహిళా విద్యార్థులను లైంగిక వేధిం పులకు గురిచేశారనే ఆరోపణపై ఈ అరెస్టులు జరిగాయి. రాజస్థాన్‌లో మరొక ప్రముఖ గురువు న్యాయవిభాగం విద్యార్థినిని మానభంగం చేశారనే కేసులో అరెస్టు అయ్యా రు. మరొకస్వామిజీ చేసిన నేరాలకు జీవితఖైదు శిక్షను అనుభవిస్తూ జైలులోనే మరణించారు. ఇలా చెప్పుకుంటూ పోతే దైవభక్తి ముసుగులో ఎందరో ఇలాంటి అరాచకాలు, అత్యాచారాలు చేసినట్లు తెలుస్తుంది. అంతకుముందు కూడా ఎందరో స్వామిజీలు ఇలాంటి కార్యక్రమాలు చేసి జైళ్లకు వెళ్లిన సందర్భాలున్నాయి. దేశరాజధాని ఢిల్లీలో పేరొందిన ఒక స్వామిజీని ఆరుగురు యువతులతో రెడ్‌హ్యాండెడ్‌గా పోలీసులు పట్టుకున్నారు. ఈ ముసుగులో ఆయన దాదాపు రెండువందల మంది అందమైన యువతులను విలాసవంత మైన హోటళ్లకు సరఫరా చేసేవారని పోలీసుల దర్యాప్తులో వెల్లడయింది. ఆయన చరిత్రను ఒకసారి పరిశీలిస్తే స్వామిజీ వేషంలో ఎంత సులభంగా మోసంచేసి కోట్లాది రూపాయలు ఆర్జించవచ్చో ఆచరణలో చేసి చూపించారు. ఉత్తరప్రదేశ్ లోని ఒక కుగ్రామం నుంచి కట్టుబట్టలతో ఢిల్లీకి వచ్చిచాలా సంవత్సరాలపాటు ఒక హోటల్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేశారు. ఆ తర్వాత కొంతకాలం మసాజ్ సెంటర్‌లో పనిచేసి అవేమీ అంత లాభదాయకంగా లేకపోవడంతో స్వామిజీ అవతారం ఎత్తారు. అంతే ఆయన స్టార్ తిరిగిపోయింది. పదేళ్లు తిరగకుండానే వందల కోట్లకు అధిపతి అయ్యాడు. ఒకటి, రెండు సార్లు పట్టుబడినా తన పలుకుబడిని, డబ్బును ఉపయోగించి బయటపడ్డాడు. ఇక తమిళనాడులో ఒక స్వామిజీ పదమూడు మానభంగాలు, ఒక హత్యానేరం కింద జైలుపాలయ్యారు. తెలుగురాష్ట్రాలకు సంబంధించి మరొక స్వామిజీ నకిలీ నోట్లు, నీలిచిత్రాలతో పట్టుబడ్డాడు. ఇలా చెప్పుకుంటూపోతే ఎందరినో ఉదహరించ వచ్చు. ఇవన్నీ పోలీసుల దృష్టికి వచ్చిన నకిలీ స్వాముల లీలలు. మూడోకంటికి తెలియకుండా, తెలిసినా బయటపడ కుండా నిరాటంకంగా సాగుతున్న ఈనకిలీ స్వామిజీల అరా చకాలు మరెన్నో ఉండొచ్చు. ఇక అన్నింటికంటే ముఖ్యంగా దురదృష్టకరమైన విషయం ఏమిటంటే కొందరు నాయకులు అధికారులు ముఖ్యంగా పోలీసు అధికారులు ఇలాంటివారికి భక్తులుగా మారి ప్రదక్షిణలు, పాదపూజలు చేయడంతో సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. నమ్మకం, విశ్వా సం, శ్రద్ధాశక్తులు అనేది పూర్తిగా వారి వారి వ్యక్తిగతం. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. వారికి ఎలాంటి ఉద్దేశ్యాలు ఉండకపోవచ్చు. కానీ వారి రాకను, వారికి చేసే పూజా కార్యక్రమాలను ముందుగానే మీడియాకు తెలిపి విస్తృతప్రచారం చేసుకుంటున్నారు. కొన్ని ఆశ్రమాల్లో దేవుని ఫోటోల కంటే ఈ అధికారులు, మరికొందరు నాయకులు వారికి చేసేపాదపూజ కార్యక్రమాల ఫోటోలతో ఆశ్రమమంతానింపేస్తున్నారు. సామాన్యుల్లో విశ్వాసం పెంచేందుకు వీటిని ఎంతగానో ఉపయోగించుకుంటున్నారు. పెద్దపెద్ద అధికారులు, రాజకీయ నేతలే కాళ్లమీద పడి మొక్కుతుంటే మనమెంత అని సామాన్యులు కూడా క్యూలు కడుతున్నారు. వారికెక్కడలేని ప్రాధాన్యత సంతరించుకుంటున్నది. సమాజంపై తీవ్రప్రభావం చూపుతున్నది. ఏదిఏమైనా కుల, మత, వర్గ, వైషమ్యాలతో విచ్ఛిన్నకర విపరీత ఆలోచనా విధానాలు, కక్షలు, కార్పణ్యాలు, స్వార్థంతో అతలాకుతలమై అట్టు డికిపోతున్న మానవ హృదయ కుహారాలనుండి తమస్సును తరిమికొట్టి మనస్సును నింపి మనిషి మనిషిగా మనగలగడానికి మార్గో పదేశం చేసే అత్యంత పవిత్రమైన గౌరవప్రదమైన స్వామిజీలవ్యవస్థలోకి ఇలాంటి చీడపురుగులు ప్రవేశించడం అత్యంత విచారకరం, బాధాకరం. ఈ విషయంలో పాలకులు మనస్సు పెట్టాలి. మోసపోయిన బాధితులు ఫిర్యాదు చేసిన తర్వాత పోలీసులు రంగప్రవేశం చేసేకంటే ముందుగానే నిఘాఏర్పాటు చేసి పటిష్టమైన చర్యలు చేపట్టాలి. ఇలాగే కొనసాగితే మొత్తం ఈ వ్యవస్థ మీదనే నమ్మకాలు సన్నగిల్లుతాయి. ●

# భావితరాల సంపూర్ణ వికాసానికి ఉద్యాన వన సేవ!

మెరుగు భాస్కరయ్య

ఈ పంచ అభివృద్ధి ప్రక్రియలో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, యాంత్రీకరణ, పల్లెల నుంచి పట్టణాలకు వలస ఫలితంగా వాతావరణంలో పెనుమార్పులు సంభవిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడం, కరవు పరిస్థితులు, అకాల వర్షాల వల్ల వ్యవసాయం కుంటుపడుతోంది. గ్రామాల్లో వ్యవసాయం చేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. వీటికి తోడు నేటి యువతలో పర్యావరణం, ఆహారం, ఆరోగ్యం పట్ల అవగాహనలోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిస్థితి నుంచి భావితరాలను కాపాడటానికి పాఠశాల స్థాయి నుంచే పిల్లలను సన్నద్ధం చేయాలి. పర్యావరణం, ఆహారం, ఆరోగ్యానికిగల సంబంధాన్ని పిల్లలకు అర్థమయ్యేలా నేర్పించాలి. పాఠశాలల్లో తోటల పెంపకాన్ని పాఠ్యాంశంగా చేర్చడంవల్ల ఈ బృహత్తరకార్యాన్ని నెరవేర్చవచ్చు. ఈ కార్యక్రమాన్ని నేడు అన్ని ఉన్నతపాఠశాలల్లో అమలు చేయాల్సిన అవసరం ఉంది. విద్యార్థులను క్లాసుల వారీగా లేదా బృందాల వారీగా విభజించాలి. తరగతి గదులకు దూరంగా ఒక చోట గుంతను తీసి పాఠశాల ఆవరణను శుభ్రపరచగా వచ్చిన చెత్త, వ్యర్థ పదార్థాలను పోగుచేసి ఈ గుంతల్లో వేసి కంపోస్టు ఎరువు తయారు చేయాలి. ఈ విధానాన్ని విద్యార్థులకు కూడా వివరించాలి. పాఠశాల ఆవరణలో నీటి ఆధారం ఉన్నచోట నర్సరీని ఏర్పాటు చేయాలి. నర్సరీలో పెంచిన మొక్కలను పాఠశాల ఆవరణలో విద్యార్థులతో నాటించాలి. వీటిలో నీడనిచ్చే చెట్లు, అలంకరణ చెట్లు, కూరగాయ లు, పండ్లు, పూల చెట్లు మొదలైనవి ఉండేలా చూడాలి. వాటి ఉపయోగాలను విద్యార్థులకు



తెలియజెప్పాలి. ఈ మొక్కలకు కంపోస్టు గుంతలో తయారు చేసిన ఎరువును వేయాలి. పాఠశాల ఆవరణలో పెంచుతున్న చెట్లకుఅవసరం మేరకు నీరు పెట్టాలి. చెట్లు పెరిగే వివిధ దశల గురించి కూడా విద్యార్థులకు తెలియజెప్పాలి. మొక్కల పెంపకంలో వివిధ దశలైన నేలతయారీ, విత్తనం, ప్రవర్ధనం, నారు పెంపకం, పూత, కోత మొదలైనవి విద్యార్థులకు వివరించి చెప్పాలి. పర్యావరణ పరిరక్షణ కాలుష్య నివారణ, ఆహారం, ఆరోగ్యంలో మొక్కల పాత్రను విద్యార్థులకు వివరించాలి. విద్యార్థులకు తోటపని చేయడం ద్వారా పనిపైగౌరవం (డిగ్నిటీ ఆఫ్ లేబర్) అలవడుతుంది. పరస్పర సహకారంతో సంఘటితంగా పనిచేయడం విద్యార్థులకు అలవాటవుతుం ది. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి దేనినైనా చేయగలమనే సామర్థ్యం సమకూరుతుంది. సహనం నిశిత పరిశీలన అల వాటవుతుంది. పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధంపై అవగా హన పెరుగుతుంది. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివార ణపై అధ్యయనానికి వీలు కలుగుతుంది. జీవశాస్త్రంలో వివిధ అంశాలను నేరుగా పరిశీలించేందుకు సహజ ప్రయోగశాలలుగా తోటలు ఉపయోగపడతాయి. ఆరోగ్యం, సంతులిత ఆహా రం పట్ల అవగాహన పెరుగుతుంది. విద్యార్థుల్లో మొక్కల పెంపకం, పంటల సాగుపై ఆసక్తి పెరుగుతుంది. పాఠశాల ఆవరణలు పరిశుభ్రంగా ఉండి విద్యాభివృద్ధికి దోహదపడుతుంది. విద్యార్థుల సంపూర్ణ వికాసానికి ఉపయోగకరంగాఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ఉన్నత పాఠశాలలన్నింటిలోనూ ఈ కార్యక్రమాన్ని చేపట్టి, అమలుకు అవసరమైన సాంకేతిక సూచనల కోసం మండల స్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన, అటవీ శాఖ అధికారుల సహాయసహకారాలు పొందవచ్చు. ●

# తిరుమల దర్శనాల్లో ఆన్‌లైన్ ఆధిపత్యం

అప్పన్న గొనప

తిరుమలలో సాధారణ భక్తుల కష్టాలు పెరుగుతున్నాయి. కరోనా మహమ్మారి అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అనేక మార్పులు తీసుకువచ్చింది. భక్తుల సౌకర్యం కోసం అని చెప్పుకుంటూ, దాదాపు అన్ని దర్శన టిక్కెట్లు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే అందుబాటులో ఉంచారు. కానీ ఈ నిర్ణయం అనుకోకుండా వేలాది మంది సాధారణ భక్తులకు ఇబ్బందులను తెచ్చిపెడుతోంది. ముఖ్యంగా వయోవృద్ధులు, దివ్యాంగులు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, ఆన్‌లైన్ వేదికలను సరిగ్గా వినియోగించలేని వారు ఇప్పుడు పూర్తిగా దర్శన అవకాశాల నుండి దూరమవుతున్నారు. టీటీడీ వెబ్‌సైట్‌లో సర్వర్ సమస్యలు, టిక్కెట్ స్లాట్లు క్షణాల్లో ఖాళీకావడం, మోసపూరిత వెబ్‌సైట్లు పెరుగుతుండడం వంటి అంశాలు ప్రజలలో తీవ్ర ఆవేదన కలిగిస్తున్నాయి. తిరుమలలో ఇప్పటికీ సీనియర్ సిటిజన్లకు, దివ్యాంగులకు ఆఫ్‌లైన్ దర్శనం ప్రారంభం కాలేదు. గతంలో ఈ రెండు వర్గాలకు ప్రత్యేకంగా కౌంటర్లు ఉండేవి. భక్తులు తాము నిర్దేశిత సమయానికి వచ్చి స్వామివారి దర్శనం చేసుకునే సౌలభ్యం ఉండేది. కానీ ప్రస్తుతం ఆ అవకాశమూ లేదు. జిల్లా కేంద్రాలలో ఏర్పాటు చేసిన టీటీడీ ఈ దర్శన్ కౌంటర్లు కూడా నెలలుగా మూతపడ్డాయి. ఇది గ్రామీణ ప్రజలకు పెద్ద దెబ్బగా మారింది. ఎందుకంటే వారు ఆన్‌లైన్ రిజర్వేషన్లకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం, డెబిట్ లేదా క్రెడిట్ కార్డు లేని పరిస్థితుల్లో తమకు దర్శన టిక్కెట్ పొందడం అసాధ్యమవుతోంది. ఈ దర్శన్ కేంద్రాలు తిరిగి ప్రారంభిస్తే ఈ వర్గాల భక్తులకు కొంత ఉపశమనం కలిగే అవకాశం ఉంది. కానీ ఇప్పటి వరకు వాటిని పునఃప్రారంభించాలన్న ఎటువంటి చర్యలూ కనిపించడం లేదు. టీటీడీ అధికారుల వాదన ప్రకారం ఆన్‌లైన్ విధానం పారదర్శకత కోసం అని చెబుతున్నారు. కానీ వాస్తవంలో, దాని వల్ల సామాన్య ప్రజల చేరికకు అడ్డంకులు ఏర్పడ్డాయి. ప్రతి నెల టిక్కెట్ కోటాలు విడుదలవగానే, కొద్దిసేపులోనే అన్ని స్లాట్లు పూర్తవుతున్నాయి. ఫలితంగా సాధారణ భక్తుడు స్వామివారి దర్శనం కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. ఇంటర్నెట్ వసతులు సరైన రీతిలో లేని గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఈ విధానం పెద్ద భారమవుతోంది. తిరుమల శ్రీవారి సేవ అంటే భక్తి, అనుభూతి, సమర్పణ. కానీ ఇప్పుడు అది ఒక డిజిటల్ పోటీగా మారింది. ప్రతిరోజు



లక్షలాది మంది భక్తులు తిరుమల వెళ్లాలని ఆశపడుతున్నారు. కానీ టిక్కెట్ లేకపోవడం వల్ల చాలా మంది భక్తులు తిరుపతిలోనే ఆగిపోవలసి వస్తోంది. కొందరు ఆలయంలో ఉన్న లడ్డూ ప్రసాదం తీసుకుని తిరిగి వెళ్లిపోతున్నారు. భక్తుల భావాలను, వారి ఆకాంక్షలను గౌరవించడం దేవస్థానం ప్రధాన బాధ్యత. కానీ ఇప్పుడు అది కేవలం సాంకేతిక వ్యవస్థల ఆధారంగా నడుస్తోంది. సీనియర్ సిటిజన్ల విషయానికి వస్తే, వీరికి నడకలో, క్యూలైన్‌లో నిలబడటంలో ఇబ్బందులు ఉంటాయి. గతంలో ప్రత్యేక దర్శన సమయాలు ఇవ్వడం వలన వారు సౌకర్యంగా దర్శనం చేసుకునే వారు. ఇప్పుడు వారిని కూడా ఆన్‌లైన్ పోటీకి దిగమంటున్నారు. ఇది మానవతా విలువలకు విరుద్ధంగా ఉంది. దివ్యాంగులకు కూడా ఇదే పరిస్థితి. వారు ప్రత్యేక ప్రవేశ ద్వారం ద్వారా వెళ్లే అవకాశం లేకపోవడంతో తిరుమల యాత్రకు వెళ్లడమే ఒక సవాల్‌గా మారింది. ఈ పరిస్థితులు టీటీడీ ప్రతిష్ఠకు అనుకూలం కావు. ఆలయ వ్యవస్థ అంటే కేవలం ఆర్థిక నిర్వహణకాదు, భక్తుల భావోద్వేగాలను కూడా గౌరవించడం అవసరం. గతంలో ఆఫ్‌లైన్ విధానంలో కూడా పారదర్శకతతో వ్యవహరించిన అనేక సందర్భాలు ఉన్నాయి. భక్తులు రాత్రి క్యూలైన్లలో నిలబడి అయినా స్వామిని దర్శించేవారు, అది వారికి భక్తి పరాకాష్టగా అనిపించేది. ప్రస్తుతం డిజిటల్ ఆధారిత టిక్కెట్ విధానం వల్ల మధ్య తరగతి, పేద ప్రజలు వెనుకబడుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు పొందే వారు ప్రధానంగా నగరాల వారే. గ్రామాల్లోని వృద్ధులు, రైతులు, రోజువారీ కూలీలు ఈ వ్యవస్థలో స్థానం లేకుండా పోతున్నారు. ప్రభుత్వాల, దేవస్థానాల ప్రాధాన్యత భక్తులకు సమాన అవకాశాలు కల్పించడంలో ఉండాలి కానీ సాంకేతిక పరిమితులు పెంచడంలో కాదు. టీటీడీ ఈ సమస్యను సీరియస్‌గా తీసుకోవాలి. తిరిగి జిల్లా కేంద్రాలలో ఈదర్శన్ కౌంటర్లను ప్రారంభించడం అత్యవసరం. అలాగే సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, గ్రామీణ ప్రాంతాల భక్తుల కోసం ప్రత్యేకంగా ఆఫ్‌లైన్ కోటాలను కేటాయించాలి. భక్తుల ప్రవాహం పెరిగిందని చెప్పి అందరికీ ఒకే విధమైన డిజిటల్ విధానాన్ని రుద్దడం న్యాయబద్ధం కాదు. భక్తి అంటే నమ్మకం. ఆ నమ్మకం సాంకేతిక సౌకర్యాలతో కాదు, అనుభూతితో పెంపొందుతుంది. తిరుమల శ్రీవారి దర్శనం ప్రతి ఒక్కరికీ సమానంగా లభించాలనే దైవ ధర్మాన్ని టీటీడీ గుర్తుంచుకోవాలి. ఈ భూమ్మీద ఎంత ఆధునికత వచ్చినా, భక్తుడి కన్నీరు, మనసులోని వినయమే దైవానికి దగ్గర చేస్తాయి. ఆ భక్తిని కంప్యూటర్ స్క్రీన్ ముందు నిలబెట్టకూడదు. అందువల్ల తిరుమలలో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, గ్రామీణ ప్రజల కోసం ఆఫ్‌లైన్ దర్శనాలను తిరిగి ప్రారంభించాలి. ఈదర్శన్ కేంద్రాలను పునఃప్రారంభించి ప్రతి జిల్లాలో టిక్కెట్లు సులభంగా అందుబాటులో ఉంచాలి. టీటీడీకి భక్తుల నమ్మకం అంటే దైవం ఇచ్చిన విశ్వాసం. ఆ విశ్వాసం కాపాడటం వారి ప్రధాన కర్తవ్యం కావాలి. ●



# మీరు ప్రశాంతంగా రిటైర్ కాలేరు

**- బీహార్ ఎన్నికల సభలో సిఇసిపై ప్రియాంక గాంధీ హెచ్చరికలు**

**పాట్నా, నవంబరు 7:** ఏఐసిసి ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ నేరుగా కేంద్ర ఎన్నికల సంఘంను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. సిఇసి జ్ఞానేష్ కుమార్ పేరు ప్రస్తావిస్తూ, మీరు ప్రశాంతంగా పదవీ విరమణ చేయలేరంటూ హెచ్చరికలు చేశారు. రీగాలో శుక్రవారం ఎన్నికల సభలో ప్రియాంక గాంధీ మాట్లాడుతూ... "జ్ఞానేశ్ కుమార్.. మీరు ప్రశాంతంగా రిటైర్ అవుతారని అనుకుంటున్నారేమో.. అది జరగదు. జ్ఞానేశ్ కుమార్ పేరును మరిచిపోవద్దని ప్రజలకు చెప్పదలుచుకున్నా"ను అని అన్నారు. జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఇద్దరు ఇసీలు ఎస్ఎస్ సంధు, వివేక్ జోషి పేర్లను కూడా గుర్తుపెట్టుకోవాలని ప్రియాంకగాంధీ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా "ఓట్ చోర్" అంటూ ప్రియాంక మద్దతుదారులు నినాదాలు చేయడం కనిపించింది. హర్యానా ఎన్నికల్లో ఓట్ల అవకతవకలకు పాల్పడ్డారని, ప్రజలు తమకు జరిగిన మోసాన్ని మరచిపోరని ప్రియాంక అన్నారు. ఇందులో ప్రమేయమున్న జ్ఞానేశ్ కుమార్, ఎస్ఎస్ సంధు, వివేక్ జోషిలు ప్రశాంతంగా రిటైర్ అవుతామని అనుకుంటే పొరపడినట్టేనని పేర్కొన్నారు. కాగా, ప్రియాంక గాంధీ వ్యాఖ్యలపై రాజకీయ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ప్రక్రియ జరుగుతుండగా ఎన్నికల అధికారులను బెదిరించడంలో ఔచిత్యాన్ని ప్రశ్నిస్తున్నారు. రాజకీయ ప్రసంగాల పరిధి ఏమేరకు ఉండవచ్చనే దానిపై రాజకీయ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

# బీహార్‌లో ఎన్డీయే గెలుపు ఖాయం

**- మా ట్రాక్ రికార్డును నమ్మే రికార్డు స్థాయి పోలింగ్, - ఆర్‌జెడి, కాంగ్రెస్ పాలనలో రెడ్ టెర్రర్, - ఎన్‌డిఏ వచ్చాకే నక్సల్ హింసాకాండకు విముక్తి, - ఔరంగాబాద్ ఎన్నికల సభలో ప్రధాని మోడీ**

**పాట్నా, నవంబర్ 7:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశ పోలింగ్‌లో రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదైందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రస్తావిస్తూ, ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఓటరుకు ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలోని ఎన్‌డిఏ డబుల్ ఇంజిన్ ప్రభుత్వంపై ప్రజలలో పెరుగుతున్న విశ్వాసం, నమ్మకానికి నిదర్శనమన్నారు. అలాగే తనకు, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు ఉన్న ట్రాక్ రికార్డు, తమ పట్ల ప్రజలకున్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఏ) అఖండ విజయం సాధిస్తుందని మోడీ ధీమా వ్యక్తం చేశారు. ఔరంగాబాద్‌లో శుక్రవారం ఎన్నికల సభలో ప్రధాని మాట్లాడుతూ... "బీహార్ ప్రజలు అన్ని రికార్డులను బద్దలు కొట్టారు. స్వాతంత్రనయం తర్వాత రాష్ట్రంలో ఇది అతిపెద్ద పోలింగ్ శాతం. మొదటి దశలో దాదాపు 65శాతం ఓటింగ్ జరిగింది. బీహార్ యువత, రైతులు, మహిళలు బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏను ఆశీర్వదించడానికి వస్తున్నారని ఇది చూపిస్తుంది" అని పేర్కొన్నారు. పెద్ద ఎత్తున ఓటర్లు తరలి వచ్చినందుకు భారత ఎన్నికల కమిషన్‌ను ప్రశంసించారు. ఆర్‌జెడి- కాంగ్రెస్ పాలనలో ఈ ప్రాంతంలో జరిగిన రెడ్ టెర్రర్ భయానకతను గుర్తు చేస్తూ, ఔరంగాబాద్ చాలాకాలంగా నక్సల్ హింసాకాండ ఎదుర్కొనకుండని, నితీశ్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం హయాంలోనే హింసాకాండ నుండి విముక్తి పొందిందని ప్రధాని మోడీ అన్నారు. "మోడీ- నితీశ్ ట్రాక్ రికార్డు ప్రజల ముందుంది. తాము ఏదైతే చెప్తామో అదే చేశాం. రామాలయం నిర్మిస్తామన్నాం. అది జరిగిందా లేదా? 370వ అధికరణ కుప్పకూలుతుందని చెప్పాం. అది సాకారం మైందా లేదా?" అని మోడీ ప్రశ్నించారు. నితీశ్ కుమార్ సీఎంగా ఉన్న మొదటి తొమ్మిది ఏళ్లు కేంద్రం లోని కాంగ్రెస్- ఆర్‌జెడి ప్రభుత్వం ఆయనను పనిచేయనీయలేదని, 2014లో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత బీహార్ అభివృద్ధి కోసం మూడు రెట్లు అధికంగా నిధులు కేటాయించామని వివరించారు. మహాకూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్‌జెడి ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సైతం విశ్వసించడం లేదని అన్నారు. కాంగ్రెస్ బీహార్ అధ్యక్షుడిని ఆర్‌జెడి అవమానించిందని చెప్పారు. గత 35-40 ఏళ్లుగా ఎప్పుడూ గెలవని సీట్లను మాత్రమే కాంగ్రెస్‌కు ఆర్‌జెడి ఇచ్చిందన్నారు. పలుచోట్ల రెండు పార్టీలు



ఒకరిపై మరొకరు పోటీ చేస్తున్నాయని, సొంత సహచరులను నమ్మని వారు ఎవరికైనా ఎలా మేలు చేస్తారని ప్రధాని ప్రశ్నించారు. ఎన్‌డిఏ మేనిఫెస్టోను ప్రజలు విశ్వ సించారని, రాష్ట్రంలో లక్షలాది రిక్రూట్‌మెంట్లు తాము జరపడమే ఇందుకు కారణమని చెప్పారు. ఆర్‌జెడి, కాంగ్రెస్ ట్రాక్ రికార్డు ఏమిటో ప్రజలకు బాగా తెలుసునని, భూములకు ఉద్యోగాలిచ్చారన్నారు.

## టిఎంసి ఎంపికి తప్పని సైబర్ మోసం

### బ్యాంక్ ఖాతానుంచి రూ.50 లక్షలు స్వాహా

**న్యూఢిల్లీ, నవంబరు 7:** దేశంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. సొమ్ము కాజేసేందుకు నేరగాళ్లు కొత్త కొత్త దారులను వెతుక్కుంటున్నారు. సామాన్యులతోపాటూ సెలబ్రిటీలు కూడ వీరి ఉచ్చులో పడి రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. తాజాగా ఓ ఎంపీ సైబర్ మోసానికి బలయ్యారు. ఆయన బ్యాంక్ అకౌంట్ నుంచి నేరగాళ్లు ఏకంగా రూ.50లక్షలు వరకూ కాజేశారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, నాలుగుసార్లు లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ సైబర్ మోసానికి బలయ్యారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఎంపీ ఖాతాను సైబర్ నేరగాళ్లు నకిలీ పత్రాలను ఉపయోగించి యాక్సెస్ చేశారు. నకిలీ పాన్, ఆధార్ కార్డులను ఉపయోగించి మోసానికి పాల్పడ్డారు. అకౌంట్ నుంచి ఏకంగా రూ.56లక్షలు కాజేశారు. ఈ సొమ్మును వివిధ ఖాతాలకు తరలించడం, ఏటీఎమ్ ద్వారా విత్‌డ్రా చేయడంతోపాటూ ఆభరణాల కొనుగోళ్లకు ఉపయోగించినట్లు తేలింది.



## భారత్‌నుంచి వచ్చిన ఫోన్‌కాలే ప్రాణాలు కాపాడింది!: షేక్ హసీనా

**ఢాకా, నవంబర్ 7:** బంగ్లాదేశ్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన అల్లర్లలో ముష్కరుల దాడి నుంచి కేవలం 20 నిమిషాల వ్యవధిలో ఆమె తప్పించుకుని సురక్షితంగా భారత్‌కు చేరుకున్నారు. ఆమె అక్కడి నుంచి తప్పించుకోవడానికి భారత్ నుంచి వచ్చిన ఫోన్ కాల్ కారణమని తెలుస్తోంది. ఆమె ప్రాణాలను కాపాడింది భారత్ నుంచి వచ్చిన ఫోన్ కాలేనని తెలియజేస్తూ ఒక పుస్తకం త్వరలో విడుదల కానుంది. ది స్టోరీ ఆఫ్ ఆన్ అన్‌ఫినిష్డ్ రెవెల్యూషన్ అనే పేరుతో రానున్న ఈ పుస్తకంలో పలు ఆసక్తికర విషయాలను పొందు పరిచారు. గత ఏడాది బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. ఆ నిరసనల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. పరిస్థితులు తీవ్ర హింసాత్మకంగా మారడంతో అప్పటి ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేసి, దేశం విడిచి భారత్‌కు వచ్చారు. ఆమె అధికారిక భవనం గణభవన్ నుండి బయటకు వచ్చిన సరిగ్గా 20 నిమిషాలకు నిరసనకారులు అక్కడకు చొచ్చుకువచ్చారు. వారు రావడానికి ముందే ఆమె సురక్షితంగా బయటపడ్డారు. పరిస్థితులు అదుపు తప్పుతున్నప్పటికీ, తాను బంగ్లాదేశ్‌ను విడిచి వెళ్లబోనని షేక్ హసీనా కరాఖండీగా చెప్పినట్లు ఆ పుస్తకంలో పేర్కొన్నారు. ఆమెను బంగ్లాదేశ్ విడిచి వెళ్లేందుకు ఒప్పించాలని సోదరి రెహానా, అమెరికాలో ఉంటున్న ఆమె కుమారుడు వాజీద్‌కు బంగ్లా ఆర్మీ చీఫ్, ఎయిర్ ఫోర్స్, నేవీ చీఫ్‌లు సూచించినట్లు సమాచారం. నిరసనకారులు గణభవన్ వైపుకు దూసుకొస్తున్న సమయంలో హసీనా ప్రయాణించే విమానానికి తమ గగనతలంలోకి ప్రవేశించేందుకు భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చింది ఆ పుస్తకంలో పేర్కొన్న వివరాల ప్రకారం, 2024 ఆగస్టు 4న మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు భారత్ నుంచి ఫోన్ కాల్ వచ్చిందని, ఆ ఫోన్ చేసింది హసీనాతో బాగా పరిచయమున్న ఒక ఉన్నతాధికారి అని తెలుస్తోంది. ఆ సంభాషణ చాలా క్లుప్తంగా ముగిసింది. ఇప్పటికే చాలా ఆలస్యమైందని, వెంటనే గణభవన్‌ను వీడకపోతే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆ అధికారి హసీనాను అప్రమత్తం చేశారని, భవిష్యత్తులో పోరాటం చేయడానికి ప్రాణాలతో ఉండటం ముఖ్యమని సూచించారని ఆ పుస్తకంలో పేర్కొన్నారు. ఆ మాటలకు షాక్ తిన్న హసీనా, బంగ్లాదేశ్‌ను వీడాలని నిర్ణయం తీసుకోవడానికి ఆ తర్వాత కూడా అరగంట సమయం తీసుకున్నారని ఆ పుస్తకంలో పేర్కొన్నారు. ఆ సందేశాన్ని పూర్తిగా విశ్వసించిన ఆమె, దేశం విడిచి వెళ్ళే ముందు తన ప్రసంగాన్ని రికార్డు చేయాలని భావించారని వెల్లడించారు. అయితే, ముష్కరులు ఏ క్షణమైనా లోపలకి చొచ్చుకు వచ్చే అవకాశం ఉండటంతో సైన్యాధికారులు ప్రసంగం రికార్డు చేయడానికి అంగీకరించలేదు. అనంతరం సోదరి రెహానా హసీనాను బలవంతంగా కారులో కూర్చోబెట్టారు. మధ్యాహ్నం 2.33 గంటల సమయంలో చాపర్ బంగ్లాదేశ్‌లో టేకాఫ్ అయి అరగంటలో భారత్‌లో దిగిందని, అప్పటి నుంచి ఢిల్లీలో ఆమెకు భారత ప్రభుత్వం ఆశ్రయం కల్పిస్తోందని ఆ పుస్తకం పేర్కొంది. ఆ రోజు భారత్ నుంచి ఫోన్ కాల్ రాకపోతే తన తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్‌లాగే హసీనా కూడా హత్యకు గురయ్యేవారని ఆ పుస్తకంలో ఆందోళన వ్యక్తం చేశారు.

# అహ్మదాబాద్ ప్రమాదంలో పైలట్ ఇన్ కమాండ్‌ను నిందించలేం

**పిటిషన్ విచారణలో సుప్రీం సంచలన వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ, నవంబరు 7:** అహ్మదాబాద్‌లో 260 మంది ప్రాణాలను బలిగొన్న ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనలో పైలట్‌ఇన్‌కమాండ్‌ను నిందించలేమని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ ఘటనకు సంబంధించి పైలట్ తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం, కేంద్ర ప్రభుత్వం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)లకు నోటీసులు జారీ చేసింది. ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానానికి పైలట్‌ఇన్‌కమాండ్‌గా పనిచేసిన సుమీత్ సబర్వాల్ ఈ ప్రమాదంలో మరణించారు. ఆయన తండ్రి పుష్కరాజ్ సబర్వాల్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ (ఎఫ్ఐపీ) ఈ ఘటనపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) ఈ ఏడాది జులైలో విడుదల చేసిన ప్రాథమిక నివేదికను వారు తమ పిటిషన్‌లో సవాల్ చేశారు. విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే రెండు ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోయిందని ఏఏఐబీ తన ప్రాథమిక నివేదికలో పేర్కొంది. రెండు ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్‌లు ఒకదాని తర్వాత ఒకటి వేగంగా "కటాఫ్" పొజిషన్‌లోకి వెళ్లాయని తెలిపింది. సుమారు 10 సెకన్ల తర్వాత స్విచ్‌లను తిరిగి ఆన్ చేసినప్పటికీ, అప్పటికే ఇంజిన్లు ఆగిపోయి (ఫ్లేమ్డ్ అవుట్) విమానం కుప్పకూలిందని నివేదికలో వివరించింది. ఈ నివేదికతో విభేదిస్తూ పైలట్ తండ్రి, పైలట్ల సంఘం దాఖలు చేసిన పిటిషన్లను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు, పైలట్‌ను నిందించలేమని వ్యాఖ్యానిస్తూ కేంద్రం, డీజీసీఏల నుంచి వివరణ కోరింది. ఈ కేసులో తదుపరి విచారణ జరగనుంది.

**సుఖోయ్ తయారీ పరిజ్ఞానం మొత్తం బదలీకి రష్యా సుముఖం**

# ఇక భారత్‌లోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్‌లోనే జెట్‌ల తయారీ

**మాస్కో, నవంబరు 7:** భారత రక్షణ రంగం మరో కీలక మైలురాయిని చేరుకోబోతోంది. రష్యాకు చెందిన అత్యాధునిక ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ ఎస్‌యు57 (సుఖోయ్57)ను భారీ ఎత్తున ఉత్పత్తి చేసే సామర్థ్యం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు ఉందని రష్యా టెక్నికల్ బృందం నిర్ధారించింది. కేవలం ఉత్పత్తికి అనుమతి ఇవ్వడమే కాకుండా, సోర్స్ కోడ్‌లు సహా పూర్తి టెక్నాలజీని బదిలీ చేయడానికి కూడా రష్యా ముందుకొచ్చింది. ఈ ఒప్పందం




ఖరారైతే, ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన యుద్ధ విమానాల్లో ఒకటైన ఎస్‌యు57 ఇకపై భారత్‌లోనే తయారు కానుంది. సుఖోయ్ డిజైన్ బ్యూరో, ఇతర రక్షణ సంస్థలతో కూడిన రష్యా బృందం సెప్టెంబర్ నెలలో హెచ్ఏఎల్ సౌకర్యాలను సందర్శించింది. ఎస్‌యూ57ఈ యుద్ధ విమానాల దేశీయ ఉత్పత్తికి అవసరమైన మౌలిక సదుపాయాల్లో దాదాపు 50 శాతం ఇప్పటికే హెచ్ఏఎల్ వద్ద ఉన్నాయని ఈ బృందం తన నివేదికలో స్పష్టం చేసింది. హెచ్ఏఎల్ సుమారు 505 స్టెల్త్ జెట్లను తయారుచేయగలదని నివేదికలో పేర్కొన్నది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఢిల్లీ పర్యటనకు కొద్ది రోజుల ముందు ఈ నివేదికను సమర్పించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పుతిన్ పర్యటనలోనే ఈ కీలక ఒప్పందంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని భావిస్తున్నారు. గతంలో సుఖోయ్‌ఎస్‌యు30 ఫైటర్ జెట్లను భారత్‌లో విజయవంతంగా ఉత్పత్తి చేసిన అనుభవం హెచ్ఏఎల్‌కు ఉంది. 2000 సంవత్సరంలో కుదిరిన ఒప్పందం మేరకు ఈ జెట్లను హెచ్ఏఎల్ తయారు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే రష్యా బృందం బెంగళూరు, నాసిక్, కోరాపుట్‌లోని హెచ్ఏఎల్ యూనిట్లను సందర్శించి, ఇక్కడి తయారీ సామర్థ్యాలను, సాంకేతిక సంసిద్ధతను అంచనా వేసింది. రష్యా నివేదిక నేపథ్యంలో, పెట్టుబడులు పెట్టాల్సిన కీలక రంగాలను గుర్తిస్తూ హెచ్ఏఎల్ కూడా ఒక అంతర్గత నివేదికను సిద్ధం చేస్తోంది. అత్యాధునిక కాంపోజిట్ మెటీరియల్స్, రాడార్‌ను తప్పించుకునే కోటింగ్స్, డిజిటల్ డిజైన్, నెక్స్ట్ జనరేషన్ ఇంజిన్ టెస్ట్ బెడ్స్ వంటి వాటిపై దృష్టి సారించనుంది. ఎస్‌యు57ని జెట్ల సంయుక్త ఉత్పత్తి భారత వైమానిక దళాన్ని గణనీయంగా బలోపేతం చేస్తుందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తగ్గుతున్న ఫైటర్ జెట్ల స్క్వాడ్రన్ల సమస్యను అధిగమించడంతో పాటు, ప్రపంచ ఏరోస్పేస్ రంగంలో భారత్ స్థాయిని ఇది మరింత పెంచుతుంది. దేశీయంగా అభివృద్ధి చేస్తున్న ఐదో తరం ఫైటర్ జెట్ ప్రోగ్రామ్‌కు కూడా ఈ ప్రాజెక్ట్ అదనపు బలాన్ని ఇస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

# వెనిజులాపై కమ్ముకుంటున్న అమెరికా యుద్ధమేఘాలు!

**కారకాస్, నవంబరు 7:** అమెరికా, వెనిజులా మధ్య ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. నిన్న రెండు అమెరికా ఎఫ్52 బాంబర్లు కరేబియన్ సముద్రంలో వెనిజులా తీరం వెంబడి ప్రయాణించాయి. అమెరికా సైనిక విమానాలు ఈ ప్రాంతంలో శక్తి ప్రదర్శన చేయడం ఇది నాలుగోసారి కాగాఈ పరిణామం ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఉన్న వైరాన్ని మరింత పెంచింది. విమాన కదలికలను ట్రాక్ చేసే వెబ్‌సైట్ ఫ్లైట్ రాడార్ 24 డేటా ప్రకారం, ఈ రెండు బాంబర్లు వెనిజులా తీరానికి సమాంతరంగా ప్రయాణించాయి. ఆ తర్వాత రాజధాని కరాకస్‌కు ఈశాన్య దిశలో కాసేపు చక్కర్లు కొట్టి, తిరిగి తీరం వెంబడి ప్రయాణిస్తూ ఉత్తర దిశగా సముద్రంలోకి వెళ్లిపోయాయి. అక్టోబర్ మధ్య నుంచి అమెరికా సైనిక విమానాలు వెనిజులా సమీపంలో ప్రయాణించడం ఇది నాలుగోసారి. గతంలో ఒకసారి ఎఫ్52, రెండుసార్లు బి1బిబాంబర్లు ఇలాంటి విన్యాసాలు చేశాయి. ఈ ప్రాంతంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు సైనిక చర్యలు చేపడుతున్నామని వాషింగ్టన్ చెబుతోంది. ఇందులో భాగంగానే యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్. ఫోర్డ్ యుద్ధనౌక బృందాన్ని లాటిన్ అమెరికాకు పంపింది. ప్యూర్టోరికోలో ఎఫ్35 స్టెల్త్ యుద్ధ విమానాలను, కరేబియన్ సముద్రంలో ఆరు నౌకాదళ నౌకలను మోహరించింది. సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు డ్రగ్స్ రవాణా చేస్తున్నాయనే ఆరోపణలతో 17 నౌకలపై దాడులు చేశామని, ఈ దాడుల్లో 67 మంది మరణించారని అమెరికా పేర్కొంది. అయితే, లక్ష్యంగా చేసుకున్న నౌకలు మాదకద్రవ్యాల రవాణాకు ఉపయోగించబడ్డాయని గానీ, అవి దేశానికి ముప్పుగా పరిణమించాయని గానీ అమెరికా ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలను విడుదల చేయలేదు. ఈ సైనిక కదలికలు, దాడులతో ప్రాంతీయంగా తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. డ్రగ్స్ నిరోధం అనేది కేవలం ఒక సాకు మాత్రమేనని, అధ్యక్షుడు నికోలస్ మాదూరో ప్రభుత్వాన్ని కూలదోయడానికే వాషింగ్టన్ కుట్ర పన్నుతోందని వెనిజులా తీవ్రంగా ఆరోపిస్తోంది.

# నాన్సీపెలోసీ రిటైర్‌మెంట్‌ప్రకటించి అమెరికాకు ఎంతో మేలుచేసారు: ట్రంప్



**వాషింగ్టన్, నవంబరు 7:** చట్టసభలో స్పీకర్‌గా పనిచేసిన నాన్సీ పెలోసీ తాను ఇక రాజకీయాలనుంచి రిటైర్ అవుతానని ప్రకటించడంతో డొనాల్డ్‌ట్రంప్ ఛలోక్తులు వేస్తూ ఆమెచాలా చెడ్డనేత అని అవినీతిపరు రాలంటూ ఆమె పోవడం వల్ల అమెరికాకు ఎంతోమేలు జరిగిందని వ్యాఖ్యలుచేసారు. నాన్సీ పెలోసీ తాను ఇక రిటైర్ కావాలనుకుంటున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ట్రంప్ ఆమెపై ఉన్న వ్యతిరేకతను మొత్తం వెళ్లగక్కారు. దేశానికి చెడుజరిగే అంశాలపైనే నాన్సీ ఫోకస్‌పెట్టారని, ఆమె అవినీతి పరురాలని, ఎంతో చెడ్డపనులుచేసే మహిళ అని ఆమె రిటైర్‌కావడం అమెరికాకు ఎంతోమేలు జరిగిందని వ్యంగ్యోక్తులు విసిరారు. దేశప్రతిష్టను ఎంతో దెబ్బతీసారని, ఆమె రిటైర్ అవుతూ దేశానికి ఎంతో మేలుచేసారని వైట్‌హౌస్‌లో మీడియాతోమాట్లాడుతూ వ్యాఖ్యలుచేసారు. అమెరికా ప్రతినిధుల సభకు మళ్లీఎన్నికకావాలని కోరుకోవడంలేదని నాన్సి పెలోసీ ప్రకటించారు. శాన్‌ఫ్రాన్సిస్కోకు 40 ఏళ్లపాటు ప్రాతినిధ్యం వహించిన ఆమె గురువారం తాజాగా తన రిటైర్‌మెంట్ నిర్ణయాన్ని ప్రకటించారు. స్పీకర్ కార్యాలయంలో తన చివరి ఏడాది పూర్తి చేసానని ఆమెచెపుతూ తాను శాన్‌ఫ్రాన్సిస్కోను ఎంతోప్రేమించానని, చరిత్ర సృష్టించానని ఆమె పేర్కొన్నారు. ప్రగతిపథంలోనే నడిచామని ఆమె చెప్పారు.

## సంక్షిప్తంగా..

### శబరిమలకు 60 ప్రత్యేక రైళ్లు




**తిరువనంతపురం, నవంబర్ 7:** శబరిమల వెళ్లే భక్తులకు శుభవార్త. భక్తుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్ల ఏర్పాటు చేసింది. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల మీదుగా శబరిమలకు మొత్తం 60 ప్రత్యేక రైళ్లు నడుపు తున్నట్లు ప్రకటించింది. ఈ రైళ్లు నవంబర్, డిసెంబర్, జనవరిలోని పలు తేదీల్లో సర్వీసు లందించనున్నాయి. చర్లపల్లి, కొల్లం, చర్లపల్లి ప్రత్యేక రైళ్లు పగిడిపల్లి, గుంటూరు, గూడూరు, రేణిగుంట మీదుగా మొత్తం 20 సర్వీసులందించనున్నాయి. నర్సాపూర్ - కొల్లం - నర్సాపూర్ రైళ్లు విజయవాడ, గూడూరు, రేణిగుంట మీదుగా 20 సర్వీసులు అందించనున్నాయి. మచిలీపట్నం - కొల్లం - మచిలీపట్నం రైలు గూడూరు, రేణిగుంట మీదుగా 10 సర్వీసులు అందిస్తాయి. మచిలీపట్నం - కొల్లం - మచిలీపట్నం రైళ్లు గుంటూరు, నంద్యాల, కడప, రేణిగుంట మీదుగా 10 సర్వీసులందిస్తాయి.

### 15 యేళ్లనాటి హత్యకేసులో భర్త అరెస్టు!



**న్యూఢిల్లీ, నవంబరు 7:** దాదాపు 15 ఏళ్ల క్రితం జరిగిన ఓ హత్య కేసు మిస్టరీని ఢిల్లీ పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. భార్యను హత్య చేసి, అది ఆత్మహత్యగా చిత్రీకరించి పరారైన భర్తను గుజరాత్‌లో అరెస్ట్ చేశారు. నిందితుడు నరోత్తమ్ ప్రసాద్‌ను ఢిల్లీకి తరలించి, తదుపరి చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. 2010 మే 31న ఢిల్లీలోని జహంగీర్‌పురి ప్రాంతంలోని ఒక ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని ఇంటి తలుపులు పగలగొట్టి చూడగా, 25 ఏళ్ల మహిళ మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో నేలపై పడి ఉంది. సంఘటనా స్థలంలో ఒక సూసైడ్ నోట్ కూడా లభించింది. విచారణ ప్రారంభించిన పోలీసులకు మృతురాలి భర్త నరోత్తమ్ ప్రసాద్‌పై అనుమానం కలిగింది. అప్పటికే అతను పరారీలో ఉండటంతో అనుమానం బలపడింది. దీంతో పోలీసులు అతడిని నిందితుడిగా ప్రకటించి, అతడి ఆచూకీ తెలిపిన వారికి రూ.10,000 రివార్డు కూడా ప్రకటించారు.

### సైనిక్ స్కూల్‌లో ర్యాగింగ్



**గాంధీనగర్, నవంబర్ 7:** ఒక సైనిక్ స్కూల్‌లో జూనియర్లపై సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. బలవంతంగా శిక్షించడంతో పాటు కర్రతో వారిని కొట్టారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. గుజరాత్‌లోని బాలచాడి సైనిక స్కూల్‌లో ఈ సంఘటన జరిగింది. ఒక సీనియర్ విద్యార్థి టవల్ ఉన్నాడు. జూనియర్ స్టూడెంట్స్‌ను అతడు వేధించాడు. పుష్ అప్‌లు తీయమని బలవంతం చేశాడు. ఆ పొజిషన్‌లో ఉన్నవారిని వరుసగా కర్రతో కొట్టాడు. దీంతో కొందరు జూనియర్లు బాధతో అల్లాడిపోయారు. కాగా, ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

### యువకుడిపై దాడి, నాలికతో కాళ్లు నాకించిన వైనం



**సూరత్, నవంబరు 7:** గుజరాత్‌లోని సూరత్ నగరంలో మానవత్వం సిగ్గుపడే ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. ఓ యువకుడిని దారుణంగా కొట్టి, కత్తితో బెదిరించి, బలవంతంగా కాళ్లు నాకించారు. ఈ పైశాచిక చర్యను నిందితుడే స్వయంగా తన ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం గమనార్హం. ప్రస్తుతం ఈ వీడియోలు వైరల్ కావడంతో ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. మధ్యప్రదేశ్‌కు చెందిన సుధీర్ పాండే అనే యువకుడు ఉపాధి కోసం సూరత్‌కు వచ్చి అమ్రోలి ప్రాంతంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. అక్కడే ఈ దాడి జరిగింది. దాడికి పాల్పడిన వ్యక్తిని బాధితుడు "భోలా భాయ్" అని పిలుస్తున్నట్లు వీడియోలో వినిపిస్తోంది. నిందితుడు కత్తి చూపించి సుధీర్‌ను బెదిరిస్తూ తీవ్రంగా కొట్టాడు. 'భోలా భాయ్, నన్ను క్షమించు. నేను ఇకపై ఎప్పుడూ సూరత్‌కు తిరిగి రాను' అని బాధితుడు వేడుకుంటున్న దృశ్యాలు వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# బంగారు, వెండి బల్లుల తాపడాలు మారలేదు : స్పందించిన కంచి ఆలయం



**చెన్నై, నవంబరు 7:** తమిళనాడులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాంచీపురంలోని వరదరాజ పెరుమాళ్ ఆలయంలో బల్లుల విగ్రహాలకు ఉన్న తాపడాలను మార్చినట్లు ఫిర్యాదు అందడం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా ఆలయ మేనేజ్‌మెంట్ స్పందిస్తూ ఆరోపణలను తోసిపుచ్చింది. ఆ విగ్రహాల్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. 'ఆలయంలోని బంగారు, వెండి బల్లుల విగ్రహాలు సీలింగ్‌కు అలాగే ఉన్నాయి. వాటిని తొలగించడం గానీ, తాపడాలను మార్చడం గానీ చేయలేదు. దీనిపై ఆలయాల ఉద్యమకారుడు తప్పుడు, నిరాధార ఆరోపణలు చేశారు. ఆయనపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం' అని ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి శుక్రవారం వెల్లడించారు. కాంచీపురంలోని వరదరాజ పెరుమాళ్ ఆలయంలో ప్రస్తుతం పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఆలయంలోని పురాతన బంగారు, వెండి బల్లుల తాపడాలను మార్చేసి వాటి స్థానంలో కొత్త తాపడాలను ఏర్పాటు చేశారని శ్రీరంగానికి చెందిన రంగరాజ నరసింహ ఫిర్యాదు చేశారు. దీంతో విగ్రహాల అక్రమ తరలింపు నిషేధ విభాగం పోలీసులు దీనిపై దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆలయ ఇఒ రాజ్యలక్ష్మిని పోలీసులు 8 గంటలపాటు విచారించారు. ఆలయంలోని ఇతర సిబ్బందిని కూడా ప్రశ్నించారు.

ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. అవసరమైనప్పుడు విచారణకు రావాలని ఆయల ఇఒ, సిబ్బందిని ఆదేశించినట్లు తెలిసింది. 108 దివ్య క్షేత్రాల్లో ఒకటైన కాంచీపురంలోని ఈ ప్రసిద్ధ వరదరాజస్వామి ఆలయంలో బంగారు, వెండి బల్లులు విశిష్టమైనవి. నిత్యం ఈ ఆలయాన్ని దేశం నలుమూలల ఉంచి వచ్చే భక్తులు దర్శించుకుంటారు. ఇక్కడి బంగారు, వెండి బల్లులను తాకితే దోషనివారణ జరుగుతుందని నమ్మకం.

# ఆవిష్కరణలపైనే ఆధారపడిన రాష్ట్ర భవిష్యత్తు

## విద్యార్థులు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

## శాతవాహన వర్సిటీ రెండో స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



శుక్రవారం శాతవాహన విశ్వవిద్యాలయ రెండో స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ విద్యార్థినికి పట్టాను ప్రదానం చేస్తున్న దృశ్యం

**కరీంనగర్, ప్రభాతవార్త:** రాష్ట్ర భవిష్యత్తు నూతన ఆవిష్కరణలపై ఆధారపడి ఉందని గవర్నర్, చాన్సలర్ జిష్ణుదేవ్‌వర్మ తెలిపారు. ప్రతి విద్యార్థి నైపుణ్యం, నిరంతర అభ్యాసాలే విజయానికి దోహదం చేస్తాయన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో గవర్నర్ పర్యటించారు. మొదట శాతవాహన విశ్వ విద్యాలయ రెండో స్నాతకోత్సవానికి హాజరయ్యారు. అనంతరం కరీంనగర్ కలెక్టరేట్‌లో వివిధ కార్య క్రమాల్లో పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో పరిశోధనలు నిర్వహించి 25 మందికి పిహెచ్‌డి పట్టాలు, 2018 నుంచి 2023 వరకు చదు వుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 129 మంది విద్యార్థులకు 161 మంది విద్యా ర్థులకు బంగారు పత కాలు గవర్నర్ అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నిరంతర అభ్యా సంతోనే విజయం సాధ్యమవు తుందన్నారు. శ్రద్ధ, క్రమ శిక్షణతో లక్ష్యాన్ని చేరుకోవాలని విద్యార్థులకు పిలుపు నిచ్చారు. క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం విద్యార్థులను విజయం దిశగా తీసుకెళుతుందన్నారు. విద్యార్థుల మేధా శక్తే వారి ప్రయోగశాలగా అభివర్ణించారు. విద్యార్థుల ఆలోచనలు, శ్రమ, సృజనాత్మకత వారిని సమాజంలో ముందుకు తీసుకెళ్తాయని వివరించారు. అవకాశం, సమా నత్వం సృజనాత్మకతతో, దృఢ నిశ్చయంతో ఎదగాలని ఆకాంక్షి ంచారు. విశ్వవిద్యాలయానికి విద్యా రంగాల్లో, ఉన్నతమైన విద్యా ప్రమాణాలు నెలకొల్పాలని తెలి పారు. విశ్వవిద్యాల యానికి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ దిశగా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పిలుపు నిచ్చారు. విద్యా రంగం, బోర్డు, చాక్ పీస్ లకే మాత్రమే పరిమితం కావదన్నారు. సాంకేతికతతో, పోటీతత్వంతో ముందుకు సాగాలన్నారు. సాంకేతిక అభ్యాసం అనేక అవరో ధాలను అవకాశాల మధ్య వ్యత్యాసాలను చెరిపి వేసిందని తెలిపారు. ప్రపంచ విజ్ఞానాన్ని ఆహ్వా నించా లని, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చు కోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరా బాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ జె.బి.రావు, శాత వాహన యూని వర్సిటీ వైస్ ఛాన్సలర్ యు.ఉమేష్‌కుమార్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సి పల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, మాజీ శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్లు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్ శాత వాహన వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమం అనంతరం కలెక్టరేట్ చేరుకున్న గవర్నర్ మొదటగా పోలీస్ గౌరవవందనం స్వీకరించి, డిపార్ట్‌మెంట్ వారీగా ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం వందేమాతర గేయంతో కార్య క్రమాన్ని ప్రారంభించగా తదనంతరం బాలభవన్ విద్యార్థుల శాస్త్రీయ నృత్యం, అంధ విద్యార్థులు పాటలను ఆలపించారు. కరీంనగర్ జిల్లా సమగ్ర స్వరూపంతో పాటు జిల్లా విశేషాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్, గవర్నర్‌కు వివరించారు.


మర్రి జనార్దన్‌రెడ్డి ఇంట్లో దొరికిన దుస్తులను చూపుతున్న బిఆర్ఎస్ నేతలు.

## బిఆర్ఎస్ నేత మర్రి జనార్దన్‌రెడ్డి ఇంట్లో ఎన్నికల అధికారుల సోదాలు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 7, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నేత మర్రి జనార్దన్‌రెడ్డి ఇంట్లో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఇంట్లో డబ్బులు దాచి పెట్టాడనే సమా చారంతో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి అధికారులు మోతినగర్‌లోని జనార్దన్‌రెడ్డి ఇంటిపై దాడులు నిర్వహించారు. ఇంటి అవస రాలకు పెట్టిన డబ్బులు మినహా మరెలాంటి డబ్బులను పోలీసులు ఇక్కడ గుర్తించలేదు. దీంతో వారు వెనుదిరిగారు. ఈ సందర్భంగా మీడియాతో జనార్దన్‌రెడ్డి మాట్లాడే క్రమంలో బోరబండ పోలీసులు అక్కడికి చేరుకున్నారు.

ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డికి, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. తాము గతంలో ప్రభుత్వంలో ఉన్నామని, ఇలా చేయలేదని జనార్దన్‌రెడ్డి అన్నారు. యూనిఫాం గురించి తప్పుగా మాట్లాడవద్దని అక్కడే ఉన్న పోలీసు అధికారి జనార్దన్‌రెడ్డిని నిల దీయగా, తాను యూనిఫాం గురించి మాట్లాడలేదని, కొడతారా అంటూ పోలీ సులను ప్రశ్నించారు. తాను ఇంట్లోకి వెళ్తుంటే అడ్డగించడం సమంజసం కాదన్నారు. పోలీసులు ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని, కాంగ్రెస్ కండువ కప్పు కోవాలని జనార్దన్‌రెడ్డి అనడంతో ఈ వివాదం చెలరేగింది.

మరోవైపు ఈ సంఘటనపై నారా యణపేట మాజీ ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఇంట్లో ఎన్నికల అధికారులు దాడి చేసిన క్రమంలో కేవలం బనియన్, డ్రాయర్ లభించా యన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ కార్యాకర్తలు అక్కడ ఎన్నికల అధికారులకు దొరికిన కొన్ని దుస్తులను చూపారు.

## డిజిపి కార్యాలయంలో ఘనంగా వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాలు

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** దేశ స్వతంత్ర పోరాటంలో జాతిని ఒక తాటిపై నడిపిన వందేమాతరం గీతం 150యేళ్లు పూర్తి చేసుకు న్న సందర్భంగా దేశ వ్యాప్తంగా శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమం డిజిపి కార్యాలయంలోనూ ఘనంగా జరిగింది. డిజిపి కార్యాలయంలో పోలీసు అధికారులతోపాటు మినిస్టీరియల్ స్టాఫ్ అందరు ఆడిటోరియంలో వందే మాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ జోన్ డిఐజి ఎల్ఎస్ చౌహాన్‌తో పాటు శాంతి భద్రతల ఎఐజి రమణకుమార్, పరిపాలన ఏఐజి నాగరాజు సహా ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఐజి చౌహాన్ మాట్లాడుతూ దేశ చరిత్రలో వందేమాతరం గీతానికి అపూర్వ మైన స్థానం వుందని అన్నారు. ఈ గీతం జాతీయ చైతన్యానికి ప్రతీకగా నిలిచిందని ఆయన తెలిపారు. దేశ స్వాతంత్ర పోరాటంలో ఈ గీతం పోషించిన ప్రేరణాత్మక పాత్రను అందరు స్మరించుకోవాలని ఆయన కోరారు.

### వచ్చే యేడాది నుంచి 4,900 ప్రభుత్వ స్కూళ్లలో

# ప్రీప్రైమరీ క్లాసులు ప్రారంభం

**ఎన్నికల కోడ్ తర్వాత డిఎస్‌సి-2024 స్పోర్ట్స్ కోటా టీచర్ పోస్టుల నియామకం**

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వచ్చే యేడాది నుంచి మరికొన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ క్లాసులను ప్రారంభించ నున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1300 స్కూల్స్‌లో ప్రీ ప్రైమరీ క్లాసును కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. అయితే వచ్చే విద్యా సంవత్సరం 2026-27 నుంచి మరో 4,900 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో కూడా ప్రీ ప్రైమరీ క్లాసులను ప్రారంభించ నున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాద నలను పాఠశాల విద్య శాఖ ప్రభుత్వానికి సమ ర్పించగా.. ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. దీంతో వచ్చే ఏడాది మరో 4900 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ క్లాసులను ప్రారంభించ నున్నారు.

అయితే ఇప్పటికే ప్రారంభించిన ప్రీ ప్రైమరీ క్లాసులను బోధించడానికి అధికారికంగా ఉపాధ్యాయులను రిక్రూట్‌చేయకపోయినప్పటికీ.. కాంట్రాక్ట్ పద్ధతిలో కొనసాగిస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి ప్రారంభం కానున్న మరో 4900 స్కూల్స్‌లో కూడా ఇదే పద్ధతిలో టీచర్లను కొనసాగిస్తారా? లేకపోతే వచ్చే ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే ఆయా పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొని వాటి భర్తీకి చర్యలు చేపడతారా? చూడాల్సి ఉంది.

అయితే ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశా లల్లో ప్రీ ప్రైమరీ క్లాసులను ప్రారంభిస్తే ప్రైవేటు స్కూల్స్‌కి వెళ్లే విద్యార్థుల సంఖ్యను ప్రాథమిక స్థాయిలోనే నియంత్రించవచ్చనే యోచనతో ప్రభుత్వం ప్రీ ప్రైమరీ క్లాసులను ప్రారంభించాలని నిర్ణయించిన నేపథ్యంలోనే ఇప్పటికే 1300 స్కూల్స్‌లో కొనసాగిస్తుండగా.. మరో 4900 పాఠశాలల్లో వచ్చే ఏడాది నుంచి ప్రీ ప్రైమరీ క్లాసులను కొనసాగించాలని నిర్ణయిం చారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను త్వరలోనే ప్రభుత్వం అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది. రాష్ట్రంలో డిఎస్‌సి-2024 ద్వారా సుమారు 11వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి పరీక్షలను నిర్వహించి ఫలితాలను విడుదల చేసిన అనంతరం 10వేలకి పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు. వాటిల్లో స్పోర్ట్స్ కోటాలో సుమారు 100 పోస్టులను కేటాయించారు. వాటి నియా మకంలో స్పోర్ట్స్ సర్టిఫికెట్ల సమర్పణలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలతో కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే వాటిలో కొన్ని పోస్టులను భర్తీ చేసిన నేపథ్యంలో కోర్టులో కేసులు కొనసాగాయి. కొద్ది రోజుల క్రితం ఇందుకు సంబంధించి కోర్టు తీర్పును ఇచ్చిన నేపథ్యంలో స్పోర్ట్స్ శాఖ నుంచి సర్టిఫికెట్లపై నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో స్పోర్ట్స్ కోటాలో టీచర్ల నియామకంపై క్రీడల శాఖ సమర్పించిన నివేదిక ఆధారంగా పాఠశాల విద్య శాఖ స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన వారికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రక్రియ పూర్తయిన తరువాత నియా మక పత్రాలను అందజేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది. సుమారు 90 మంది వరకు నియామ కమయ్యే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల వేళ భారీగా నగదు, మద్యం జప్తు

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** మరో మూడురోజుల్లో జూబ్లీహిల్స్ అసెం బ్లీ నియోజిక వర్గానికి ఉప ఎన్నికలు జరగనున్న సమయంలో పోలీసుతో పాటు అబ్కారీ విభాగం ఈ ప్రాంతం లో భారీగా నగదు, అక్రమ మద్యం బాటిళ్లను జప్తు చేసింది. శుక్రవారం వరకు కొనసాగిన తనిఖీ ల్లో మూడు కోట్ల 30 లక్షల రూపాయల నగదుతో పాటు 701 లీటర్ల అక్రమ మద్యం బాటిళ్లను జప్తు చేశారు. ఇదే సమయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనకు సంబంధించి 24 కేసులు నమోదు చేశారు. ఇందులో అనుమతులు తీసుకోకుండా సమా వేశాలు నిర్వహించినందుకు ఏడు కేసులు, ప్రసంగాలు చేసినందుకు నమోద య్యాయి. జప్తు చేసిన మద్యం విలువ నాలుగు లక్షల 74 వేల 322 రూపా యలు. దీంతోపాటు 0.11 గ్రాముల ఎండిఎంఏ సహా 2.454 కిలోల గంజా యిని కూడా జప్తు చేశారు. వీటి విలువ లక్షా 97 వేల 600 రూపాయలు.




## అరుదైన రైట్‌నెక్ లింఫాంజియోమాకు విజయవంతమైన చికిత్స

### రోగికి నూతన జీవితాన్ని అందించిన మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** అరుదైన రైట్ నెక్ లింఫాంజియోమాకు విజయవంతమైన చికిత్సను అందించి రోగికి నూతన జీవితాన్ని అందించారు మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు. హైదరాబాద్‌లోని మెడికవర్ హాస్పిటల్స్ వైద్య బృందం 25 సంవత్సరాలుగా పునరావృతమవుతున్న ఒక అరుదైన రైట్ నెక్ లింఫాంజియోమా కేసును విజయవంతంగా చికిత్స చేసి రోగి జీవితానికి కొత్త ఊపిరి ఇచ్చింది. రోగి గతంలో 2010, 2015, 2025లో మూడు సార్లు శస్త్ర చికిత్సలు చేయించుకున్నప్పటికీ, వాపు మళ్లీ రావడంతో సమస్య మరింత తీవ్రమైంది. గడ్డ పెరిగి మెడ కదలికలు కష్టమవడం, శ్వాసలో ఇబ్బందులు వంటి సమస్యలు వచ్చాయి. లింఫాంజియోమా అనేది లింఫ్, రక్తనాళాల అసాధారణ పెరుగుదల వల్ల ఏర్పడే అరుదైన మాల్ఫార్మేషన్. ఇది తిరిగి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉండటం, అలాగే మెడలో కీలక నరాలతోపాటు అవయవాల సమీపంలో ఉండడం వలన శస్త్రచికిత్స చాలా క్లిష్టంగా ఉంటుంది.

మెడలో కీలకమైన నరాలు, రక్తనాళాలు, అన్ననాళం, శ్వాసనాళం సమీపంలో లింఫాంజియోమా ఉండటం, గత శస్త్రచికిత్సల వల్ల ఏర్పడిన తీవ్రమైన మచ్చల కణజాలం కారణంగా ఈ ఆపరేషన్ అత్యంత క్లిష్టంగా మారింది. రోగి పరిస్థితిని పూర్తిగా అంచనా వేసిన అనంతరం, సీనియర్ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ రాహుల్ లక్ష్మీ మ్నారాయణ, కన్సల్టెంట్ జనరల్ సర్జన్ డాక్టర్ వెంకట్ పవన్ , అనస్తేషియాలజీ విభాగం డాక్టర్ వేణుగోపాల్ నేతృత్వంలో నిపుణుల బృందం 5 గంటలు పాటు శ్రమించి అత్యంత క్లిష్టమైన రికన్‌స్ట్రక్టివ్ ఎక్సిషన్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు.

లింఫాంజియోమా యొక్క పరిమాణం 5కేజీలు ఉంది. డాక్టర్ రాహుల్ లక్ష్మీ మ్నారాయణ మాట్లాడుతూ.. 'పునరావృత లింఫాంజియోమాలు సాంకేతికంగా అత్యంత సవాలుతో కూడినవి. తీవ్రమైన రక్తస్రావం, నరాల గాయాలు అంతర్గత అవయవాల గాయాల ప్రమాదం అధికంగా ఉన్నప్పటికీ, ఆధునిక ఇమేజింగ్‌తోపాటు కచ్చితమైన ప్రణాళికతో మేము ఎటువంటి సంక్లిష్టతలు లేకుండా అద్భుతమైన ఫలితాన్ని సాధించామని వివరించారు.

## హైడ్రాను ప్రజలు స్వాగతిస్తుంటే.. బద్నాం చేస్తున్న కెటిఆర్

### మాజీ ఎంపి వి.హనుమంతరావు

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** కబ్జాదారులకు కెటిఆర్ కొమ్ము కాస్తున్నాడని పిసిసి మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. ప్రభుత్వ స్థలాలను కబ్జాలకు గురి కాకుండా రక్షి స్తున్న హైడ్రాను బద్నాం చేస్తు న్నా డని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం అంబర్ పేట బతుకమ్మకుంట వద్ద కాంగ్రెస్, సిపిఎం పార్టీ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బిఆర్ఎస్ నాయకులే ప్రభుత్వ భూములను కబ్జా చేసి ప్రభుత్వ భూములను కబ్జా చేసి కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. అలాంటి కబ్జాదారులలో అంబర్‌పేట బతు కమ్మ కుంటను కబ్జా చేసిన వ్యక్తి బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నాడని ఆరోపించారు. పది సంవత్సరాలుగా బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో ఉండగా కబ్జాల గురించి పట్టించుకోని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో హైడ్రా గురించి తప్పుగా మాట్లాడు తున్నాడని ఆయన మండిపడ్డారు. హైడ్రా చేస్తున్న పనులను ప్రజలు స్వాగతిస్తుంటే బిఆర్ ఎస్ పార్టీ వ్యతిరేక చేయడం ఎంతవరకు సమంజ సమని ఆయన ప్రశ్నించారు. కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి బిఆర్ఎస్‌కు కొమ్ము కాస్తున్నారని అన్నారు. అంబర్‌పేటలో ఫ్లైఓవర్ నిర్మాణం తప్ప ఆయన ఏమి చేయలేదని విమర్శించారు. బిఆర్ ఎస్, బిజెపి రెండు ఒకటేనని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు మహేంద ర్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆర్.లక్ష్మ ణ్‌యాదవ్. పిసిసి సెక్రెటరీ శంభుల శ్రీకాంత్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు పుల్ల నారాయణస్వామి, దిడ్డి రాంబాబు. పార్టీ సీనియర్ నాయకులు గరిగంటి రమేష్. మోత రోహిత్, రామ్మోహన్, కృష్ణగౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, వెంకట్‌గౌడ్, కోటం అనిల్, రావుల సుధాకర్, చెంగలి సుధాకర్, కోట్ల కిరణ్. రాజ్‌కిరణ్ తది తరులు పాల్గొన్నారు.


బతుకమ్మకుంట వద్ద మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపి వి.హనుమంతరావు, చిత్రంలో లక్ష్మణ్‌యాదవ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

## రేవంత్‌రెడ్డి సర్కారుకు రోజులు దగ్గర పడ్డాయి

### బిసి సంకేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్ కృష్ణయ్య

**హైదరాబాద్ (మెహిదీపట్నం), నవంబరు 7. ప్రభాతవార్త :** రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని,విద్యార్దులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం నిల్వలేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఐదు రోజులుగా కాలేజీలు మూసివేసి నిరసనలు తెలుపుతుంటే ప్రభు త్వానికి కనీసం చీమ కుట్టినట్లు లేక పోవడం విడ్డూరంగా ఉందని ఆయన తెలిపారు.పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు నీల వెంకటేష్ ఆధ్వ ర్యంలో శుక్రవారం మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి మందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 24 నాలుగు నెలలు అవు తున్న విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయలేదని తెలిపారు.కాలేజి లెక్చరర్ల జీతాలు నెలలు తరబడి అందనందున తీవ్ర ఇబ్బందులకు గున వుతు న్నారని ఆయన తెలియజేశారు. ఈ ముట్టడి కార్యక్రమంలో మోడీ రాందేవ్, గవ్వల భరత్‌కుమార్, అనంతయ్య, రాజేందర్, అజయ్ కుమార్, శివయాదవ్, నరేష్ గౌడ్, లింబాద్రి, నిఖిల్, రాజ్‌కుమార్, రఘుపతితోపాటు పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.


ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య

## పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిపులను వెంటనే విడుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా చూడాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం వెస్లీ లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఫీ రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను మరింత పారదర్శకంగా అమలు చేస్తామని ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నారని, కానీ రాష్ట్రంలో దీనికి విరుద్ధంగా వాటిని చెల్లించడంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతుందని సీఎంకి రాసిన లేఖలో పేర్కొన్నారు. తక్షణమే మీరు స్పందించి పెండింగ్ బకాయిలను చెల్లించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేద విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని 1800 ప్రయివేటు కాలేజీల్లో చదివే సుమారు 14 లక్షల మంది విద్యార్థులకు రూ.8042 కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్, రూ.1924 కోట్ల స్కాలం ‌షిప్‌లను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకుండా మొత్తం రు.9966 కోట్లు పెండింగ్‌లో పెట్టిందని.. వాటిని విడుదల చేయాలని కోరుతూ గత ఆగస్టులో యాజ మాన్యాలు సమ్మె చేయగా, ప్రభుత్వం చర్చలకు పిలిచి దసరా సందర్భంగా రు.300 కోట్లు, దీపావళికి రూ.600 కోట్లు, నవంబర్ మొదటివారంలో రు.300 కోట్లు మొత్తం రు.1200 కోట్లు విడుదల చేస్తామని స్పష్టమైన హామి ఇచ్చిందని గుర్తు చేశారు.

కానీ ఇప్పటి వరకు కేవలం రూ.300 కోట్లు మాత్రమే విడుదల చేసి మిగతా డబ్బులు చెల్లించలేదన్నారు. ఫలితంగా గత 5రోజులుగా తిరిగి సమ్మెలోకి వెళ్లిన కొంతమంది యాజమాన్యాలపై విజిలెన్స్ దాడులు జరుగుతున్నాయని, నిధులు విడుదల చేసి సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘాలు, విద్యార్థులు గత 20 రోజులుగా ఆందోళనలు చేస్తున్నాయని గుర్తు చేశారు. తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మిగతా రు.900 కోట్లు విడుదల చేయాని విజ్ఞప్తి చేశారు. కొన్ని ప్రైవేటు కళాశాలలు విద్యార్థుల చదువులు పూర్తయినప్పటికీ రీయింబర్స్‌మెంట్ రాలేదని సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థుల పైచదువులకు ఆటంకం కలిగిస్తుందన్నారు.

తక్షణమే విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని, పెండింగ్ నిధులను విడుదల చేసి సమస్య పరిష్కరించాలని సిఎంకు రాసిన లేఖలో జాన్ వెస్లీ కోరారు.


సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న చిన్నారెడ్డి.

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 285

**హైదరాబాద్ (బేగంపేట), నవంబరు 7, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 285 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 154, రెవెన్యూ శాఖకు సంబంధించి 25, హోం శాఖకు సంబంధించి 17, ఇందిరమ్మ ఇళ్ల కోసం 59,ప్రవాసీ ప్రజావాణికి 1 దరఖాస్తు అందినట్లు అధికారులు తెలియజేసారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

## 14వ తేదీ తర్వాతే ప్రైవేటు కాలేజీల సిబ్బంది సాంత్వన సభ

### 'కోడ్' నేపథ్యంలో అనుమతించని హైకోర్టు

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం ప్రైవేటు కాలేజీలు నిర్వహిస్తున్న నిరవధిక బంద్ కొనసాగుతోంది. తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య (ఫాతి) శనివారం నిర్వహించనున్న కాలేజీ బోధన, బోధనేతర సిబ్బంది సాంత్వన సభను వాయిదా వేసుకుంటున్నట్టు ప్రకటించారు. రాష్ట్రంలో ఈ నెల 14 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున.. భారీ జన సమీకరణకు అనుమతి లేదని.. 14 తరు వాతనే సభలను నిర్వహించుకోవాలని హైకోర్టు సూచించిన నేపథ్యంలో శనివారం నిర్వహించాల్సిన సభను వాయిదా వేసుకుంటున్నట్టు ఫాతి ప్రకటించింది. హైకోర్టు సూచనల మేరకు 'ఫాతి' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించాల నుకున్న టీచర్ల సాంత్వన సభను ఈ నెల 14వ తేదీ వరకు నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. టీచర్ల సభ, విద్యార్థుల మహార్యాలీ ఈ నెల 14 తరు వాతే ఉంటాయని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 'ఫాతి' ఆధ్వర్యంలో జరు గుతున్న బంద్ ఐదవరోజు సంపూర్ణంగా జరిగిందని 'ఫాతి' నేతలు తెలిపారు. శనివారం నిర్వహించనున్న సభకు ప్రభుత్వం, పోలీసులు అనుమతి నిరా కరించడంతో.. 'ఫాతి' హైకోర్టును ఆశ్రయించింది.

శుక్రవారం మధ్యాహ్నం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రావణ్ కుమార్ ముందు వాదనలు జరిగాయి.. ఈ సందర్భంగా హోం శాఖకు సంబం ధించిన ప్రభుత్వ న్యాయవాది మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రస్తుతం హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి సభలు సమావేశాలు నిర్వహించ రాదన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు సంబంధించి ఈ నెల 14వ తేదీ కౌంటింగ్ ఉన్నందున ఆ రోజు వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. ఆ తరువాత జరిపే సమా వేశాలకు తమకు అభ్యంతరం లేదని కోర్టుకు తెలిపారు.

జస్టిస్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ .. 'టీచర్లు గౌరవ ప్రదమైన వారు కనుక వారు జరుపుకునే సమావేశాలకు ప్రభుత్వం ఎందుకు అభ్యంతరం చెబుతోంద'ని ప్రశ్నిం చారు. అందుకు ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ .. ఫాతి వారు ప్రకటించినట్టుగా ఒక్కసారిగా 30 వేల మంది ఎల్‌బి స్టేడియంలోకి వస్తే అది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందికి వస్తుందని వివరించారు.. ఒకవేళ బండ్లగూడ లోని అరోరా ఇంజినీరింగ్ క్యాంపస్‌లో టీచర్ల సభ నిర్వహిస్తే ప్రభుత్వానికి అభ్యంతరం లేదని.. అయితే అక్కడి ప్రాంగణంలో శాంతి భద్రతల పర్యవేక్షణకు హోం శాఖ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. 14వ తేదీ తరువాత ఎల్‌బి స్టేడియంలో నిర్వహించేందుకు ఫాతి వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ న్యాయవాది సూచించారు. వాదనల అనంతరం.. జస్టిస్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ తరు వాతే ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య వారు తమ సమా వేశాలు నిర్వహించుకోవచ్చని స్పష్టం చేశారు. దీంతో తాము శనివారం నిర్వహించాలనుకున్న సాంత్వన సభను వాయిదా వేసుకుంటున్నట్టు 'ఫాతి'ప్రకటించింది.

# సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారు

### ఢిల్లీలో సిఇసికి ఫిర్యాదు చేసిన బిఆర్‌ఎస్ ఎంపిలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 7:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్ సహచరులు కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని బీఆర్‌ఎస్ ఎంపీ కె.ఆర్.సురేష్ రెడ్డి విమర్శించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ.. అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. అధికార పార్టీకి అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని.. ఈ నేపథ్యంలో కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ఈ ఉపఎన్నికను నిర్వహించాలని ఈసీని కోరినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారులతో బీఆర్‌ఎస్ ఎంపీలు కె.ఆర్.సురేష్ రెడ్డి, దామోదర్ రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు వ్యవహరిస్తున్న తీరును వారికి వివరించి.. ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకర్లతో ఎంపీ కె.ఆర్.సురేష్ రెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారని.. దాంతో అక్కడ మహిళా అధికారులను నియమించాలని సీఈసీని కోరినట్లు తెలిపారు. అలా కాకుంటే దొంగ ఓట్లు వేసే అవకాశం ఉందని ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు.



వ్యవసాయ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న వియత్నాం సంస్థ ప్రతినిధులు

# జీవవ్యర్థాల నుంచి ఆరు గంటల్లో జీవఎరువులు

### వియత్నాం సంస్థతో వ్యవసాయ వర్సిటీ కీలక అవగాహన ఒప్పందం

### ఉపకులపతి అల్దాస్ జానయ్య

**హైదరాబాద్ (అత్తాపూర్) నవంబరు 7, ప్రభాతవార్త :** భారతదేశంలోని వియత్నాం రాయబార కార్యాలయం డిప్యూటీ రాయబారి ట్రాన్‌థన్ టంగ్, వియత్నాం దేశానికి చెందిన బయోవే వియత్నాం సిఇఒ లీథీ క్యామ్‌టీన్‌లు తమ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవ సాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. పరిపాలన భవనంలో ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, ఇతర విశ్వ విద్యా లయ అధికారులతో భేటీ అయ్యారు. వ్యవసాయ, ఉద్యాన పంటల వ్యర్థాలు, మాంసం వ్యర్థాలు, గుర్రపు డెక్క తదితర అన్ని జీవ వ్యర్థాల నుంచి జీవ ఎరువుల్ని ఆరు గంటల్లో తయారుచేసే పరిజ్ఞానాన్ని మరియు యంత్ర పరి కరాన్ని బయోవే వియత్నాం సంస్థ నుంచి పిజెటిఎయూకి ఉచితంగా అందించే అవగాహన ఒప్పందంపై రెండు సంస్థలూ ఒప్పందం కుదుర్చు కున్నాయి. తెలంగాణకు చెందిన పిజెటిఎయుతో కుదుర్చుకున్న ఈ ఒప్పందం దేశంలోనే తొలిసారి అని భారత దేశంలోని వియత్నాం డిప్యూటీ అంబాసిడర్ ట్రాన్‌థన్ టంగ్, బయోవే వియత్నాం సిఇఒ లీథీ క్యామ్‌టీన్‌లు తెలిపారు. ఎన్నో ఏళ్ల పరిశోధనల తర్వాత ఈ పరిజ్ఞానాన్ని ఈ సంస్థ కనుగొన్నదని ఉపకులపతి జానయ్య అన్నారు. జీవవ్యర్థాల నుంచి జీవ ఎరువులు ఇప్పటికే తయారు చేస్తున్నారనీ కానీ ఆ ఎరువుల తయారీకి అనేక రోజుల సమయం పడుతుందనీ ఈ సంస్థ అందించే పరిజ్ఞానంతో 6 గంటల్లోనే జీవ ఎరువులు తయారవు తాయని జానయ్య వివరించారు. విశ్వవిద్యాలయంలో బయోవే వియత్నాం రెండేళ్లపాటు ఉచితంగా యంత్రాలు ఏర్పాటు చేస్తుందని జానయ్య పేర్కొన్నారు.

# సైబర్ నేరగాళ్లపై పోలీసుల పంజా

### దేశవ్యాప్తంగా దాడులు.. 55 మంది నేరగాళ్ల అరెస్టు

### రూ.62.34 లక్షల నగదు జప్తు, కొలిక్కి వచ్చిన కీలక కేసులు

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** సిటీ సైబర్ క్రైం పోలీసులు దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో చేబట్టిన భారీ ఆపరేషన్‌లో 55 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టయ్యారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి 62 లక్షల 34 వేల 446 రూపాయల నగదును జప్తు చేశారు. ఈ సందర్భంగా అనేక కేసులు కొలిక్కి వచ్చాయి. దీనికి సంబంధించిన వివరాలను నగర అదనపు పోలీసు కమిష నర్ (క్రైం అండ్ సిట్) ఎం.శ్రీనివాస్ శుక్రవారం మీడి యాకు వెల్లడించారు. హైదరాబాద్‌లో వరుసగా వెలుగు చూస్తున్న సైబర్ నేరాలపై దాడులకు సిటీ సైబర్ క్రైం పోలీసులు వారం రోజుల పాటు దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో భారీ ఆపరేషన్ నిర్వహించారు. గత అక్టోబర్ నెలలో నమోదైన సైబర్ నేరాలతో పాటు అంతకు ముందు వెలుగు చూసిన నేరాలలో నిందితులుగా వున్న వారిని పట్టుకు నేందుకు ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా 55 మంది బడా సైబర్ నేరగాళ్లు పట్టుబడ్డారు. వీరిలో తెలంగాణ నుంచి అత్యధికంగా 45 మంది వుండగా ఎపికి చెందిన వారు 24 మంది, గుజరాత్‌కు చెందిన వారు ఏడుగురు, మహారాష్ట్రకు చెందిన వారు ఆరుగురు. కర్నాటకు చెందిన వారు నలుగురు యుపికి చెందిన వారు ఐదుగు రు, ఢిల్లీకి చెందిన వారు ఇద్దరు, హరియాణాకు చెందిన వారు ఇద్దరు, బిహార్‌కు చెందిన వారు ఇద్దరు వున్నారు. ఇక పట్టుబడ్డ నేర గాళ్లు 18 ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ ఫ్రాడ్లతో పాటు రెండు బిజినెస్ ఫ్రాడ్ కేసులతో పాటు ఒక క్రెడిట్ కార్డు ఫ్రాడ్, ఐదు డిజిటల్ ఫ్రాడ్ కేసులు, నాలుగు సోషల్ మీడియా ఫ్రాడ్లు, ఒక ఇన్సూరెన్స్ ఫ్రాడ్, మరొక జాబ్ ఫ్రాడ్ కేసులో నిందితులుగా తేలింది. ఈ నేరగాళ్లు 61 బ్యాంకు ఖాతాల ద్వారా 107 కోట్ల రూపాయల గోల్‌మాల్ లావాదేవీలను నిర్వహించినట్లు తేలింది. వీరు దేశ వ్యాప్తంగా మొత్తం 136 కేసుల్లో నిందితులు కాగా ఇందులో తెలంగాణలో 45 వున్నాయి. నిందితుల బ్యాంకు ఖాతాలలో వున్న 62 లక్షల 34 వేల 446 రూపాయల నగదును జప్తు చేశారు. వీరి వద్ద నుంచి 31 సెల్‌ఫోన్లతో పాటు 14 చెక్ బుక్కులు, ఒక పాస్ బుక్, తొమ్మిది క్రెడిట్ కార్డులు, రెండు లాప్ టాప్‌లు, మూడు షెల్ కంపెనీ స్టాంపులు, రెండు సిం కార్డులు కూడా జప్తు చేశారు. కాగా ఈ నిందితులు 17 ఇన్వెస్ట్‌మెంట్ కేసుల్లో 42 కోట్ల 81 లక్షల 9877 రూపాయలను కాజేయగా వీరి వద్ద నుంచి 33 కోట్ల 13 లక్షల 40 రూపాయలను జప్తు చే శారు. వాట్సాప్ డిపి ఫ్రాడ్ కేసు ఒక దాంట్లో 19 లక్షలు కాజేయగా లక్ష రూపాయలు జప్తు చేశారు. మూడు క్రెడిట్ కార్డు ఫ్రాడ్ కేసుల్లో ఐదు ల క్షల 42 వేల 606 రూపాయలను కాజేయగా నాలుగు లక్షల 95 వేల 109 రూపాయలను జప్తు చేశారు. మూడు జాబ్ ఫ్రాడ్ కేసుల్లో ఏడు లక్ష ల 84 వేల రూపాయలను కాజేయగా ఆరు లక్షల 87 వేల రూపాయలను జప్తు చేశారు. ఒక ఫ్రాడ్ ట్రావెల్ కేసులో మూడు లక్షల రూపాయలను కాజేయగా లక్షా 50 వేల రూపాయలను జప్తు చేశారు. ఒక కస్టమర్ ఫ్రాడ్ కేసులో లక్షా 72 వేల 890 రూపాయలను కాజేయగా 49 వేల 875 రూపాయలను జప్తు చేశారు.

# పొగ 'తాగే'స్తున్నారు!

### మైనర్లు కూడా సిగరెట్లు కాలుస్తున్నట్లు సర్వేలో వెల్లడి

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** ప్రపంచ వ్యాప్తంగా ధూమపానం సేవించే వారి సంఖ్య యేటా పెరుగుతోందని వరల్డ్ ఆఫ్ స్టాటిటిక్స్ అనే సంస్థ విడుదల చేసిన ఒక నివేదికలో వెల్లడయ్యింది. ప్రపంచ దేశాల్లో భారత్ సహా అనేక దేశాల్లో ధూమపాన సేవనం పెరగడంతో పాటు మైనర్లు కూడా ఈ విషయంలో పెద్దలతో పోటీ పడుతున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. సిగరెట్లు తాగడంలో ఇండోనేషియా మొదటి స్థానంలో వుండగా భార త్ 13వ స్థానంలో వుంది. ప్రపంచ వ్యాప్తంగా సిగరెట్లు ఎక్కువగా కాల్చే దేశాల్లో ఇండోనేషియా అగ్రస్థానంలో వుంది. ఈ దేశంలో 70.50 మంది ప్ర జలు సిగరెట్లు కాలుస్తారని ఆ సంస్థ తెలిపింది. దీని తరువాత మయన్మార్‌లో 70.20 ప్రజలు సిగరెట్లు కాలుస్తుండగా ఆ దేశం ద్వితీయ స్థానంలో వుంది. మూడవ స్థానం దక్షిణాసియా దేశం బంగ్లాదేశ్ దక్కించుకుంది. ఈ దేశంలో 60.60 మంది ప్రజలు సిగరెట్లు కాలుస్తున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. నాలుగవ స్థానంలో చిలీ దేశం నిలిచింది. ఈ దేశంలో 49.20 శాతం మంది ప్రజలు సిగరెట్లు కాలుస్తున్నారని వరల్డ్ స్టాటిటిక్ వెల్లడించింది. దీని తరువాత కమ్యునిస్టు దేశం చైనాలో 47.70 శాతం మంది ప్రజలు సిగరెట్లు కాలుస్తున్నారని ఆ సంస్థ తెలిపింది. చైనా తరువాత ప లు దేశాల్లో సిగరెట్లు కాల్చేవారు ఎక్కువగానే వున్నారు. భారత్‌లో 42 శాతం మంది పురుషులు సిగరెట్లు కాలుస్తున్నట్లు తేలింది.

ఈ క్రమంలో ధూ మపానం విషయంలో భారత్‌కు 13వ స్థానం దక్కింది. భారత్‌లో పురుషుల్లో 42 శాతం మంది సిగరెట్లు తాగుతున్నారని తేలింది. మహిళల్లో అం త గా లేనప్పటికీ వీరి సంఖ్య కూడా ఎక్కువవుతోందని ఆ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. భారత్ తరువాత ఫ్రాన్స్‌లో 36 శాతం, దక్షిణ కొరియాలో 38.20 శాతం దుబాయ్‌లో 35.60 శాతం మంది ప్రజలు సిగరెట్లు తాగుతున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. యూరప్‌తో పాటు పలు అభి వృద్ధి చెందిన దేశాలు పొగాకు నివారణ చర్యలు తీసుకుంటున్నా అక్కడి ప్రజల్లో ఈ వ్యసనం ఇంకా పోలేదని ఆ సంస్థ పేర్కొంది. భారత్‌లో కేవల ం సిగరెట్లే కాకుండా బీడీలు,చుట్టల సేవనం కూడా ఎక్కువగా వుందని, ఇది ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని వరల్డ్ స్టాటిటిక్స్ వెల్లడిం చింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా వున్న భారత్‌లో ఈ వ్యసనం ఇటీవల కాలంలో మరింత పెరిగిందని ఆ సంస్థ పేర్కొంది. పశ్చిమ దేశాలు సిగరెట్లను క్రమేపి తొలగిస్తుండగా ఆసియా దేశాలు ఈ వ్యసనంతో ఇంకా పోరాడుతున్నాయని వరల్డ్ స్టాటిటిక్స్ తెలిపింది. ఈ కారణంగానే పశ్చిమ దేశాలతో పోలిస్తే భారత్ సహా అనేక ఆసియా దేశాలలో క్యాన్సర్ రోగుల సంఖ్య ఎక్కువగా వుంటొందని, దీంతో పాటు గుండె జబ్బులు, శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయని ఆ సంస్థ తెలిపింది.

# ఫీజ్ రీయంబర్స్‌మెంట్ ఎత్తివేసేందుకు కాంగ్రెస్ కుట్ర

### కేంద్రమంత్రి బండి సంజయ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 7:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే.. ప్రైవేట్ కాలేజీ యజమాన్యాలని సీఎం రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ చేస్తారా..? అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్ అయ్యారు. అసెంబ్లీ సాక్షిగా ప్రతినెలా బకాయిలు చెల్లిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చింది నిజం కాదా..? అని ప్రశ్నించారు. బకాయిలు చెల్లిస్తామని టోకెన్లు ఇచ్చి మోసం చేసింది నిజం కాదా? అని నిలదీశారు. బకాయిలు చెల్లించకుండా కాలేజీలను మోసం చేస్తోంది నిజం కాదా? అని ఫైర్ అయ్యారు. శుక్రవారం బీజేపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతే... మరి టోకెన్లు ఎందుకు ఇచ్చినట్లు? అని ప్రశ్నించారు. రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా ఎందుకు హామీ ఇచ్చారని నిలదీశారు. చట్టసభలో ఇచ్చిన హామీకే విలువ లేకుంటే ఇక అసెంబ్లీకి విలువ ఏముంది..? అని అడిగారు. సార్వత్రిక ఎన్నికలకు ముందే తెలంగాణ రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని రేవంత్‌రెడ్డే చెప్పారు కదా? అని గుర్తుచేశారు.

ఇప్పుడు అందుకు భిన్నంగా మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోతే కాలేజీలు ఎలా నడవాలి? అని నిలదీశారు. అధ్యాపకులకు జీతాలివ్వకపోతే విద్యార్థులకు చదవు చెప్పే దెవరు..? అని అడిగారు. కాలేజీ యాజమా న్యాలపై సీఎంకు ఉన్న కోపంతో.. విద్యార్థుల జీవితాలను బలి చేయాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ఆరోపిం చారు. చట్టం పేరుతో బెదిరింపులకు పాల్పడితే పాలన నడవదనే విషయాన్ని సీఎం గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించి చట్టం గురించి మాట్లాడితే మంచిదని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగిస్తారా? ఎత్తి వేస్తారా? ప్రజలకు స్పష్టం చేయాలని పేర్కొన్నారు.

# రేవంత్ రెడ్డి ఓటమి అంగీకరించాడు!

### జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తన పాలనకు రెఫరండం కాదన్నారు

### ఎన్టీఆర్ కాంస్యవిగ్రహాన్ని ప్రతిష్ఠిస్తాం

### వెంగల్‌రావునగర్ రోడ్‌షోలో కెటిఆర్




**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 7, ప్రభాతవార్త:** తన పరిపాలన పైన నమ్మకం లేకనే ప్రజల్లో నెలకొన్న తీవ్రమైన వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకొని జూబ్లీహిల్స్ ఎన్నిక రెఫరెండం కాదన్నారని టిఆర్‌ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయమని స్పష్టమైందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా వెంగళరావు నగర్ రోడ్డు షోలో కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యల పైన ఆయన గట్టిగా కౌంటర్ ఇచ్చారు. హైడ్రా గురించి గొప్పగా చెబుతున్న రేవంత్ రెడ్డికి దమ్ముంటే మంత్రుల అక్రమ నిర్మాణాలను తొలగించాలన్నారు. రెండు సంవత్సరాల అరాచకాన్ని అవినీతిని తరిమికొట్టాలంటే జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ ను ఓడించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. అన్ని వర్గాలను 24 నెలలుగా మోసం చేస్తున్న కాంగ్రెస్ కు ఎందుకు ఓటు వేయాలని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ను ఓడగొడితేనే ఆరు గ్యారెంటీలు వస్తాయ న్నారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే తన 24 నెలల పరిపాలనపై జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజల తీర్పుకోరాలని అన్నారు. తాను చేసింది ఏమీ లేకపోవడంతోనే రేవంత్ రెడ్డి అటెన్షన్ డైవర్షన్ ప్రయత్నాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ముఖ్య మంత్రి అయిన తర్వాత 24 నెలల కాలంలో చేసింది ఏమీ చెప్పు కోవడానికి లేకపోవ డంతోనే పాత కాలం కథలు చెబుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రెండు సంవత్సరాల పరిపాలనలో మోసం చేసిన విద్యార్థులు, యువకులు, రైతన్నలు, పారిశ్రామికవేత్తలకు చేసిన మోసాన్ని చూసినందుకు రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ కు ఓటు వేయాలా అని కేటీఆర్ ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ లో గెలిస్తే అభివృద్ధి చేస్తామంటూ కాంగ్రెస్ చెబుతున్న అబద్ధాల పైన ఆయన మండి పడ్డారు గతంలో ఇవే మాటలు చెప్పి కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఒక్క రూపాయి అభివృద్ధి పని కూడా చేయలేదని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి నిజాయితీ లేని మాటలు మాట్లాడుతున్నారని నేతి బీరకాయలో నెయ్యి అంతా నిజాయితీ రేవంత్ రెడ్డి మాటల్లో ఉంటాయని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే..గ్యారంటీలు అమలు చేయకుండా తమకే ఓటు వేశారని కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి భావించి హామీలను అమలు చేయడాన్ని ప్రారంభించాలని కేటీఆర్ హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ప్రజలు ఇచ్చే తీర్పుతో తెలంగాణ ప్రజలందరికీ హామీలు అమలు కావాలని ఆ దిశగా కాంగ్రెస్ ను ఓడించి ప్రభుత్వం పైన ఒత్తిడి తేవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. రెండేళ్లపాటు రాష్ట్రాన్ని రాష్ట్ర ప్రజలను పీల్చుకుతింటున్న అరాచకానికి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ కనిపించిన కాంగ్రెస్ ను తరిమి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీకి స్వర్గీయ ఎన్టీ రామారావు గారి పేరును ఎత్తే నైతిక అర్హత లేదని కేటీఆర్ అన్నారు.

# దేశంలో అక్రమంగా ఉంటున్న నైజీరియన్ గెంటివేత

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** భారత్‌లో పదేళ్లకు పైగా అక్రమంగా వుంటున్న ఓ నైజీరియన్‌ను నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, విదే శాంగ విభాగం జాతీయ భద్రత దృష్ట్యా అతని స్వదేశానికి పంపించి వేసింది. దీనికి సంబంధించిన వివరాలను నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిసిపి సుధీంద్ర శుక్రవారం మీడియాకు వెల్లడించారు. నైజీరియాకు చెందిన జాన్ కెనెడీ చుక్వుమెకా ఒకోరో అలియాస్ హోప్ కప్ ఊరఫ్ జెక్సా (43 ) 2012లో భారత్‌కు బిజినెస్ వీసాపై ముంబాయికి వచ్చి దుస్తుల వ్యాపారం చేయసాగాడు. అయితే రెండేళ్లకే ఇతని వీసా గడువు ముగిసింది. అ యినప్పటికీ ఇతను భారత్‌లో అక్రమంగా వుంటూ బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు తరచూ విమానాలు, రైళ్లలో తిరుగుతూ డ్రగ్స్ వ్యాపారం చే స్తున్నాడు. ఈ క్రమంలో ఇతనిపై పలుచోట్ల కేసులు నమోదయ్యాయి. తాజాగా కొన్ని రోజులుగా ఇతను షేక్‌పేట్‌లో వుండగా నార్కోటిక్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో అధికారులకు సమాచారం అందింది. దీనిపై ఈ విభాగం పోలీసులు దాడిచేసి అతన్ని పట్టుకుని విచారించగా వీసా గడువు ముగిసిం దని తెలియడంతో అదుపులోకి తీసుకున్నారు. ఇతని వద్ద ఎలాంటి డ్రగ్స్ లభించ లేదు. నిందితుడిని వెంటనే అతని స్వదేశం నైజీరియాకు పంపాలని నిర్ణయించి దీనిపై ప్రాంతీయ విదేశాంగ శాఖకు, పాస్‌పోర్టు కార్యాలయానికి లేఖ రాసి అక్కడి నుంచి అనుమతులు తీసుకు న్నారు. దీని తరువాత శుక్రవారం నిందితు డిని నైజీరియాకు బలవంతంగా విమానంలో పంపారు. భారత్‌లో అక్రమంగా వుండే వారి విషయమై ఎవరి వద్ద ఎలాంటి సమాచారం వున్నా తమకు తెలపాలనిడిసిపి సుధీంద్ర కోరారు.

# వ్యవస్థలో లోపాలు.. 300కిపైగా విమానాలు జాప్యం

**న్యూఢిల్లీ, నవంబరు 7:** దేశ రాజధాని ఢిల్లీ లోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో సాంకేతిక సమస్య తలెత్తిన విషయం తెలిసిందే. ఎయిర్‌పోర్ట్‌లోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్‌లో ఈ సమస్య వచ్చింది. దీంతో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దాదాపు 300కిపైగా విమానాలు ప్రభావితమయ్యాయి. దీంతో వందలాది మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో అనేక విమానాలు నిలిచిపోయాయి. దీంతో రన్‌వేపై పార్కింగ్ స్థలం కూడా లేదు.

దీంతో సాయంత్రం విమానాలను విమానయాన సంస్థలు రద్దు చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. తాజా సమస్యకు సైబర్ దాడే కారణంగా తెలుస్తోంది. గడచిన వారం రోజులుగా ఢిల్లీలో విమాన జీపీఎస్ సిగ్నల్స్‌లో నకిలీ అలర్ట్స్ తరచూ కనిపిస్తున్నాయి. దీన్ని జీపీఎస్ స్పూఫింగ్ అని కూడా అంటారు. దీని కింద విమాన పైలట్లు తప్పుడు నేవిగేషన్ (దారిచూపే వ్యవస్థ) అందుకోవడం, ల్యాండింగ్ సమయంలో గందర గోళపరిచే హెచ్చరికలు రావడం జరుగుతోంది. ఇటువంటి సంఘటనలు ఢిల్లీకి 100 కిలోమీటర్ల వ్యాసార్థం లోపలే జరుగుతున్నట్లు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వర్గాలు వెల్లడించాయి.



స్పూఫింగ్ అనేది ఓ రకంగా సైబర్ దాడి లాంటిదే. నేవిగేషన్ సిస్టమ్స్‌ని తప్పుదారి పట్టించేందుకు బూటకపు జీపీఎస్ సిగ్నల్స్‌ని ఇది పంపుతుంది.

సాధారణంగా వీటిని శత్రు సేనలకు చెందిన డ్రోన్లు, విమానాలను ధ్వంసం చేయడానికి యుద్ధ రంగంలో ఉపయోగిస్తుంటారు




# మధుమేహం, ఊబకాయం ఉంటే అమెరికా వీసా రాదు!

### ట్రంప్ పేల్చిన కొత్త బాంబు

**వాషింగ్టన్, నవంబరు 7:** అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వలసదారులపై కఠిన నిబంధనలు అమలు చేస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కొత్త రూల్ తీసుకొచ్చారు. డయాబెటిస్, ఒబెసిటీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి వీసాలను తిరస్కరించాలనే కొత్త నిబంధనలను రూపొందించారు. ఈ మేరకు అమెరికా ఎంబసీలు, కాన్సులర్ కార్యాల యాలకు అగ్రరాజ్య విదేశాంగ శాఖ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. సాధారణంగా అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారి ఆరోగ్య స్థితిని ఇమిగ్రేషన్ అధికారులు పరిశీలిస్తారు. టిబి వంటి అంటువ్యాధులు ఉన్నాయో లేదో స్క్రీనింగ్ చేస్తారు. ఈ నిబంధనలను తాజాగా సవరించారు. మరిన్ని వ్యాధులను ఈ జాబితాలో చేరుస్తూ మార్గదర్శకాలు రూపొందించారు. అంటే.. ఇకపై వీసా కోసం దరఖాస్తు చేసుకున్న వలసదారుల మెడికల్ హిస్టరీపై అధికారులు మరింత దృష్టి సారించనున్నారు. వారు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారా? వారిని అమెరికాలోకి అనుమతిస్తే ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడనుందా? అనే అంశాలను పరిగణనలోకి తీసుకుని వీసా జారీపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ వనరులపై అదనపు భారం పడే అవకాశమున్న దరఖాస్తుదారులను అమెరికాలోకి రానివ్వకుండా వీసాను తిరస్కరించేలా నిబంధనలను కఠినతరం చేసినట్లు సమాచారం.

'దరఖాస్తుదారుల ఆరోగ్యాన్ని కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. హృద్రోగ సమస్యలు, శ్వాస సంబంధిత వ్యాధులు, కేన్సర్, డయాబెటిస్, జీవక్రియ, నాడీ సంబంధిత వ్యాధులు, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారిని సంరక్షించాలంటే లక్షల డాలర్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇక, ఒబెసిటీ కారణంగా ఆస్తమా, స్లీప్ ఆప్నియా, హైబిపి వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇలాంటి వ్యాధిగ్రస్తులకు సుదీర్ఘ వైద్య సంరక్షణ అవసరం. ఆర్థిక భారం కూడా ఎక్కువే. అందుకే వలసదారుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి వారు ప్రభుత్వ వనరులపై ఆధారపడతారో లేదో గుర్తించాలి. ఒకవేళ అలాంటి వారైతే అమెరికాలో ప్రవేశాన్ని తిరస్కరించాలి' అని ఆ మార్గదర్శకాల్లో వెల్లడించారు. అంతేకాదు.. ఒకవేళ వలసదారులు అమెరికా ప్రభుత్వ సాయం లేకుండా వైద్య చికిత్సలను సొంతంగా భరించగలరా లేదా? అన్నది కూడా నిర్ధారించుకోవాలని వీసా అధికారులను ఆదేశించారు. ఇక, కుటుంబసభ్యుల ఆరోగ్యాన్ని కూడా పరిశీలించాలని స్పష్టం చేశారు.

# అమెరికా అజెండాతో పనిచేస్తున్న పత్రిక ఫ్రాంటియర్ పోస్ట్

### పాక్ పత్రికపై రష్యా ఆగ్రహం

**ఇస్లామాబాద్, నవంబరు 7:** పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ది ఫ్రాంటియర్ పోస్ట్'పై రష్యా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ పత్రిక రష్యాకు వ్యతిరేకంగా ఉద్దేశపూర్వకంగా కథనాలు ప్రచురిస్తోందని, దాని వెనుక అమెరికా అజెండా ఉందని సంచలన ఆరోపణలు చేసింది. ఈ మేరకు పాకిస్థాన్‌లోని రష్యా రాయబార కార్యాలయం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ఒక పోస్టు చేసింది. "పాకిస్థాన్ ఆంగ్ల పత్రిక అయిన ది ఫ్రాంటియర్ పోస్ట్‌లో నిరంతరం వస్తున్న రష్యా వ్యతిరేక కథనాలను మేం గమనించాం. నిజానికి దీని ప్రధాన కార్యాలయం వాషింగ్టన్‌లో ఉన్నందున, దీనిని పాకిస్థానీ పత్రిక అని పిలవలేమని రష్యా ఎంబసీ తన పోస్టులో పేర్కొంది. పత్రిక సంపాదకీయ బృందం అమెరికా ప్రభావంతో పనిచేస్తోందని, రష్యా విదేశాంగ విధానాన్ని, అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను లక్ష్యంగా చేసుకుని నిరంతరం విమర్శలు గుప్పిస్తోందని ఆరోపించింది. రష్యా ఆర్థిక వ్యవస్థ పతనం అంచున ఉన్నట్లు చిత్రీకరించేందుకు ఈ పత్రిక ప్రయత్నిస్తోందని రష్యా విమర్శించింది. బయటి నుంచి ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా తమ ఆర్థిక వ్యవస్థ చరిత్రలో ఎన్నడూ లేనంత స్థిరంగా పురోగమిస్తోందని స్పష్టం చేసింది. 2024లో రష్యా జీడీపీ 4.1 శాతం వృద్ధి సాధించిందని గుర్తుచేసింది. ఆఫ్ఘనిస్థాన్ అంశంపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన మాస్కో ఫార్మాట్ ఆఫ్ కన్సల్టేషన్స్ వంటి కీలక పరిణామాలను ఈ పత్రిక పూర్తిగా విస్మరించిందని రష్యా తెలిపింది. తమ దేశానికి సానుకూలంగా ఒక్క వార్త కూడా ఇప్పటివరకు ప్రచురించలేదని, ఇతర దేశాల అజెండానే మోస్తోందని రష్యా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.

# హసీనా, ఆర్మీ లక్ష్యంగా యూనస్ సర్కారు కొత్తచట్టం

### కుట్రదారులకు మరణశిక్ష విధించే సవరణ ఆర్డినెన్స్ సిద్ధం

**ఢాకా, నవంబరు 7:** నిర్బంధపు అదృశ్యాలకు కుట్రలుచేసిన బంగ్లాదేశ్ నాయకులకు మరణశిక్ష విధించేవిధంగా బంగ్లాదేశ్‌లోనియూనస్ సర్కారు ఆర్డినెన్స్‌ను తీసుకువస్తోంది. ఇదే కనుక అమలుకువస్తే మాజీ ప్రధాని షేక్ హసీనా, మరో 15 మంది మిలిటరీ అధికారులపై నమోదయిన కేసుల విచారణలో వారికి కఠిన శిక్షలు తప్పవని తెలుస్తోంది. యూనస్ సర్కారు హసీనాను లక్ష్యంచేసుకునే ఈ ఆర్డినెన్స్‌ను తెస్తున్నట్లు హసీనా వర్గీయులు పేర్కొంటున్నారు.



ఇప్పటికే ఈ ఆర్డినెన్స్‌కు రాష్ట్రపతి మహ్మద్ షహబుద్దీన్ ఆమోదం తెలపడంతో ఆర్డినెన్స్ వెలువరించేందుకు యూనస్ తాత్కాలికసర్కారు యోచనచేస్తోంది. ఈచట్టంతో మరోసారి దేశంలో ఇలా నిర్బంధపు కిడ్నాప్‌లు, అదృశ్యం కావడం వంటి సంఘటనలు జరగవని ప్రెస్ కార్యదర్శి షఫీఖుల్ ఆలమ్ అన్నారు. రహస్యంగా అదుపులోనికి తీసుకుని తరలించే నిర్బంధ కేంద్రాలు అంటే బంగ్లాలో ఆయానఘర్‌లుగా చెపుతారు. ఇకపై ఏర్పాటు ఉండదని, ఈ చట్టం అమలుకు వచ్చినే కోర్టులు విచారణలుచేసి అభియోగాలు నమోదయిన 120 రోజులలోపే తీర్పులు వెల్లడిస్తాయని ఆయన అన్నారు. ఆర్డినెన్స్ అమలులోకి వస్తే 15 మంది ఆర్మీ అధికారులు, మాజీ ప్రధాని షేక్ హసీనాలనున కూడా ఈ బిల్లు పరిధిలోకి తీసుకురావాలని యూనస్ సర్కారు యోచిస్తోంది. బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ చీఫ్‌ప్రాసిక్యూటర్ గతనెల 16వ తేదీ మాట్లాడుతూ పదవీచ్యుతిపొందిన ప్రధాని షేక్ హసీనాకు మరణశిక్ష విధించాలని ప్రతిపాదించారు. బంగ్లాలో అల్లర్లకు ఆమే సూత్రాధారి అని రూకపల్పనచేసింది కూడా ఆమెనని గత ఏడాది ఉవ్వెత్తున ఎగిసిన నిరసనల్లో పెద్ద ఎత్తున అమాయకులు బలయ్యారని ఆయన అన్నారు. ఇప్పటికే హసీనా హాజరులేకుండానే ఆమె పరోక్షంలో బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేర ట్రిబ్యునల్ ఆమెపై విచారణచేస్తోంది. ఆమెతోపాటు ఆమెకేబినెట్‌లోని మంత్రులపైనా కేసులునమోదుచేసింది. అలాగే మరో 15 మంది మిలిటరీ అధికారులు కూడా కంటోన్మెంట్‌నుంచి ఈ విచారణకు హాజరు అవవుతారు. ఇప్పటికే వీరందరికి అరెస్టు వారంట్లు జారీ అయ్యాయి. గతనెల 22వ తేదీ మిలిటరీ అధికారుల కోర్టుకు హాజరు పలువిధాల చర్చలకు తావిచ్చింది. వీరందరినీ కోర్టు హాజరుపరిచిన యూనస్ సర్కారు వీరిని ఢాకా కంటోన్మెంట్‌ప్రాంతంలోనే ఒక తాత్కాలిక జైలుకు తరలించింది.

# మాగంటి గోపీనాథ్ మరణం వివాదంలోకి నన్ను లాగొద్దు

## బండి సంజయ్ ఫిర్యాదు చేస్తే పోలీసులు దర్యాప్తు చేస్తారు: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 7:** మాగంటి గోపీనాథ్ మరణాన్ని తాను రాజకీయం చేయదలచుకోలేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాగంటి గోపీనాథ్ మరణం వివాదాల్లోకి తనను లాగొద్దని కోరారు. గోపీనాథ్ మరణంపై ఆయన తల్లి కొన్ని ఆరోపణలు చేశారని.. గోపీనాథ్ మరణంపై అనుమానాలు ఉంటే బండి సంజయ్ ఫిర్యాదు చేయాలని అన్నారు. బండి సంజయ్ ఫిర్యాదు చేస్తే పోలీసులు దర్యాప్తు చేస్తారని పేర్కొన్నారు. మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. ఈ ఉపఎన్నికలో గెలవాలని అన్ని ప్రధాన పార్టీలో కసరత్తు చేస్తున్నాయి. సిఎం రేవంత్ సైతం ఈ ప్రచారంలో పాల్గొన్నారు. రోడ్ షోలు, కార్నర్ మీటింగ్స్ నిర్వహించారు. తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్షాలపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పాలనలోనే హైదరాబాద్ అభివృద్ధి చెందిందని.. బిఆర్ఎస్, బిజెపి ప్రభుత్వాలు హైద రాబాద్‌కు చేసింది శూన్యమని ఆయన అన్నారు.

# భారీగా పెరిన విద్యుదుత్పత్తి

## 500 గిగావాట్లకు చేరిన సామర్థ్యం
## పదేళ్లలో 251 గిగావాట్ల పెరుగుదల
## దేశ ఇంధన రంగంలో కీలక పరిణామం

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త :** దేశ వ్యాప్తంగా విద్యుత్ రంగంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. విద్యుత్ రంగం రెండు చారిత్రాత్మక మైలురాళ్లను సాధించింది. ముఖ్యంగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో భారీగా పెరుగుదల రికార్డయింది. ఇవి స్వచ్ఛమైన, సురక్షితమైన, స్వావలంబన ఇంధన భవిష్యత్తు వైపు దేశం యొక్క స్థిరమైన పురోగతిని చూపుతున్నాయి. దేశంలో స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 500 గిగావాట్లకు దాటడం విశేషం. ఇదే సమయంలో పునరుత్పాదక శక్తి వాటా 50 శాతానికి పైగా ఉంది. గత నెల తొలి వారం నాటికి దేశంలోని మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యం 500 గిగావాట్లను దాటి 500.89 గిగావాట్లకు చేరుకుంది. 2014లో ఇది 249 గిగావాట్లుగా ఉంది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సీనియర్ సెక్రటరీ ఒకరు వెల్లడించిన సమాచారం ప్రకారం శిలాజేతర ఇంధన వనరుల నుండి విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి పునరుత్పాదక, జల, అణుశక్తి యూనిట్లకు సంబంధించి మొత్తం 256.09 గిగావాట్ల వద్ద ఉంది. ఇది మొత్తంలో 51 శాతానికి పైగా నమోదైంది. ఇక శిలాజేతర ఇంధన ఆధారిత వనరులు 244.80 గిగావాట్ల వద్ద ఉండగా, మొత్తం ఇది 49 శాతంగా ఉంది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి అర్థభాగంలో, దేశం 28 గిగావాట్ల శిలాజేతర సామార్థ్యానికిగాను, 5.1 గిగావాట్ల ఇంధన సామర్థ్యాన్ని జోడించింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూలై 29న విద్యుత్ ఉత్పత్తిలో అత్యధిక పునరుత్పాదక ఇంధన వాటాను చేరుకుంది. ఈ సమయానికి పునరుత్పాదక శక్తి దేశంలోని మొత్తం విద్యుత్ డిమాండ్ అయిన 203 గిగావాట్లలో 51.5 శాతం మేర ఇది తీర్చింది. ఈ పురోగతితో దేశంలో నిర్ధారించిన లక్ష్యాల్లో ఒక దశను అధిగమించినట్లయింది. 2030 నాటికి శిలాజేతర ఇంధన వనరుల నుండి 50 శాతం వ్యవస్థాపిత విద్యుత్ సామార్థ్యాన్ని కలిగి ఉండాలనే లక్ష్యాన్ని ముందుగానే అధిగమించినట్లయింది. ఈ విజయం ఇంధన రంగంలో సంవత్సరాల తరబడి బలమైన విధాన మద్దతు, పెట్టుబడులు మరియు టీమ్ కృషిని ప్రతిబింబిస్తుందని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భారతదేశ విద్యుత్ రంగం రెండు చారిత్రాత్మక మైలురాళ్లను సాధించిందని, ఇవి స్వచ్ఛమైన, సురక్షితమైన మరియు స్వావలంబన ఇంధన భవిష్యత్తు వైపు దేశం యొక్క స్థిరమైన పురోగతిని చూపుతున్నాయని పేర్కొంది.



# అభివృద్ధి కోసం కలిసి రండి

## నాబార్డుకు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి కోసం కలసి రావాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు నాబార్డుకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేయాలన్నారు. హైదరా బాద్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి కోసం ప్రభుత్వంతో భాగస్వామ్యం, మైక్రో ఇరిగేషన్ పథకం కోసం నిధుల విడుదల, బహుళోపయోగ ప్రాథమిక సహకార సంఘాల ఏర్పాటు వంటి అంశాలపై సహకరించాలన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి నాబార్డ్ కేటాయించిన రూ.300 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టుల కోసం రూ.1,811 కోట్ల డ్రాయబుల్ గ్యాప్ ఉందని దీన్ని అధిగమిస్తామన్నారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అమలు కోసం రూ.144 కోట్ల నిధులను నాబార్డు కేటాయించినట్లు చెప్పారు. అంతేకాకుండా రాష్ట్రంలో 197 బహుళార్థ సాధక సహకార సంఘాల ఏర్పాటుకు నాబార్డ్ అనుమతి ఇచ్చిందన్నారు. ప్రభుత్వం చేపట్టిన చర్యల వలన రైతుల ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయని తెలిపారు. పెరిగిన ఉత్పత్తులను అనుగుణంగా నిల్వ సామార్థ్యాలతో గోదాములు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇందుకు తక్కువ వడ్డీతో రుణాలు అందించాలని సూచించారు. ఇందులో నాబార్డు సీజిఎం ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

# అమెరికా చేతిలో 'మినిట్‌మ్యాన్-3'

## 150 సార్లు ప్రపంచాన్ని నాశనం చేయగల క్షిపణి ప్రయోగం సక్సెస్



**పెంటగాన్, నవంబరు 7:** అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ, అమెరికా తన అణు సామర్థ్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. కాలిఫోర్నియాలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి మినిట్‌మ్యాన్3 అనే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఇది కేవలం ఆయుధ వ్యవస్థల విశ్వస నీయతను అంచనా వేయడానికి చేపట్టిన రొటీన్ పరీక్ష అని అధికారులు ప్రకటించినప్పటికీ, దీని వెనుక బలమైన వ్యూహాత్మక కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. మినిట్‌మ్యాన్ సక్సెస్ అనంతరం ట్రంప్ స్పందించారు. ప్రపంచాన్ని 150 సార్లు నాశనంచేయగల అణుసత్తా అమెరికాకు ఉందంటూ ప్రపంచ దేశాలకు హెచ్చరికలు చేసారు.

యూఎస్ ఎయిర్ ఫోర్స్ గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ ఈ ప్రయోగాన్ని ధ్రువీకరించింది. ఈ క్షిపణి సుమారు 7,500 కిలోమీటర్లు ప్రయాణించి, పసిఫిక్ మహా సముద్రంలోని మార్షల్ దీవుల సమీపంలో ఉన్న రోనాల్డ్ రీగన్ బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ టెస్ట్ సైట్‌లోని లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించిందని అధికారులు తెలిపారు. ఇది కేవలం వ్యవస్థల పనితీరు, వేగం, కచ్చిత త్వాన్ని అంచనా వేయడానికి చేపట్టిన రొటీన్ పరీక్ష అని, ఇందులో ఎలాంటి అణు వార్ హెడ్‌లు ఉపయోగించలేదని పెంటగాన్ స్పష్టం చేసింది.

ట్రంప్ ఆదేశాలతోనే ఈ పరీక్ష జరిపారు. రష్యా, చైనా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలు నిర్వహిస్తు న్నాయని, ఈ పోటీలో అమెరికా వెనుకబడకూడదన్న ఉద్దేశంతో అధ్యక్షుడు ట్రంప్ ఈ పరీక్షలకు ఆదేశించినట్లు తెలుస్తోంది.


ఎలాంటి పేలుడు పదార్థాలతో కూడిన అణు పరీక్షలు నిర్వహించబోమని అమెరికా ఇంధన శాఖ స్పష్టం చేసినప్పటికీ, ఈ ప్రయోగం ప్రచ్ఛన్నయుద్ధ కాలం నాటి అణు పోటీని గుర్తుచేస్తోందని నిపుణులు అంటున్నారు.

మినిట్‌మ్యాన్3 అమెరికా అమ్ముల పొదిలో అత్యంత పురాతనమైన, భూమి నుంచి ప్రయో గించే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి. 1970ల నుంచి ఇది సేవలో ఉంది. నిమిషం వ్యవధిలోనే ప్రయోగించ గలదు కాబట్టే దీనికి ఆ పేరు వచ్చింది. ఇది సుమారు 13వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా ఛేదించగలదు. ప్రస్తుతం అమెరికా వద్ద ఇలాంటివి 400 క్షిపణులు ఉన్నాయి. 2030 నాటికి వీటి స్థానంలో కొత్త క్షిపణులను ప్రవేశపెట్టాలని అమెరికా యోచిస్తోంది.

ఈ ప్రయోగం అణ్వాయుధాల భయానక విధ్వంసాన్ని మరోసారి గుర్తుచేస్తోంది. ప్రస్తుతం అమెరికా వద్ద ఉన్న అత్యంత శక్తిమంతమైన బి83 అణు బాంబు సామర్థ్యం 1.2 మెగాటన్నులు. అంటే హిరోషిమా బాంబు కంటే 80 రెట్లు ఎక్కువ. ఇది ఒక నగరంపై పడితే 1015 కిలోమీటర్ల పరిధిలోని ప్రతిదీ బూడిదైపోతుంది. ప్రపంచాన్ని 150 సార్లు నాశనం చేయగల అణ్వాయుధాలు తమ వద్ద ఉన్నాయని అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. నిపుణుల అంచనా ప్రకారం, నాగరికతను నాశనం చేయడానికి 1,00,400 అణు వార్‌హెడ్‌లు చాలు.

ఈ నేపథ్యంలో, మినిట్‌మ్యాన్3 వంటి పరీక్షలు ఒకవైపు అమెరికా సైనిక సన్నద్ధతను చాటుకోవడానికే కాకుండా, ప్రత్యర్థి దేశాలకు ఒక హెచ్చరికగా కూడా ఉపయోగపడ తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అమెరికాకు పోటీగా చైనా శక్తివంతమైన యుద్ధనౌక 'ఫుజియాన్'



**బీజింగ్, నవంబరు 7:** చైనా అత్యంత శక్తిమంతమైన ఫుజియాన్ (టైప్003) యుద్ధ నౌకను ప్రారంభించింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ విమాన వాహక నౌకను ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రారంభించారు. హైనాన్ ద్వీపంలోని సైనిక నౌకాశ్రయంలో దీనికి సంబంధించిన వేడుకలు జరిగినట్లు స్థానిక అధికారక మీడియా వెల్లడించింది. జిన్‌పింగ్ యుద్ధ నౌకను పరిశీలించారని పేర్కొంది. 316 మీటర్ల పొడవు, 80 వేల టన్నుల బరువు కలిగిన ఫుజియాన్ విమాన వాహక నౌక దాదాపు 50 విమానాలను మోసు కెళ్లగలదు. ఇది చైనాకు చెందిన మూడవ అత్యంత ఆధునిక యుద్ధ నౌక. విద్యుదయస్కాంత ఆధారిత వ్యవస్థ అయిన ఈఎంఏఎల్ఎస్‌ను ఇందులో వినియోగించారు. ఈ తరహా సాంకేతికతను అమెరికాకు చెందిన గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ శ్రేణి విమాన వాహక నౌక మాత్రమే ఇప్పటివరకు వినియోగిస్తోంది. ఈ నౌక బీజింగ్‌కు వ్యూహాత్మక సాధనంగా ఉపయోగపడుతుందని, దేశ గౌరవాన్ని పెంచుతుందని చైనా ఇటీవల పేర్కొంది. ఫుజియాన్ తర్వాత టైప్004 విమాన వాహక నౌకను నిర్మించేందుకు కూడా చైనా సన్నాహాలు ప్రారంభిం చింది. దీనిని ఈఎంఏఎల్ఎస్‌తో పాటు అణు సామర్థ్యంతో నిర్మించాలని చైనా ప్రణాళికలు రచిస్తోంది. అమెరికాతో పోటీపడుతూ చైనా తన ఆయుధ సంపత్తిని విస్తరిస్తోంది.

# టిజిఎస్‌ఆర్‌టిసిలో జెఎసి ఏర్పాటు

## 11న నూతన జెఎసి ఎన్నిక..
## భవిష్యత్ కార్యాచరణ ప్రకటన

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (టిజిఎస్ఆర్‌టిసి)లో జెఏసి ఏర్పాటుకు కార్మిక సంఘాలు శ్రీకారం చుట్టాయి. ఇందుకు సంబంధించి శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో అన్ని కార్మిక సంఘాలతో జెఏసి కోసం ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అధ్యక్షత వహించారు. సమావేశానికి ఎంప్లాయిస్ యూనియన్ తరపున చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.వెంకటిగౌడ్, వైస్ ప్రెసిడెంట్ ఎన్.బాల్ రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ జె.రాఘవులు, కోశాధికారి కె.రామిరెడ్డి, తెలంగాణ మజూర్ యూనియన్ నుండి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.కమలాకర్ గౌడ్, చీఫ్ అడ్వైజర్ బి.యాదయ్య, బహుజన కార్మిక యూనియన్ నుండి ప్రధాన కార్యదర్శి కత్తుల యాదయ్య, బుద్ధ విశాల్, బి.రాములు, బి.డబ్ల్యు.యు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.వి.కె.యాదవ్, సుద్దాల సురేష్, డి. రామచంద్రం, కార్మిక పరిషత్ నుండి బి. యాదగిరి, ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన సంఘాల నాయకులు మాట్లా డుతూ.. ప్రస్తుతం ఆర్‌టిసి కార్మికులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గతంలో రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకిచ్చిన హామీలను విస్మరించిందని, రాష్ట్రవ్యాప్తంగా యూనియన్ల ప్రాతినిధ్యం లేకపోవడం వలన, వాటిపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం వలన అన్ని డిపోలలో కార్మికులపై అధిక పనిభారం మోపి నిత్యం వేధింపులకు యాజమాన్యం పాల్పడు తోందన్నారు. రాబోయే రోజులలో ఆర్‌టిసి ఉనికికి, కార్మికుల భద్రతకు ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సుల వలన పెను ప్రమాదం ముంచుకు వస్తోందని తెలియజేస్తూ, ఆర్థిక అంశాలపైన ఇతర పెండింగ్ అంశాలపైన సమావేశంలో చర్చించడం జరిగిందన్నారు. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితులలో ఉన్న కార్మికవర్గాన్ని మరో సారి పోరాటం వైపు తీసుకు రావటానికి కలిసివచ్చే సంఘాలతో జెఏసిగా ఏర్పడి సర్కారు ఇచ్చిన హామీల అమలుకై సమరం సాగించడానికి ఈ నెల 11న మరోసారి సమావేశం నిర్వహించి అందులో నూతన జెఏసిని ఎన్నుకుని, అదేరోజు ఉమ్మడి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.



కోటి దీపోత్సవంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న కేంద్రమంత్రి షెకావత్

# కోటి దీపోత్సవాన్ని జాతీయ పండుగగా గుర్తించాలి: కేంద్రమంత్రి షెకావత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, నవంబరు 7:** భక్తి టీవీ కోటీ దీపోత్సవం అద్భుతమైన కార్యక్రమమని కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పేర్కొన్నారు. భక్తి టీవీ కోటీ దీపోత్సవాన్ని జాతీయ పండుగగా గుర్తించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ప్రతిపాదనలు రాగానే కేంద్రం అవసరమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. కోటీ దీపోత్సవం జాతీయ పండుగగానే కాకుండా అంతర్జాతీయ పండుగగా గుర్తింపు ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. భక్తి టీవీ నిర్వహిస్తున్న కోటీ దిపోత్సవానికి శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్

## హైదరాబాద్ వేదికగా వచ్చే నెల 19 నుండి ప్రారంభం

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త :** అంతర్జాతీయ ఫెస్టివల్‌కు హైదరాబాద్ వేదిక కాబోతోంది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీ సంస్థ ద్వారా డిసెంబర్ 19 నుంచి 21 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్తర్వులు విడుదల చేసింది. ఇందుకు ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా 30 లక్షల రూపాయల మేర నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపింది. అలాగే హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ కార్యక్రమంలో అవార్డు ఫంక్షన్ నిర్వహణ కోసం 8 మందితో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ అవార్డుల పునర్వ్యవస్థీకరణ కమిటీ చైర్మన్‌గా దర్శకుడు దశరథ్‌ను నియమించినట్లు ఉత్తర్వుల్లో వెల్లడించింది. అలాగే ఈ కమిటీలో సభ్యులుగా సినీ దర్శకుడు హరీశ్ శంకర్, కళాకారుడు బలగం వేణు, పీజీ వినోద్, రాహుల్ సిప్లిగంజ్, చరణ్ అర్జున్, లక్ష్మీ మ్మలను నియ మించారు.

# హర్యానా, మధ్యప్రదేశ్, గుజరాత్‌లోనూ ఓట్ల చోరీ

## ఆధారాలతో బయటపెట్టినా ఇసి స్పందించలేదెందుకు?
## నేడు బీహార్‌లోనూ ఆ దిశగా బిజెపి పన్నాగం
## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్రఆరోపణలు



**న్యూఢిల్లీ, నవంబరు 7:** ఓట్ చోరీ అంశంపై లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తన దాడిని తీవ్రతరం చేశారు. దేశంలో ఎక్కడ ఏ ఎన్నిక జరిగినా అధికార బిజెపి 'చువాన్ చోరీ' (ఎన్నికలను దొంగలించడం)లో పాల్గొంటుందని, నరేంద్రమోడీ చువాన్ చోరీ ద్వారానే ప్రధానమంత్రి అయ్యారని రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో హోల్‌సేల్‌గా ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీ మీడియాతో మాట్లాడుతూ ఓట్ల చోరీపై తన దగ్గర చాలా ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఓట్ల చోరీపై ప్రజెంటేషన్లు కొనసాగుతాయని చెప్పారు. ప్రధాని మోడీ 'చువాన్ చోరీ' ద్వారా ప్రధాని అయ్యారని తెలిపారు. బిజెపి ఓట్ల చోరీపై యువతకు స్పష్టంగా తెలియజేస్తామన్నారు. హర్యానాలో జరిగిన ఎన్నికలు... అస్సలు ఎన్నికలే కాదన్నారు. హర్యానాలో జరిగిన ఓట్ల చోరీపై అనేక ఆధారాలు చూపించామన్నారు. బిజెపి నేత కుమారుడు రెండు చోట్ల ఓటు వేశారని ఆరోపించారు. అయితే తాను చేసిన ఆరోపణలకు ఇప్పటి వరకు ఎన్నికల సంఘం స్పందించలేదని తెలిపారు. నకిలీ ఓటు, నకిలీ ఫొటోలతో బిజెపి నాయకులు ఓట్లు వేశారని, దీనిని బిజెపి కూడా సమర్థిస్తోందని విమర్శించారు. తన ప్రజెంటేషన్‌లో చూపిస్తున్న చిన్న ఉదాహరణలనే మీడియా తీసుకుంటోందని, బ్రెజిలియన్ మహిళ ఓటు వేసింది ఎవరని ప్రశ్నించారు. మోడీ, అమిత్ షా, ఇసి కలిసి రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగం ఒక మనిషి... ఒక ఓటు అని చెబుతోంది. కానీ హర్యానాలో మానరతం ఒక మనిషి... బహుళ ఓట్లు అని బిజెపి అంటోందని పేర్కొన్నారు. ఇప్పుడు బీహార్‌లో కూడా అదే ఒరవడిని బిజెపి చేయబోతున్న దన్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, గుజరాత్‌లలో జరిగింది కూడా ఇదేనన్నారు. బీహార్‌పై కూడా ఇలాంటి ప్రజెంటేషన్‌తో తిరిగి వస్తానని, అక్కడ కూడా ఓట్ చోరీ జరుగుతుందని అను మానం వ్యక్తంచేశారు.

# త్వరలో 8వ వేతన కమిషన్

## స్టేట్ బ్యాంక్ జీతాల్లో భారీ పెరుగుదల

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ, పబ్లిక్ సెక్టార్ ఉద్యో గులకు ముఖ్యమైన 8వ వేతన కమిషన్ త్వరలో రానుంది. ఈ కమిషన్ ద్వారా ఉద్యోగుల వేతనాల్లో పెరుగుదల చోటు చేసుకోనుంది. ముఖ్యంగా 8వ వేతన కమిషన్ ద్వారా స్టేట్ బ్యాంక్ ఉద్యోగుల ప్రాథమిక జీతం గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం గ్రాడ్యుయేట్ క్లర్క్ ఉద్యోగులకు ప్రారంభ బేసిక్ పే రూ.26,730గా ఉంది. కానీ ఈ కొత్త వేతన కమిషన్ అమల్లోకి వచ్చిన తర్వాత ఇది రూ.30 వేలకు పైగా ఉంటుందని అంచనా.

మధ్యస్థ స్థాయి ఉద్యోగుల విషయానికొస్తే, వారి ప్రాథమిక జీతం రూ.75 వేల వరకు పెరగనుంది. ప్రస్తుతం ఎస్‌బీఐ క్లర్క్‌ల వేతన వివరాలు చూస్తే బేసిక్ పే రూ.26,730. దీనికి వివిధ అలవెన్సులు కలిపి మొత్తం గ్రాస్ జీతం రూ.45,888 అవుతుంది. డిడక్షన్లు తీసిన తర్వాత చేతికి వచ్చే నికర జీతం సుమారు రూ.39,529గా ఉంటుంది. ఎస్‌బీఐ ఉద్యోగులకు డియర్‌నెస్ అలవెన్స్, హౌస్ రెంట్ అలవెన్స్, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, స్పెషల్ అలవెన్స్ వంటి అనేక ప్రయోజనాలు అందు తాయి. సాధారణంగా డియర్‌నెస్ అలవెన్స్ రూ.7,161, హౌస్ రెంట్ అలవెన్స్ రూ.2,862 (పోస్టింగ్ ప్రదేశాన్ని బట్టి మారుతుంది), స్పెషల్ అలవెన్స్ రూ.7,083 వరకు ఉంటుంది.

ఇవన్నీ కలిపి ఉద్యోగుల మొత్తం జీతాన్ని గణనీయంగా పెంచుతాయి. జీతం నగరాన్నిబట్టి కూడా మారు తుంది. ప్రారంభ బేసిక్ రూ.26,730 నుంచి రూ.64,480 వరకు పదోన్నతులతో పాటు వృద్ధి చెందుతుంది.

# కేంద్రమంత్రి బండి సంజయ్‌పై ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు



రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న పిసిసి ఎన్నికల కమిషన్ కోఆర్డినేషన్ కమిటి చైర్మన్ రాజేష్‌కుమార్, సభ్యులు రాఘవేందర్

**హైదరాబాద్ (చార్మినార్), నవంబరు 7, ప్రభాతవార్త:** కేంద్రమంత్రి బండి సంజయ్‌పై ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. జూబ్లీ హిల్స్ ఉపఎన్నికల ప్రచారం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి కేంద్రమంత్రి బండి సంజయ్ అనుచితవ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని టిపిసిసి ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటి చైర్మన్ పులిపాటి రాజేష్‌కుమార్, సభ్యులు గోపిశెట్టి రాఘవేందర్‌లు కలిసి శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

# గాయని చిన్మయి శ్రీపాద ఫిర్యాదుపై కేసు నమోదు

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** సోషల్ మీడియాలో తనను కొందరు వేధిస్తున్న ఉదంతంపై ప్రముఖ గాయని చిన్మయిశ్రీపాద చేసిన ఫిర్యాదు మేరకు శుక్రవారం నాడు సిటీ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె భర్త రాహుల్ రవీంద్రన్ తాళి విషయంలో చేసిన వ్యాఖ్యలు. దీనిపై శ్రీపాద స్పందించిన తీరును కొందరు సోషల్ మీడియా ద్వారా ఎగతాళి చేయడం తెలిసిందే. ఇదే విషయమై శ్రీపాద సిటీ కొత్వాల్ సజ్జనార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన సైబర్ క్రైం పోలీసులు ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వీరిని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు.

# 22, 23 తేదీల్లో హైదరాబాద్‌లో కామన్వెల్త్ ఎఐ గ్లోబల్ సమ్మిట్

## 'ప్రోత్సహించడం-విద్యను అందించడం-సాధికారత కల్పించడం' థీమ్‌తో నిర్వహణ

**హైదరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరో గ్లోబల్ సమ్మిట్ జరగనుంది. ఈ నెల 22, 23 తేదీల్లో కామన్వెల్త్ ఏఐ గ్లోబల్ సమ్మిట్- 2025ను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గ్లోబల్ సమ్మిట్-2025 ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ప్రభు కుమార్ చల్లగలితో కలిసి ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి శుక్రవారం మీడియాతకు తెలి పారు. భారతదేశంలో తొలిసారిగా నిర్వహించ బడుతున్న కామన్వెల్త్ ఏఐ గ్లోబల్ సమ్మిట్-2025 గురించి అవగాహన కల్పించడానికి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 'ప్రోత్సహించండి-విద్యను అందిం చండి - సాధికారత కల్పించండి' అనే థీమ్‌తో కామన్వెల్త్ ఏఐ గ్లోబల్ సమ్మిట్-2025ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమ్మిట్‌కి ప్రపంచ వ్యాప్తంగా 2,500 మంది ప్రతినిధులు, నిపుణులు హాజరుకానున్నారని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్‌కు కామన్వెల్త్ దేశాలు, ఇతర ప్రపంచ భాగస్వాములకు ప్రాతినిధ్యం వహిస్తున్న 50 కంటే ఎక్కువ దేశాల నుండి ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ కార్యక్రమంలో పాల్గొనడానికి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కామన్వెల్త్ మెడికల్ అసోసియేషన్ (సిఎంఏ), రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజిషియన్స్ అండ్ సర్జన్స్ ఆఫ్ గ్లాస్గో, యుకె.. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సహకారంతో ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్గనైజింగ్ చైర్మన్, కన్వీనర్ డాక్టర్ ప్రభు కుమార్ చల్లగలి మాట్లాడుతూ.. తెలంగాణలో గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. భారత చరిత్రలో తొలిసారిగా, రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజిషియన్స్ అండ్ సర్జన్స్ ఆఫ్ గ్లాస్గో ద్వారా కామన్వెల్త్ ఏఐ, డిజిటల్ హెల్త్ కార్డ్ (ఎఫ్‌సిఏడి)లో ఫెలోషిప్ సర్టిఫికేట్ కోర్సును ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఇది తెలం గాణతోపాటు భారతదేశానికి చాలా గర్వకారణమన్నారు. ఏఐ దేశ భవిష్యత్తును రూపొందిస్తున్నందున, ప్రాథమిక ఎంబిబిఎస్ విద్యార్థుల నుండి అత్యున్నత స్థానాల్లో ఉన్నవారి వరకు ప్రతి వైద్య నిపుణుడు ఈ సమావేశంలో నమోదు చేసుకుని హాజరు కావడం మంచిదని, తద్వారా వారు జ్ఞానాన్ని పొందగలరని చెప్పారు. కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (కెఎన్ఆర్‌యు హెచ్ఎస్) వైస్‌ఛాన్సలర్ డాక్టర్ పి.వి. నంద కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం సమ్మిట్‌లో చురుకుగా పాల్గొంటోందని, తెలంగాణ అంతటా ఆరోగ్య కేంద్రాలకు ఏఐ సాధనాలు, సాంకేతికతలలో శిక్షణ అందించడానికి గ్రామాలను కూడా దత్తత తీసుకుం టోందని పేర్కొన్నారు. ఈ నెల 22, 23 తేదీలలో హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ సమ్మిట్ జరుగుతుందని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జె. గోపాల కృష్ణ ప్రకటించారు. వైద్య విద్యార్థులు, నిపుణులు, వైద్యులు, శాస్త్రవేత్తలు మరియు ప్రాక్టీషనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని మెడిసిన్, హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, డిజిటల్ హెల్త్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో ఏఐపై జరిగే సెషన్‌ల ద్వారా ప్రయోజనం పొందాలని సూచించారు. సమ్మిట్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సి. దామోదర్ రాజనర సింహ, ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9989220003, 9849137420 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# కంఫర్ట్ ఫ్రాక్

ఫ్యాషన్ ఫ్యాషన్









లక్షణాలు తగ్గి పరిస్థితులు యథాస్థితికి వచ్చినా... ఆఫీసులు తిరిగి మొదలైనా అమ్మాయిల ఓటు. మాత్రం మారలేదు. బిగుతుగా ఒంటిని పట్టేసినట్టుగా ఉండే ఫార్మ్క నో చెప్తున్నారు. అలాగని ఆఫీసు వాతావరణానికి వ్యతిరేకంగా ఉండేలా ఏమీ లేదు. కంఫర్ట్ చూస్తున్నారు. కాకపోతే దానికి జతగా ఫ్యాషన్ కూడా కావాలంటున్నారు. ఆ అవకాశం వాళ్లకి ఇదిగో ఈ ఫ్రాక్‌లోనే! అందుకే వీటిని ఎంచుకుంటున్నారు. అయితే హుందాగానూ కనిపించాలి కదా... అందుకని షార్ట్, ఎల్బీ. ఫుల్ స్లీవ్స్‌క ప్రాధాన్యమిస్తున్నారు. చక్కగా మోకాలి కిందగా.... లేదంటే యాంకెల్ వరకూ వచ్చేలా ఓ మిడ్ డ్రెస్ దానికి నప్పేట్టుగా శాండిల్స్ లేదా స్నీకర్స్ చూడటానికీ ఏ హంగామా లేకుండా ఎంత హాయి? కాబట్టే, యువ ఉద్యోగినుల ఎంపిక ఇదవుతోంది. వానల వేళ ఏ జార్జెట్, విస్కోస్, రేయాన్నో ఎంపిక చేసుకోండి. తడిసినా సమస్య ఉండదు. త్వరగా ఆరతాయి కూడా. అన్నట్టు దీనివెనక ఇంకో రహస్యమూ ఉందండోయ్! ఆఫీసు అయిపోగానే అకస్మాత్తుగా కొలీగ్స్ షాపింగ్, సినిమా, డిన్నర్ అంటూ ప్లాన్ చేశారనుకోండి...

# పేద చేనేత కుటుంబాలకు బాసటగా..



యాభైవేల జనాభా ఉండే చిన్న పట్టణం భవానీ. ఇప్పుడు ప్రపంచ ఫ్యాషన్ బ్రాండ్‌గా మారింది. ఆ బ్రాండ్ వెనకున్న డిఫిన్... వినో సుప్రజ. పేద చేనేత కుటుంబాలకు బాసటగా నిలిచారీమె. బ్రిటిష్ పార్లమెంట్ సత్కారాన్నీ అందుకున్నారు. 45ఏళ్ల సుప్రజ ఫ్యాషన్ ప్రస్థానం తెలుసుకుందాం..

మాది తమిళనాడులోని తిరువణ్ణామలై వందవాసి అనే చిన్న పట్టణం. నాన్న ఆదికేశవులు డాక్టర్. మాది గాంధీ భావాలున్న కుటుంబం. అందుకే చేనేతన్నా ఖాదీ అన్నా అంత గౌరవం. మొదట ఆర్కిటెక్ట్ అవ్వాలని చెన్నై కాలేజీలో చేరారు. కానీ రేడియో జాకీగా, టీవీ యాంకర్‌గా కెరియర్ మొదలుపెట్టాను. పెళ్లి తర్వాత మావారితో కలిసి చైనా వెళ్లినప్పుడు అక్కడ ఫ్యాషన్ ఇండస్ట్రీ నన్ను ఎంతగానో ఆకర్షించింది. షాంఘై, లండన్, పారిస్‌లో ఫ్యాషన్ డిజైనింగ్, మార్కెటింగ్ కోర్సులు కూడా పూర్తిచేశా. వస్త్ర ప్రపంచంపై పట్టు సాధించా. అదే సమయంలో వస్త్రకార్మికుల జీవితాల్ని చాలా దగ్గర నుంచి చూశా. మహిళలతో ఎక్కువ గంటలు పనిచేయించేవారు. రుతుస్రావంలో కూడా పనికి కూర్చోబెట్టేవారు. బాత్రూమ్ వెళ్లకుండా తలుపులు మూసేసేవారు. అది నా మనసుని ఎంతగానో బాధించింది. అప్పుడే మహిళా కార్మికుల హక్కులను కాపాడాలి, వారి నైపుణ్యాలను ప్రపంచానికి పరిచయం చేయాలనుకున్నా. ఆ తలంపుతో 'వినో సుప్రజ' పేరుతో ఫ్యాషన్ బ్రాండ్ స్థాపించాను. దుబాయ్ కేంద్రంగా ఇది నడుస్తోంది. 'ఎంత ఎదిగినా సొంతగడ్డను మరిచిపోకూడదు' అనేది నాన్న మాట. దాన్ని నేను మర్చిపోలేదు. ఓసారి ఈరోడ్లోని భవాని చూడటానికి వెళ్లా. ఆ ఊరంతా చేనేత కుటుంబాలే. పగలూ రాత్రి తేడా లేకుండా రగుల్ని నేస్తారు. అక్కడి కార్మికులు నేసే రగ్గులకి ఇప్పటికే భౌగోళిక గుర్తింపు (జిఐ) వచ్చింది. అంత కష్టపడి పనిచేసినా ఆర్డర్లు లేకపోవడంతో ఉపాధి తగ్గిపోయింది. బతుకు భారమై ఉపాధి కోసం సొంత ఊరిని వదులుకుని నగరాలకు వలస వెళ్లడం నన్ను కలచివేసింది. ఏ కుటుంబాన్ని కదిపినా కన్నీటి గాథలే. వీళ్ల కోసం ఏదైనా చేయాలి అనిపిం చింది. నిజానికి చరిత్రనూ, సంస్కృతినీ పరిచయం చేస్తూ వీరు నేసే ఈ వస్త్రాలు పర్యావరణ ప్రియమైనవి.



**ప్రపంచానికి పరిచయం...** ఒక వింతగా వీళ్ల ప్రతిభను ప్రపంచ వేదికలపై చూపించాలనుకున్నాను. బ్రూక్లిన్, లండన్ వంటి ఫ్యాషన్ వీక్ వేదికలమీద భవానీ రగ్గుల (జమక్కలం) ఫ్యాషన్‌ని ప్రదర్శించారు. అది కొత్త ట్రెండ్‌గా మారింది. ఇప్పుడు అవే 'జెక ఉన్నాయి. గల్ఫ్ దేశాలతోపాటు భారత్, సింగపూర్లోనూ వీటికి డిమాండ్ పెరిగింది.

**భావోద్వేగానికి గురయ్యా...** నేను ఫ్యాషన్ వీక్‌ల్లో ప్రదర్శించే వస్త్రాలన్నీ భవానీ చేనేత కుటుంబాలు నేసినవే. అది చూసి ఈ ఏడాది బ్రిటిస్ పార్లమెంటు 'గ్లోబల్ సస్టైయినబుల్ ఫ్యాషన్ బ్లేజర్ అవార్డుతో సత్కరించింది. కానీ, ఇది వాళ్లకు దక్కిన గౌరవమే నా డిజైన్ల వెనకున్న అసలైన హీరోలు భవానీ ప్రజలే. వాళ్ల పనితనాన్ని ప్రపంచవ్యాప్తం చేయడమే నా లక్ష్యం. అందుకు లండన్ ఫ్యాషన్ వీక్‌లో భవానీ చేనేతకు గుర్తుగా ప్రత్యేక కలెక్షన్స్ చూపడంతో పాటు స్థానిక సంస్కృతికి అద్దం పట్టేలా నృత్య ప్రదర్శన కూడా ఇచ్చా. దాంతో భవానీ జమక్కలం మరింత ప్రాచుర్యం పొందింది.

# దీపదానం



**పరమ పవిత్రమైన** కార్తీక మాసం ఆధ్యాత్మిక సాధనకు, మోక్షసాధనకు విశిష్టమైనది. ఆధ్యాత్మిక పరంగా ఈ మాసానికి అపారమైన ప్రాముఖ్యత ఉంటుంది. హిందూ మత విశ్వాసాల ప్రకారం కార్తీకమాసంలో స్నానం, దానం, జపం, ఉపవాసం, దీపారాధన, దీప దానం వంటి వాటికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. అసలు దీప దానం అంటే ఏమిటి? దీపదానం చేయడం వల్ల ఎలాంటి ఫలితాలు ఉంటాయి శివకేశవుల ప్రీత్యర్థంశివకేశవులకు ప్రీతికరమైన కార్తీకమాసం నెల రోజుల పాటు భక్తులు విధిగా దీపాలు వెలిగించి పరమేశ్వరుడి అనుగ్రహం కోసం పూజలు చేస్తారు. అలాగే విష్ణువు, లక్ష్మీదేవికి పూజలు నిర్వహిస్తారు. ఈ మాసంలో ఆలయాల్లో, తులసి దగ్గర నెయ్యి దీపం వెలిగించడం, దీప దానం చేయడం ద్వారా మోక్షాన్ని పొందవచ్చని శాస్త్ర వచనం. అసలు దీప దానం ఎందుకు చేస్తారు? దీని వల్ల కలిగే ప్రయోజనాలు ఉన్నాయి. జ్ఞానోదయాన్ని కలిగించే దీపం కార్తీకమాసంలో దీపం దానం చేయడం వల్ల విశేషమైన ఫలితాలు లభిస్తాయి. దీప దానం ఆధ్యాత్మిక వృద్ధిని పెంపొందిస్తుంది. జ్వాల మనలోని జ్ఞానాన్ని సూచిస్తుంది. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానం ప్రసాదించమని కోరుకుంటూ దీప దానం చేస్తారు. శివాలయంలో కాని విష్ణు ఆలయంలో కానీ నెయ్యి దీపాలు దానం చేయడం వల్ల అంతర్గత శాంతి పెరుగుతుంది. శ్రేయస్సు, అదృష్టాన్ని ఇచ్చే దీపదానం కార్తీకమాసంలో దీప దానం చేయడం వల్ల శ్రేయస్సు, అదృష్టం వృద్ధి చెందుతాయి. తలపెట్టిన అన్ని పనుల్లో విజయం చేకూరుతుంది. ఆర్థిక ఇబ్బందులను తొలగించి ఐశ్వర్య ప్రాప్తిని కలిగిస్తుంది. తొలగిపోయే ప్రతికూలతలు కార్తీక మాసంలో దీప దానం చేయడం వల్ల తరతరాల నుంచి వస్తున్న పాపాలు తొలగిపోతాయి. జీవితంలో ఎదురయ్యే ప్రతికూలతల నుంచి విముక్తి కలుగుతుంది. దీపదానం వలన పాపపరిహారం కలిగి మనసు, శరీరం, ఆత్మ శుద్ధి అవుతుంది. ఆరోగ్య కారకం దీపదానం కార్తీకమాసంలో ఆలయాలలో దీపం దానం చేయడం వలన అనారోగ్య సమస్యల నుంచి విముక్తి లభించి స్వస్థత చేకూరి, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. మనోభీష్ట సిద్ధి కార్తీక మాసంలో చేసే దీపదానం వలన దైవానుగ్రహంతో తెలిసీ తెలియక చేసిన పాపాలు నశించిపోయి, సానుకూల శక్తులు పుంజుకుంటాయి. ప్రతి పనిలో అనుకూలత లభించి సకల మనోభీష్టాలు నెరవేరుతాయి. దీపదానం చేయాలనుకునే వారు తలారా స్నానం చేసి సమీపంలోని శివాలయానికి కానీ విష్ణువు ఆలయానికి కానీ వెళ్లి రెండు మట్టి ప్రమిదలు కానీ, వెండి కాని, ఇత్తడి కాని రెండు కుందులలో ఆవు నీటినిపోసి రెండు వత్తులు వేసి దీపారాధన చేసి సమంత్రక పూర్వకంగా బ్రాహ్మణుల సమక్షంలో దీపాలను దానం చేయాలి.

# మూత తీయడం సులువే..



కొన్నిసార్లు సీసాలూ, డబ్బాల మూతలు బిగుసుకుపోయి.. తీయడానికి చాలా అవస్థ పడుతుంటాం అలాంటి ఇబ్బంది నుంచి తప్పించడానికి 'అండర్ కాబినెట్ జార్ ఓపెనర్' వచ్చేసింది. ఈ చిన్న సాధనాన్ని సీలింగుకు అమర్చుకోవాలి. సీసాను చేత్తో పట్టుకుని, మూత భాగాన్ని ఆ పరికరంలోనికి చొప్పించి.. తిప్పితే చాలు తేలిగ్గా మూత వచ్చేస్తుంది. ఇకపై మూత తెరవమని ఎవరినీ అడగాల్సిన పని లేదు.

ఆరోగ్య భాగ్యం

# చుక్కకూర ప్రయోజనం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

చుక్కకూర మొదట రష్యా, యూరోప్ నుండి ప్రపంచ మంతట సాగుల ఉండే శాశ్వత మూలికల మొక్క. పూర్వకాలం నుండి దీన్ని గృహ వైద్యంగా తిన్నతర్వాత అరుగుదలకి, జ్వరానికి, అల్సర్లకి, కాన్సర్లకి చిగుళ్లనుండి రక్తం కారడం (స్కర్వీ) వంటి అనేక వ్యాధులకి ఔషధంగా వాడేవారు. దీని శాస్త్రీయనామం రూమెక్స్ వెసికారియస్. ఇది పాలీగొనేసియా ఫ్యామిలీకి చెందినది. ఇది ఉష్ణమండల శీతోష్ణస్థితిలో ఏడాది పొడునా త్వరితంగా పెరిగే ఆకుకూరమొక్క ఇది వేసవిలో చలికాలంలో తక్కువ ఖర్చుతో ఎక్కువపోషకాలు అందించే విరివిగా దొరికే ఆకుకూర. చుక్కకూర ఆకులు మందంగా పెళుసుగా ఉండి సన్నని కాడలతో బాణం ఆకారంలో అధిక జిగురు పదార్థాన్ని కల్గి ఉండే పుల్లని ఆకుపచ్చని ఆకుకూర. ఇది ఆకృతిలో ముదురు ఆకుపచ్చరంగులో బచ్చలిని పోలి ఉండడంతో పుల్లబచ్చలి అని కూడ అంటారు. అలాగే పాలకూరలాగా మృదువుగా, పెళుసుగ ఉండడం వల్ల సాలకూర పెద్దన్న, పాలకూర డాక్, స్పీనాచ్‌డక్, నారోలీవ్‌డ్‌డక్ అని అంటారు. అలాగే పాలకూరగా మృదువుగా పెళుసుగా ఉండడం వల్ల పాలకూర పెద్దన్న, పాలకూరడాక్, స్పీనాచ్‌డక్, నారో లీవ్‌డ్‌డక్ అని అంటారు. పులుపులో గోంగూర లాగా ఉండడంతో గ్రీన్ సోరెల్ సవర్‌వీడ్ అనీ అంటారు. దీన్ని ఇంటి తోటలో, పెరట్లో, కుండీల్లో, పొలాలల్లో ఎక్కువగా డక్ సోరెల్, ఇండియన్ సోరెల్, ఫీల్డ్ సోరెల్ అని పిలుస్తారు. డక్ అనేది రూమెక్స్ జాతికి సాధారణ పేరు. దక్షిణ భారతదేశంలో, గ్రామీణ ప్రాంతాల్లోనివారు చుక్కకూరని ఎక్కువగా వినియోగిస్తారు. చుక్క,కూర అనే రెండు తెలుగు పదాల కలయిక వల్ల దీనికాపేరు వచ్చింది. అంతేగాకుండా చుక్కాకు, పత్రామ్ల, చూకా, చుగ్రు, చుక్రికా, చుక్రం, చుకాసాక్, సుక్కంగిరై, లోలికా, శతవేధి, పొక్కుసోరెల్, దేశం, సోరెత్, రోజీడాక్, చుక్కన్‌కీరై, చుక్కిసొప్పు, అంబట్ చుక్క, పచ్చిపుల్లలు అని వివిధప్రాంతాల్లో వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో వ్యవహరిస్తారు. దీన్ని సలాడ్స్‌లో ఎక్కువగా వినియోగించడం వల్ల దీన్ని సలాడ్ లీవ్స్, సోరెల్ లీవ్స్ అని అంటారు. ఇదికాక అటు ఇటుగా గోంగూరలాగే పులుపుదనాన్ని కల్గి ఉండడానికి ముఖ్య కారణం ఆక్సాలిక్, ఆసిడ్ ఎక్కువగా ఉండడమే ఇది నిమ్మ వాసనతో పుల్లని రుచితో ఉండి శరీరంలో వేడిని తగ్గించి చలువ చేస్తుంది ఆహారానికి రుచిని కల్గించే రుచికరమైన ఆకుకూర ఇది. చుక్కకూర రెండు రకాలుగా దొరుకుతుంది. 1. పెద్దచుక్కకూర పుల్లగా తియ్యగా ఉంటుంది. 2. చిన్న చుక్కకూర పుల్లగా వగరుగా ఉంటుంది. పోషక విలువలు : 100 గ్రాముల చుక్కకూరలో ఉండే పోషకాలు తేమ: 95.2 కేలరీలు: 19 కె. ప్రోటీన్: 1.6గ్రా, కార్బొహైడ్రేట్స్: 1.4 గ్రా మినరల్స్: 0.9, ఫైబర్ : 1.2 గ్రా, కాల్షియం: 63 మి.గ్రా, ఫాస్పరస్ : 84 మి.గ్రా, ఐరన్: 8.7 మి.గ్రా, విటమిన్ సి: 53 మి.గ్రా. మెగ్నీషియం : 137 మి.గ్రా, పొటాషియం: 519 మి.గ్రా, ల్యూటిన్ : 2370 మి.గ్రా, బీటాకెరోటిన్: 2754 మి.గ్రా **ఆరోగ్య ప్రయోజనాలు :** సరైన ఆరోగ్యానికి సమతుల్య ఆహారానికి చుక్కకూర చాలా మంచిది. లివర్ : చుక్కకూరలోని ఆంటీ కామెర్ల గుణం వల్ల చుక్కకూర రసం పాలు లేదా పెరుగులో కలిపి తీసుకుంటే తగ్గుతుంది. లివర్ వ్యాధుల తీవ్రతను తగ్గిస్తుంది. తేలు కాటు వేసిన చోట చుక్కకూర రసం పోసినట్లయితే విషానికి విరుగుడై త్వగా కోలుకుంటారు.

# 'ఫంకీ' నవ్వుల తుఫాను



మాస్ కా దాస్ విశ్వక్ సేన్, కె.వి. అనుదీప్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ 'ఫంకీ' ఏప్రిల్ 3, 2026న విడుదలవైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయకుడు విశ్వక్ సేన్, హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి. అనుదీప్ కలయికలో రూపొందుతోన్న చిత్రం 'ఫంకీ'. ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్ర విడుదల తేదీ వచ్చేసింది. ఇటీవల విడుదలైన టీజర్‌కు ప్రేక్షకులు ఇచ్చిన అద్భుతమైన స్పందనతో ఉత్సాహంలో ఉన్న 'ఫంకీ' చిత్ర బృందం, ఈ సినిమాను 2026 ఏప్రిల్ 3న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తాజాగా ప్రకటించింది. 'జాతిరత్నాలు' సినిమాతో సంచలనాలు సృష్టించిన ఆయన.. మరోసారి విభిన్నమైన కథాంశం, కట్టిపడేసే హాస్యంతో ప్రేక్షకుల మనసు దోచుకోనున్నారు. 'ఫంకీ' చిత్రంలో విశ్వక్ సేన్ సినీ దర్శకుడి పాత్రను పోషిస్తుండటం విశేషం. కొత్త లుక్, కొత్త యాటిట్యూడ్‌తో ప్రేక్షకులను సరికొత్తగా అలరించనున్నారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో సంగీతం ఈ చిత్రానికి అదనపు ఆకర్షణగా నిలవనుంది. అద్భుతమైన గీతాలు, నేపథ్య సంగీతంతో భీమ్స్ సిసిరోలియో ఈ సినిమాకి ప్రధాన బలంగా నిలవనున్నారు. శీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఎక్కడా రాజీ పడకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించిన నిర్మాణ సంస్థల నుంచి వస్తున్న సినిమా కావడంతో, 'ఫంకీ'పై సహజంగానే అంచనాలు ఎక్కువగా ఉంటాయి. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా 'ఫంకీ' చిత్రం ప్రేక్షకులకు నవ్వుల విందుని అందిస్తుందని చిత్ర బృందం హామీ ఇచ్చింది.

# అర్జున్, ఐశ్వర్యల 'మఫ్తీ పోలీస్'



యాక్షన్ కింగ్ అర్జున్ ఐశ్వర్య రాజేష్ "మఫ్తీ పోలీస్" నవంబర్ 21న వరల్డ్ వైడ్ రిలీజ్ యాక్షన్ కింగ్ అర్జున్, ఐశ్వర్య రాజేష్ లీడ్ రోల్స్ లో నటిస్తున్న ఖిముఫ్తీ పోలీస్ఖి చిత్రాన్ని నిర్మాత జి. అరుల్ కుమార్ సమర్పణలో జి.ఎస్. ఆర్ట్స్ నిర్మిస్తోంది. నూతన దర్శకుడు దినేష్ లెట్చుమనన్ దర్శకత్వం వహించారు. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. నవంబర్ 21న సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. అర్జున్ ఇంటెన్స్ లుక్ లో కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ అదిరిపోయింది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ థ్రిల్లింగ్ సన్నివేశాలతో అంచనాలను పెంచింది. ఈ చిత్రంలో బిగ్ బాస్ ఫేమ్ అభిరామి, రామ్‌కుమార్, జి.కె. రెడ్డి, పి.ఎల్. తేనప్పన్, లోగు, వేల రామమూర్తి, తంగదురై, ప్రాంక్‌స్టర్ రాహుల్, ఓ.ఎ.కె. సుందర్ తదితరులు నటించారు. శరవణన్ అభిమన్యు సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, ఆశివాగన్ సంగీతం అందిస్తున్నారు. లారెన్స్ కిషోర్ ఎడిటర్. అరుణ్ శంకర్ ఆర్ట్ డైరెక్టర్, ఈ సినిమా తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ భాషలలో ఒకేసారి విడుదల కానుంది.

# తెర

## రజనీకాంత్-కమల్ అనుబంధం



కమల్ హాసన్ ప్రజెంట్స్, సూపర్‌స్టార్ రజనీకాంత్, సుందర్ సి 173 అనౌన్స్‌మెంట్, 2027 పొంగల్‌కి గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా, కమల్ హాసన్ నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ పతాకం బ్యానర్ పై భారత సినీ రంగంలో మైలు రాయిగా నిలిచే మహత్తరమైన ప్రాజెక్ట్‌ని అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి సుందర్ సి దర్శకత్వం వహిస్తున్నారు. ఇది ఇద్దరు మహానటుల మధ్య ఐదు దశాబ్దాల స్నేహం, సహోదర బంధాన్ని సెలబ్రేట్ చేసుకునే బిగ్ సినిమాటిక్ ఈవెంట్. రజనీకాంత్-కమల్ హాసన్‌ల అనుబంధం తరతరాల కళాకారులకు, ప్రేక్షకులకు స్ఫూర్తినిస్తుంది. రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ 44 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పురస్కరించుకొని రూపొందుతున్న 173 సూపర్‌స్టార్ రజనీకాంత్ మాగ్నటిక్ స్క్రీన్ పవర్, సుందర్ సి డైరెక్షన్ కలిపి ప్రేక్షకులకు విశేషమైన అనుభూతిని అందించబోతుంది. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం రెడ్ జెయింట్ మూవీస్ ద్వారా పొంగల్ 2027 సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కానుంది.

## 'సంతాన ప్రాప్తిరస్తు' బ్లాక్ బస్టర్



"సంతాన ప్రాప్తిరస్తు" ట్రైలర్ ప్రామిసింగ్ గా ఉంది, సినిమా బ్లాక్ బస్టర్ అవుతుంది హీరో ఆనంద్ దేవరకొండవిక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న సినిమా "సంతాన ప్రాప్తిరస్తు". ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే అందించారు. "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా ఈ నెల 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ప్రముఖ నిర్మాత దిల్ రాజు, యంగ్ టాలెంటెడ్ హీరో ఆనంద్ దేవరకొండ స్క్రీన్ ప్లే రైటర్ షేక్ దావూద్.జి. మాట్లాడుతూ దిల్ రాజు గారు, ఆనంద్ దేవరకొండ గారు మా మూవీ ట్రైలర్ లాంఛ్‌కు రావడం హ్యాపీగా ఉంది. ఈ రోజు నుంచే మా మూవీ ప్రేక్షకుల్లోకి వెళ్లడం మొదలవుతుందని భావిస్తున్నా. నేను, కల్యాణ్ ఈ మూవీకి బాగా స్క్రిప్ట్ చేసేలా కావాల్సినంత సపోర్ట్ మా ప్రొడ్యూసర్స్, డైరెక్టర్ ఇచ్చారు. "సంతాన ప్రాప్తిరస్తు" ఒక మంచి ఎంటర్ టైనింగ్ మూవీ. మీ అందరికీ నచ్చుతుంది. అన్నారు. డైరెక్టర్ సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు" ఒక ప్యూర్ లవ్ స్టోరీ. ఈ కథకు ఫ్యామిలీ ఎమోషన్స్, ఎంటర్ టైన్‌మెంట్‌తో పాటు ఒక చిన్న సోషల్ ఇష్యూను కూడా జతచేసి రూపొందించాం. మ్యూజిక్ డైరెక్టర్ అజయ్ అరసాడ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాం.

# అదరగొట్టిన 'పెద్ది'



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ మోస్ట్ ఎవైటెడ్ మోస్ట్ రస్టిక్ యాక్షన్ డ్రామా 'పెద్ది' ఫస్ట్ సింగిల్ అయిన చికిరి చికిరి ప్రోమోకు అద్భుతమైన స్పందన వచ్చింది, లిరికల్ వీడియోపై భారీ అంచనాలని పెంచింది. బుచ్చి బాబు సాన, ఈసారి ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రహ్మాన్‌తో పని చేయడం తన కల నెరవేరినట్టుగా చెప్పారు. గాయకుడు మోహిత్ చౌహాన్ తన ఎనర్జిటిక్ వోకల్స్‌తో పాటకు జీవం పోశారు. జాని మాస్టర్ కొరియోగ్రఫీతో పాట విజువల్స్ మరింత బ్యూటీఫుల్ గా మారాయి. జాన్వీ కపూర్ ఇంట్రో షాట్ ఈ సాంగ్‌లో హైలైట్‌గా నిలిచింది. ఆమె దీపాన్ని ఎత్తి తన లుక్‌ని రివీల్ చేసే సీన్ మ్యాజిక్ లా ఉంది. ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకి టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఆర్ రత్నవేలు డీవోపీ కాగా, జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్. పెద్ది మార్చి 27, 2026న రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# 'కాంత' అందరికీ నచ్చుతుంది



రానాతో కలసి 'కాంత' సినిమా చేయడం చాలా ఆనందంగా వుంది. సినిమాని కచ్చితంగా థియేటర్స్‌లో చూడండి. ఎందుకంటే ఇది గ్రేట్ ఎక్స్పీరియన్స్: ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరో దుల్కర్ సల్మాన్‌రెబెల్ స్టార్ ప్రభాస్ లాంచ్ చేసిన దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి 'కాంత' ఇంటెన్స్ ట్రైలర్‌దుల్కర్ సల్మాన్ 'వేఫేర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రానా దగ్గుబాటి' స్పిరిట్ మీడియా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ వాల్యూస్ అద్భుతంగా వున్నాయి. ఇంటెన్స్ ఎమోషన్స్‌తో ఆకట్టుకున్న 'కాంత' ట్రైలర్ సినిమాపై అంచనాలు మరింతగా పెంచింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ.. ట్రైలర్ మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాని కచ్చితంగా థియేటర్స్‌లో చూడండి. ఎందుకంటే ఇది గ్రేట్ ఎక్స్పీరియన్స్. తెలుగు ఆడియన్స్ ఇచ్చే ఎనర్జీ నెక్స్ట్ లెవెల్ లో ఉంటుంది. .హీరో రానా దగ్గుబాటి మాట్లాడుతూ.. కాలాన్ని సినిమా మాత్రమే రీ క్రియేట్ చేయగలదు. ఒక్క బ్యాక్ డ్రాప్‌లో సెల్వ కథ చెప్పడం జరిగింది. కథ విన్న వెంటనే కచ్చితంగా ఈ సినిమా చేయాలనిపించింది. థాంక్యూ. భాగ్యశ్రీ మాట్లాడుతూ.. ఇప్పటివరకు నా సినిమాలు చూశారు. ఈ సినిమాలో నేను యాక్ట్ చేయడం చూస్తారు. కాంత నాకు చాలా చాలా స్పెషల్. మీ అందరి ప్రేమకు థాంక్ యూ. ఈ సినిమాని థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను. సముద్రఖని మాట్లాడుతూ..కాంత సినిమాలో నటించడం చాలా గర్వంగా ఉంది. ఇది చాలా ప్రౌడ్‌గా ఫీల్ అయ్యే సినిమా. సినిమాని ఫ్యామిలీతో కలిసి చూడండి. చాలా ఎంజాయ్ చేస్తారు డైరెక్టర్ సెల్వమణి సెల్వరాజ్ మాట్లాడుతూ.. గత ఏడాదిగా రామానాయుడు స్టూడియో నా హోమ్‌గా మారింది. సినిమా మొత్తం హైదరాబాద్‌లో షూట్ చేశాం.

## మహిళల ఐపిఎల్ మెగావేలంలో..

# భారత్ క్రీడాకారిణులకు బిగ్ ఛాన్స్


హర్మన్‌ప్రీత్ కౌర్


జెమీమా రోడ్రిగ్స్


షఫాలీ వర్మ


స్మృతి మంధాన

## ఫ్రాంచైజీల రిటైన్ లిస్ట్‌లో ప్లేస్ సేఫ్

**న్యూఢిల్లీ:** మహిళల వన్డే ప్రపంచకప్ 2025 విజయంతో భారత మహిళల క్రికెట్ జట్టుకు మంచి క్రేజ్ ఏర్పడింది. భారత అమ్మాయిల విజయం వెనుక వుమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) పాత్ర కూడా ఉంది. టీమిండియా జట్టులోని పలువురు సభ్యులు డబ్ల్యూపీఎల్ ఫ్రాంచైజీల టీముల్లో ఉన్నారు. ఇప్పటికే మూడు సీజన్లు పూర్తి చేసుకున్న డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ కోసం సమాయత్తమవుతుంది. గత మూడు సీజన్లలో ముంబై ఇండియన్స్ రెండు సార్లు డబ్ల్యూపిఎల్ టైటిల్ గెలవగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఒకసారి గెలిచింది. ఇక 4వ విడత డబ్ల్యూపీఎల్ 2026కు సంబంధించిన మెగా వేలం ఈ నెల 27న జరగనుంది. ఈ మెగా వేలం రూల్స్ ప్రకారం ప్రతి జట్టు గరిష్టంగా ఐదుగురు ప్లేయర్లను మాత్రమే రిటైన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో గరిష్టంగా ముగ్గురు భారత క్యాప్డ్ ప్లేయర్లు, ఇద్దరు ఫారిన్ ప్లేయర్లు, ఇద్దరు క్యాప్డ్ ప్లేయర్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఇక వేలం పర్స్ వాల్యూను రూ.15 కోట్లుగా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆయా ఫ్రాంచైజీలు తమ జట్లలోని ప్లేయర్ల రిటైన్, రిలీజ్ జాబితాలను ఖరారు చేశాయి. డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్‌తో పాటు, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తమకు కలిసొచ్చే ఆటగాళ్లను రిటైన్ చేసుకొని అవసరం లేని ఆటగాళ్లను వేలంలోకి వదిలేసాయి. ముంబై, బెంగుళూరు, ఢిల్లీ ఐదుగురి ఆటగాళ్లను, యూపీ ఒకే ఒక్క ప్లేయర్‌ను అంటిపెట్టుకుంది. ముంబై అట్టిపెట్టుకునే జాబితాలో నాట్ సీవర్ బ్రంట్ (రూ.3.5 కోట్లు), హర్మన్‌ప్రీత్ కౌర్ (రూ.2.5 కోట్లు), కమిలిని, రిలీజ్‌లో అక్షితా మహేశ్వరి, పూజా, ఢిల్లీ రిటైన్‌లో జెమీమా రోడ్రిగ్స్(రూ.2.2 కోట్లు), షఫాలీ వర్మ(రూ.2.2 కోట్లు), నికీ ప్రసాద్, రిలీజ్ లిస్ట్‌లో చరణి, నందిని కశ్యప్, అరుంధతిరెడ్డి, మిన్ను మణి, రాధా యాదవ్, స్నేహ దీప్తి, టిటాస్ సాధు. రాయల్ ఛాలెంజర్స్ రిటైన్‌లో స్మృతి మంధాన(రూ.3.5 కోట్లు), రిచా (రూ.2.75 కోట్లు), రిలీజ్‌లో రాఘవి బిస్త్, మేఘన, శోభనా, సోఫీ డివైన్, రేణుకా, యూపీవారియర్స్ రిలీజ్‌లో క్రాంతి, దీప్తి శర్మ, చమరి అతపత్తు, సోఫీ ఎక్లెస్టోన్, సైమా, గుజరాత్ జెయింట్స్ రిలీజ్ లిస్ట్ దయాళన్ హేమలత, మేఘనా సింగ్.



## ఫిడే వరల్డ్ కప్‌లో.. భారత్ గ్రాండ్ మాస్టర్ల దూకుడు

**న్యూఢిల్లీ:** ఫిడే వరల్డ్ కప్‌లో భారత గ్రాండ్ మాస్టర్లు దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఇందులో భాగంగా విదిత్ గుజరాతీ ఎట్టకేలకు రెండో ర్యాపిడ్ గేమ్‌లో అర్జెంటీనా వండర్ కిడ్ ఫాస్టినో ఓరో డిఫెన్స్‌ను ఛేదించగలిగాడు. వి ప్రణవ్, ఎం ప్రాణేష్ కూడా ఈ టోర్నమెంట్‌లో మూడవ రౌండ్‌కు చేరుకుని మొదటి సెట్ ర్యాపిడ్ గేమ్‌లలో తమ ప్రత్యర్థులపై విజయం సాధించారు. రెండు క్లాసికల్ గేమ్‌లలో 12 ఏళ్ల ఓరో ఒత్తిడి తెచ్చినా కానీ విదిత్ రెండవ రాపిడ్ గేమ్‌లో బ్లాక్ పావులతో 52మూవ్‌ల విజయాన్ని సాధించాడు. అలాగే ప్రణవ్ నార్వేకు చెందిన ఆర్యన్ తారిని ఓడించగా, ప్రాణేష్ జర్మనీకి చెందిన దిమిత్రిజ్ కొల్లార్స్‌ను ఓడించి ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేష్, ఎరిగాసి అర్జున్, పి హరికృష్ణ, కార్తీక్ వెంకట్రామన్, దీప్తయన్ ఘోష్ వంటి వారితో తదుపరి రౌండ్‌లో చేరాడు. అయితే మరో భారత్ గ్రాండ్ మాస్టర్ నిహాల్ సరిన్ బిలీ స్టామటిస్ కౌర్కౌలోస్ ఆర్డిటిస్ (గ్రీస్) చేతిలో ఓడిపోయాడు. ఇక విదిత్ ఇప్పుడు అమెరికాకు చెందిన సామ్ షాంక్లాండ్‌తో తలపడనున్నాడు. అతను రెండవ రౌండ్‌లో గ్రాండ్‌మాస్టర్ వాసిల్ ఇవాన్‌చుక్‌ను ఓడించాడు. ఇతర బోర్డులలో జరిగిన రెండవ క్లాసికల్ గేమ్‌లో ప్రపంచ జూనియర్ ఛాంపియన్ ప్రణవ్, రూక్‌పాన్ ముగింపులో 44 కదలికలలో మొదటి రాపిడ్ గేమ్‌ను గెలుచుకున్నాడు. ఆ తర్వాత అతను రెండవ గేమ్‌లో బ్లాక్‌తో నార్వేజియన్‌ను డ్రాగా ముగించాడు. ప్రాణేష్, కొల్లార్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో, బ్లాక్ గేమ్ ఆడుతున్న భారత ఆటగాడు, రెండవ రాపిడ్ గేమ్‌లో 24వ మూవ్‌లో ఆధిక్యాన్ని సాధించాడు.

## వన్డే సిరీస్‌లో పాకిస్థాన్ చిత్తు

**న్యూఢిల్లీ:** వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికా పాకిస్థాన్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. ఫైసలాబాద్‌లోని ఇక్బాల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన రెండో వన్డేలో పాకిస్తాన్‌పై 8 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. ఈ విజయం దక్షిణాఫ్రికా మూడు మ్యాచ్‌ల వన్డేసిరీస్‌ను 1-1తో సమంచేయడంలో సహాయపడింది. దక్షిణాఫ్రికా 270పరుగుల లక్ష్యంలో భాగంగా లువాన్‌డ్రే ప్రిటోరి యస్ (46) తో కలిసి 81 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం ఇన్నింగ్స్‌కు వేదికగా నిలిచింది. డి కాక్, టోనీ డి జోర్జీ (63 బంతుల్లో 76) ల మధ్య 153 పరుగుల భాగస్వామ్యంతో ఇన్నింగ్స్ నిజంగా సజీవంగా మారింది. డి జోర్జీ బౌండరీలతో నిండిన ఇన్నింగ్స్‌తో పాకిస్తాన్‌కు భారీ నష్టాన్ని కలిగించాడు. డి కాక్, స్టాండ్‌ఇన్ కెప్టెన్ మాథ్యూ బ్రీట్జ్కే (17) తో కలిసి, దాదాపు 10 ఓవర్లు మిగిలి ఉండగానే ఛేజింగ్‌ను 40.1 ఓవర్లలో 270/2 వద్ద ముగించాడు. మొదట బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్, దక్షిణాఫ్రికా పేస్ దాడికి ప్రారంభంలోనే విఫలమైంది. ఎడమచేతి వాటం సీమర్ నాండ్రే బర్గర్ మొదటి 5 ఓవర్లలోనే ఫఖర్ జమాన్, బాబర్ అజామ్, మహ్మద్ రిజ్వాన్ వికెట్లతో సహా 4/46 వికెట్లు తీసుకు న్నాడు. అతని కఠినమైన పేస్, స్వింగ్ పాకిస్తాన్‌ను 22/3 వద్ద కుప్పకూల్చాయి. లెగ్‌స్పిన్నర్ న్కాబా పీటర్ కెరీర్‌లో అత్యుత్తమ గణాంకాలు 3/55 సాధించాడు. ప్రారంభ పతనం ఉన్నప్పటికీ, సైమ్ అయూబ్ (53), సల్మాన్ అలీ ఆఘా (69), మహ్మద్ నవాజ్ (59) ప్రతిఘటించి పాకిస్తాన్‌ను 269/9కి పెంచారు. అయితే, దక్షిణాఫ్రికా ఫామ్‌లో ఉన్న టాప్ ఆర్డర్‌ను అధిగమించలేకపోయారు.

## అనధికారిక మ్యాచ్‌లో..

# భారత్‌కు 34 రన్స్ ఆధిక్యం



**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో జరుగుతున్న అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో భారత్ 34 పరుగుల ఆధిక్యంలో ఉంది. రెండో అనధికారిక టెస్టు మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 47.3 ఓవర్లలో 221 పరుగులకే ఆలౌట్ అయింది. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో కెప్టెన్ అకెర్‌మన్ విధ్వంసకర శతకంతో ఒంటరి పోరాటం చేశాడు. సహచరులు సహకరించక పోయినా, ఒక్కడే నిలబడి 200 పరుగుల మార్కును దాటించాడు. కేవలం 118 బంతుల్లోనే 17 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 134 పరుగులుచేశాడు. అకెర్‌మన్ కాకుండా దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో జోర్డన్ హెర్మన్ (26), సుబ్రాయన్ (20) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో టీమ్ కెప్టెన్ టెంబా బావుమా సహా నలుగురు డకౌట్లయ్యారు. అంతకు ముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 255 పరుగులకు ఆలౌట్ అయింది. ధ్రువ్ జురెల్ (132) వీరోచిత శతకంతో టీమిండియా పరువు కాపాడాడు. 126 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన జురెల్ టెయిలెండర్లు కుల్దీప్ (20), సిరాజ్ (15) సహకారంతో టీమిండియాకు గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. భారత్ ఇన్నింగ్స్‌లో సీని యర్లు కెఎల్ రాహుల్ (19), సాయి సుదర్శన్ (17), అభిమన్యు ఈశ్వరన్ (0), దేవదత్ పడిక్కల్ (5), రిషబ్ పంత్ (24) తక్కువ స్కోర్లకే ఔటయ్యారు. ఇక దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 221 పరుగులకు ఆలౌట్ కావడంతో భారత్ 34 పరుగుల ఆధిక్యంలోఉంది.

## హాంగ్‌కాంగ్ సిక్సస్ టోర్నీలో భారత్ చేతిలో పాకిస్థాన్‌కు పరాభవం



**న్యూఢిల్లీ:** భారత్ చేతిలో పాకిస్థాన్‌కు మరోసారి పరాభవం ఎదురైంది. హాంగ్‌కాంగ్ సిక్సస్ టోర్నీలో పాకిస్థాన్‌పై భారత్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 2 పరుగుల తేడాతో విజయం సాధించింది. మాంగ్ కాక్ వేదికగా శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 6 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 86 పరుగులు చేసింది. ఓపెనర్లు రాబిన్ ఊతప్ప (28), భరత్ చిప్లి (24) ఒక మాదిరిగా ఆడారు. ఆఖర్లో కెప్టెన్ దినేశ్ కార్తిక్ (17 నాటౌట్) సైతం బ్యాట్‌కు పనిచెప్పాడు. భారత్ ఇన్నింగ్స్‌లో స్టువర్ట్ బిన్ని 4, మిథున్ 6 పరుగులు చేశారు. పాక్ బౌలర్లలో మహమ్మద్ షెహజాద్ 2, అబ్దుల్ సమద్ ఒక వికెట్ తీశారు. అనంతరం పాకిస్థాన్ 87 పరుగుల లక్ష్య ఛేదనలో వరుణుడు అడ్డు పడ్డాడు. దీంతో పాక్ స్కోర్ 41/1 (3 ఓవర్లు) వద్ద ఉండగా వర్షం మొదలైంది. ఎంతకీ తగ్గకపోవడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం భారత్‌ను విజేతగా ప్రకటించారు. మ్యాచ్ ముగిసే సమయానికి ఖ్వాజా నఫీ (18 నాటౌట్), అబ్దుల్ సమద్ (16 నాటౌట్) క్రీజులో ఉన్నారు. మాజ్ సదాఖత్ (7) ఔట్ కాగా, సదాఖత్ వికెట్ స్టువర్ట్ బిన్నికి దక్కింది. ఈ టోర్నీలో భారత్ తమ తదుపరి మ్యాచ్ కువైట్‌తో తలపడనుంది.

## స్టాక్ మార్కెట్లకు మూడో రోజూ తప్పని నష్టాలు



**ముంబయి, నవంబరు 7:** అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల ధోరణులు, విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలకే ఎక్కువ ఆసక్తిచూపించడంతో భారత స్టాక్ సూచీలు మూడోరోజు కూడా నష్టాల్లోనే ముగిసాయి. ఉదయంనుంచే నష్టాలతోట్రేడింగ్ ప్రారంభం అయింది. పిఎస్‌యు బ్యాంకుల్లో కొనుగోళ్ల మద్దతుతో ఒకదశలో లాభాల్లోకి వచ్చి మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. దీనితో వారాంతంలో సూచీలకు భారీ నష్టాలకు కొంత బ్రేక్‌పడింది. నిఫ్టీ 25,500 దిగువన ట్రేడింగ్ ముగించింది. సెన్సెక్స్ 83,150.15 పాయింట్ల వద్ద ప్రారంభం అయి ఇంట్రాడేలో 82,670.95వద్ద కనిష్టస్థాయికి వెళ్లింది. ఆ తర్వాత లాభాల్లోకి వచ్చిన సూచీ చివరికి 94.73 పాయింట్లవద్ద నష్టంతో ముగిసింది. 83,216.28వద్దముగిసింది. నిఫ్టీకూడా 17.40 పాయింట్ల నష్టంతో 25,492.30వద్ద స్థిరపడింది. డాలరుతోరూపాయి మారకం విలువలు 88.65గా నడిచింది. సెన్సెక్స్ సూచీల్లో బ్లాక్‌డీల్ తో ఎయిర్‌టెల్ సుమారు 4శాతం నష్టపోయింది. 0.8శాతం వాటాను సింగ్‌టెల్ విక్రయించడంతో ఎయిర్‌టెల్‌షేర్లు ఒత్తిడిలో ముగిసాయి. టెక్‌మహీంద్ర, ట్రెంట్, రిలయన్స్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టాల్లోముగిసాయి. బజాజ్‌ఫైనాన్స్, టాటా స్టీల్, మహీంద్ర అండ్ మహీంద్ర, బజాజ్ ఫిన్‌సెర్వ్, ఐసిఐసిఐబ్యాంకు షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడిచమురుబ్యారెల్‌కు 64 డాలర్లవద్ద కొనసాగితే ఔన్స్ బంగా రంధరలు 4004 డాలర్లవద్ద ట్రేడ్ అయింది.

## రిటైల్‌ద్రవ్యోల్బణం 0.6% అంచనా

### రేటింగ్ సంస్థల ఆర్థికవేత్తల విశ్లేషణ



**న్యూఢిల్లీ, నవంబరు 7:** దేశంలో రిటైల్‌ద్రవ్యోల్బణం రికార్డుస్థాయికి అక్టోబరులో నమోదు అయింది. కూరగాయల ధరలు తగ్గడమే ఇందుకుకారణం. జిఎస్టీ, సేవలరంగ పన్నులు తగ్గింపు కూడా ఒకింత కారణం అయింది. రిజర్వుబ్యాంకు అంచనాలు కూడా ద్రవ్యోల్బణం పరంగా తగ్గించింది. మార్కెట్ నిపుణులు ఎక్కువశాతం 0.2నుంచి 0.6శాతంగా రిటైల్‌ద్రవ్యోల్బణం ఉంటుందని వెల్లడించారు. సెప్టెంబరులో నమోదయిన 1.5శాతంతో పోలిస్తే తగ్గుతుందని అంచనావేసారు. ఆర్‌బిఐ కూడా తన ఎంపిసి సమీక్షలో ఈ ఆర్థికసంవత్సరం రిటైల్‌ద్రవ్యోల్బణం 2.6శాతం మించకపోవచ్చని వెల్లడించింది. బ్యాంక్ ఆఫ్ బరోడా అంచనాలు చూస్తే 0.4నుంచి మైనస్ 0.6శాతంగా ఉండవచ్చని వెల్లడించింది. జిఎస్టీ రేట్ క్రమబద్ధీకరణ ఇందుకు దోహదంచేస్తుందని బీవోబీ అంచనావేసింది. ఇక్రా అంచనాలనుచూస్తే అక్టోబరులో రిటైల్‌ద్రవ్యోల్బణం 0.5శాతంగా ఉంది. ఎంపిసి కమిటీ డిసెంబరులో మళ్లీ సమావేశం కానుంది. అప్పటికి సగతున 2026లో రిటైల్ ద్రవ్యోల్బణం ప్రస్తుతం ఉన్న 2.6శాతంనుంచి 2.6శాతంగా ఉండవచ్చని ఇక్రా ఆర్థికవేత్త అదితినాయర్ అన్నారు. డిబిఎస్ బ్యాంకు ఆర్థికవేత్త రాధికా రావు మాట్లాడుతూ రిటైల్‌ద్రవ్యోల్బణం మరింత తగ్గుతుందని వెల్లడించారు. వార్షికపద్ధతిలోచూస్తే ద్రవ్యోల్బణం 0.2శాతం తగ్గుతుందని వెల్లడించారు.

## రూ.2 లక్షలకు చేరువకానున్న వెండి

### పెరుగుతున్న పెట్టుబడులే కారణమంటున్న రేటింగ్ సంస్థలు



**న్యూఢిల్లీ, నవంబరు 7:** అమెరికా, భారత్‌లమధ్య జరుగుతున్న వాణిజ్యచర్చలు కొలిక్కివచ్చేలోపే వెండి బంగారంధరలపై ఈ ప్రభావం ఎక్కువ చూపిస్తోంది. భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న బంగారం, వెండి ధరలకు ఈ చర్చలు కొలిక్కివస్తే బ్రేక్ వేసే అవకాశం ఉంది. దేశ ఫ్యూచర్స్ మార్కెట్లో బంగారం ధరలు వాటి గరిష్ట స్థాయి నుండి 10 శాతానికి పైగా తగ్గాయి. ఇంతలో వెండి ధరలు వాటి గరిష్ట స్థాయి నుండి దాదాపు 14 శాతం తగ్గాయి. అంటే బంగారం,వెండి ధరలు ఇప్పటికే ఒక నెల రోజుల్లో గణనీయమైన దిద్దుబాటును చూశాయి. అంతర్జాతీయ మార్కెట్లో వెండి ప్రస్తుతం ఔన్సుకు 48 డాలర్లనుండి 50డాలర్ల వరకు ఉంది. ప్రస్తుత సంవత్సరం చివరి వరకు వెండి ధరలు ఈ శ్రేణిలో ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఇంకా వచ్చే ఏడాది మధ్య నాటికి, వెండి ధరలు ఔన్సుకు 60 నుండి 75డాలర్ల వరకు చేరుకోవచ్చు. చైనా, భారతదేశంతో సహా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలు పూర్తిగా తిరిగి తెరిచినందున నిపుణులు వెండి ధరలపై గణనీయమైన పందెం వేస్తున్నారు. ఈనేపథ్యంలో కిలో వెండి రెండులక్షలరూపాయలు దాటినా ఆశ్చర్యపోనవసరం లేదని రేటింగ్ సంస్థలు పేర్కొంటున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాలు, సౌర ఫలకాల ఉత్పత్తి పెరుగుతోంది. చైనా, యునైటెడ్ స్టేట్స్ మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారు కావడం వల్ల చైనా పరిశ్రమలు గణనీయమైన వృద్ధికి దారి తీస్తాయి. తత్ఫలితంగా వెండికి పారిశ్రామిక డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు.

వాణిజ్యం



## స్వల్పంగా తగ్గిన పసిడి ధరలు

**న్యూఢిల్లీ, నవంబరు 7:** దేశంలో వివిధ మార్కెట్లలో బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. 24 క్యారెట్ల బంగారం గ్రాముకు రూ.55 తగ్గింది. ఒక గ్రాముధర 12,202 చొప్పునట్రేడ్ అయింది. 2 2క్యారెట్ల బంగారంధరలు రూప50 తగ్గి ఒక గ్రాము 11,185గా ట్రేడ్ అయింది. 18 క్యారెట్లు రూ.41 తగ్గి గ్రాము రూ.9152గా ధరలు నడిచాయి. ఇక హైదరాబాద్‌లోపదిగ్రాముల 24 క్యారెట్లు బంగారంధరలు రూ.550 తగ్గి 1,22,020 వద్ద నడిచింది. 22 క్యారెట్లుధరలు రూ.500తగ్గి 1,11,850 పలికింది. 18 క్యారెట్లపరంగా చూస్తే రూ.410 తగ్గి రూ.91,520గా నమోదయింది. ఇక చెన్నైలో పసిడిధరలు పదిగ్రాములు 24 క్యారెట్లు రూ.1,22,950గాను, 22 క్యారెట్లు రూ.1,12,700 గాను, 18 క్యారెట్లధరలు రూ.94వేలుగా కొనసాగాయి. ముంబయిలో 24క్యారెట్లు బంగారం కూడా రూ. 550 తగ్గి రూ.1,22,020 వద్దట్రేడ్ అయింది. 22 క్యారెట్లు1,11,850గాను, 18క్యారెట్ల ధరలు రూ.91,520గాను నమోదయ్యాయి. ఇక దేశ రాజధాని ఢిల్లీలో పదిగ్రాముల ధరలు రూ.1,22,170వద్ద నమోదయింది. 22 క్యారెట్లు 1,12,030గాను, 18 క్యారెట్ల పసిడి ధరలు రూ.91,670గాను నడిచాయి. బెంగళూరు ధరల పరంగాచూస్తే పదిగ్రాములు 24 క్యారెట్లు రూ.1,22,020గాను, 22 క్యారెట్లు రూ.1,11,850గాను,18 క్యారెట్ల బంగారం రూ.91,520గాను నమోదయ్యాయి.

## జి7 కంటే బ్రిక్స్‌దేశాల వృద్ధి ఎంతో బెటర్



**న్యూఢిల్లీ, నవంబరు 7:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత వృద్ధి అంచనాను ఐఎంఎఫ్ 6.4 శాతంగా అంచనా వేసింది. ఇది బలమైన వృద్ధి నేపథ్యంలో అమెరికా సుంకాల ప్రభావాన్ని అధిగమించింది. ఐఎంఎఫ్ అంచనా ప్రకారం ప్రపంచ జనాభాలో సగం మంది ప్రాతినిధ్యం వహిస్తున్న బ్రిక్స్ దేశాలలో భారత్ అత్యంత వేగవంతమైన వృద్ధి రేటును చూస్తుందని అంచనా. అయితే బ్రిక్స్ దేశాలలో ఇథియోపియా అత్యధికంగా 7.2 శాతం వృద్ధి అంచనాను కలిగి ఉంది. జి7 దేశాలతో పోలిస్తే బ్రిక్స్ దేశాలలో సగటు వృద్ధి 3.8 శాతంగా ఉంటుందని అంచనా, ఇది చాలా ఎక్కువ. బ్రెజిల్ 2.40 శాతం, రష్యా 0.60 శాతం, భారతదేశం 6.60 శాతం, చైనా 4.80 శాతం, దక్షిణాఫ్రికా 1.10 శాతం, సౌదీ అరేబియా 4.00 శాతం, ఈజిప్టు 4.30 శాతం, యుఎఇ 4.80 శాతం, ఇథియోపియా 7.20 శాతం, ఇండోనేషియా 4.90 శాతం, ఇరాన్ 0.60 శాతం, సగటున బ్రిక్స్ దేశాల్లో వృద్ధి 3.8శాతంగా ఉంటుందని అంచనా. ఐఎంఎఫ్ అంచనా ప్రకారం జి7 సగటు వృద్ధి 1 శాతం ఉంటుం దని అంచనా. వృద్ధాప్య జనాభా, తగ్గిన కార్మిక సరఫరా, పెరిగిన ఆర్థిక ఒత్తిడి ఈ దేశాలు ఎదురుగాలులనుఎదుర్కొం టున్న ప్రధానకారకాల్లో ఉన్నాయి. మరీ ముఖ్యంగా 2025లో జర్మనీ ప్రపంచంలోనే అత్యంత నెమ్మదిగా జిడిపి వృద్ధి రేటును నమోదు చేసే దేశాలలో ఒకటిగా ఉంటుందని భావిస్తున్నారు. ఐఎంఎఫ్ ప్రకారం ఆ దేశ జిడిపి కేవలం 0.2 శాతం మాత్రమే పెరుగు తుందని అంచనా. జి7 కూటమిలోని దేశాల్లో కెనడా 1.20 శాతం, ఫ్రాన్స్ 0.70 శాతం, జర్మనీ 0.20 శాతం, ఇటలీ 0.50 శాతం, జపాన్ 1.10శాతం, యుకె 1.30 శాతం, అమెరికా 2.00 శాతంగా ఉన్నాయి. మరోవైపు భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఏప్రిల్‌జూన్ కాలంలో ఐదు త్రైమాసికాల గరిష్ట వృద్ధి రేటు 7.8 శాతం సాధించింది. ఇది యుఎస్ సుంకాలను అమలు చేయడానికి ముందు గణనీయమైన వేగాన్ని ప్రదర్శించింది. అక్టోబర్ ప్రారంభంలో ప్రపంచ బ్యాంకు కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారతదేశ వృద్ధి అంచనాను గతంలో అంచనా వేసిన 6.3 శాతం నుండి 6.5శాతానికి పెంచింది, దేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థికవ్యవస్థగా ఉంటుందని అంచనావేసింది. జూలైలో ఐఎంఎఫ్ భారతదేశ ఆర్థిక వృద్ధి అంచనాను 2025, 2026 రెండింటికీ 6.4 శాతానికి సవరించింది. ఏప్రిల్ 2025 వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్‌లో దేశ ఆర్థిక వృద్ధిని 2025కి 6.2శాతం, 2026కి 6.3 శాతంగా అంచనా వేసింది.

## ఎలాన్ మస్క్‌కు టెస్లా లక్షకోట్ల డాలర్ల వేతన ప్యాకేజి



**లాస్ ఏంజిల్స్, నవంబరు 7:** కార్పొరేట్ చరిత్రలోనే ఎలన్ మస్క్ సంచలనం సృష్టించారు. అత్యధిక జీతం అందుకుంటున్న సీఈవోగా ఆయన రికార్డు క్రియేట్ చేశారు. జీతం కింద మస్క్‌కు లక్షకోట్ల డాలర్లు ఇచ్చేందుకు టెస్లా కంపెనీ షేర్‌హోల్డర్లు ఆమోదించారు. దీంతో పే ప్యాకేజీలో కొత్త రికార్డు క్రియేట్ అయ్యింది. కంపెనీకి చెందిన షేర్‌హోల్డర్లలో 75 శాతం ఓట్లు ఆయనకు అనుకూలంగా వచ్చాయి. వార్షిక కంపెనీ మీటింగ్‌లో మస్క్ జీతంపై నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ప్రపంచ కుబేరుడైన మస్క్.. ఇప్పుడు తన సంపదను మరింత పెంచుకోనున్నారు. అయితే రాబోయే పదేళ్లలో ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ టెస్లా మార్కెట్ వాల్యూ ఆయన మరింత పెంచాల్సి ఉంటుంది. ఒవకేళ షేర్‌హోల్డర్లు అనుకున్నట్లు మస్క్ తన లక్ష్యాలను సాధిస్తే, అప్పుడు ఆయనకు లక్షల సంఖ్యలో షేర్లు కలిసిరానున్నాయి. మరీ భారీగా జీతాన్ని ఇవ్వడం పట్ల విమర్శలు వచ్చాయి. కానీ టెస్లా బోర్డు మాత్రం సీఈవో మస్క్‌కు అండగా నిలిచింది. ఒకవేళ ఆయన జీతాన్ని ఆమోదించకుంటే, అప్పుడు ఆయన ఈ కంపెనీ వదిలి వెళ్లే అవకాశాలు ఉన్నట్లు బోర్డుభయాందోళనకు గురైంది. ప్రస్తుతం ఉన్న దశలో మస్క్‌ను వదులుకోలేమని టెస్లా బోర్డు చెప్పింది. టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో ఉన్న మస్క్ తన జీతం విషయం తెలియగానే ఆయన సంతోషాన్ని ఆపుకోలేకపోయారు. టెస్లాలో ఇది కొత్త అధ్యాయంమాత్రమే కాదు, ఇదో కొత్త చరిత్ర అవుతుం దన్నారు. మస్క్ కు ట్రిలియన్ డాలర్ల పేప్యా కేజీ అందాలంటే ఆయన ముందు కొన్ని టార్గెట్లను పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం టెస్లా మార్కెట్ విలువ 1.4 ట్రిలియన్ల డాలర్లుగా ఉన్నది. అయితే ఆ మార్కెట్ విలువను ఆయన 8.5 ట్రిలియన్ డాలర్లకు చేర్చాల్సి ఉంటుంది. స్వీయ డ్రైవింగ్ చేస్తున్న లక్షల సంఖ్యలో రోబో ట్యాక్సీ వాహనాలను ఆయన కమర్షియల్ ఆపరేషన్ లోకి తీసుకురావాల్సి ఉంటుంది. ఒకవేళ అన్నీ అనుకుట్లే సాగితే, ప్రపంచ కుబేరుడు మస్క్ ప్రపంచంలోనే తొట్టతొలి ట్రిలియనీర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.